ఎ.ఎం.ఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 4

మే, 2013

ఎడిటర్
**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**
**డా॥ వి. శివ శంకర ప్రసాద్**
**డా॥ కె. ఆసయ్య**
**శ్రీమతి ఆర్. శివపార్వతి**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
2.20 కోట్ల కుటుంబాలకు 'అమ్మహస్తం' ..... 3
బిఎన్‌విలు సేవాభావంతో పనిచేయాలి గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీ శశిభూషణ్‌కుమార్ ..... 4
భారత ప్రజాస్వామ్య నడవడికకు మార్గం చూపిన వ్యక్తి డా॥ బి.ఆర్. అంబేద్కర్ ..... 5
అపార్డ్‌లో డా॥ బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవం ..... 6
అపార్డ్‌ను సందర్శించిన యు.జి.సి. బృందం ..... 7
అపార్డ్ కమీషనర్‌కు ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం ..... 8
గోరంత బీమా, కొండంత ధీమా నెలకు ఒక్క రూపాయితో రూ. 2 లక్షల బీమా, ఇతర సంక్షేమ పథకాలు ..... 9
ఒకచో నేలను పవ్వళించు... (వెంటాడే వాక్యం) ..... 10
గ్రామీణాభివృద్ధిలో సమాచార హక్కు ప్రాముఖ్యత ..... 11
వికలాంగుల సంక్షేమానికి అంకితమైన డా. రామభద్రాచార్య ..... 12
రూ.2,500 కోట్ల వ్యయంతో బకింగ్‌హాం కాలువ పునరుద్ధరణ యత్నాలు ..... 13
సమాచార హక్కు చట్టంలో పౌర హక్కులు ..... 15
కొత్తగా సర్వీసులో చేరిన ఉద్యోగులు సర్వీసు రిజిష్టరులో సరిచూసుకోవలసిన అంశాలు ..... 16
పథకానికి పది పశ్నలు - బాలికా శిశు సంరక్షణ పథకం ..... 17
బాలల హక్కులు పర్యవేక్షించే చట్టం ..... 19
జాలిగుండె లేని కొడుకుని కన్నా ..... 23
గ్రామీణాభివృద్ధిపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించిన అపార్డ్ ..... 25
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ద్వారా "పిల్లల మనుగడ, ఎదుగుదల" ..... 26
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 2005-కూలీల హక్కులు ..... 29
ఆదర్శ గ్రామ నిర్మాతలుగా మారుతున్న లంబాడిపల్లె, మాణిక్యాపూర్ బిఎన్‌విలు ..... 30
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 32
తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించటం ఎలా ? ..... 34
మహిళలు గ్రామీణాభివృద్ధి - తీరు తెన్నులు ..... 37
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో సంపూర్ణ పారిశుద్యం ..... 39
షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక కింద 2013-14 సంవత్సరంలో నిధుల కేటాయింపులు ..... 40
'నిర్భయ' చట్టం ఏమి చెప్తోంది ? ..... 42
ఇంటర్‌నెట్ ద్వారా భూసార ఫలితాల సమాచారం ..... 46
దార్శనికతకు జలగం వెంగళరావు ..... 47
గర్భవతులకు తరచూ వచ్చే సందేహాలకు సమాధానాలు ..... 49
అప్పుడు గంగిరెద్దే జీవనం! ఇప్పుడు చిన్న ఊటకుంటే జీవితం!! ..... 52
రేయింబవళ్ళు జరుగుతున్న రైవాస్ కాల్వ ఆధునికీకరణ సేవలు ..... 53
విజ్ఞానం నా దేవుడు - పని నా మతం ..... 54
జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవ సందర్భంగా స్మరించుకోవలసిన బల్వంత్ రాయ్ మెహతా ..... 56
మొక్కల రకాలను, రైతుల హక్కులను పరిరక్షించే సంస్థ ..... 57
మన చిన్నారులకు పోషకాహార లోపం ..... 60
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల చేతిలో సాముదాయిక ఆస్తులు పదిలం ..... 61
గ్రామ సౌభాగ్యానికి మేము సైతం ..... 62
పర్యావరణాన్ని రక్షించుకుందాం ..... 63

సంపాదకీయం...

# మహిళా కార్మికులకు 'ఉపాధి' భరోసా

హలాలు పట్టి, పొలాలు దున్నే వ్యవసాయ కార్మికులకైనా, కర్మాగారాలలో యంత్రాల నడుమ కష్టపడే పారిశ్రామిక కార్మికులకైనా 'మేడే' అనేది కార్మిక హక్కుల సాధనా దినోత్సవమే. తమ విజయాలను పునశ్చరణ చేసుకుంటూ, సాధించవలసిన న్యాయబద్ధమైన కోర్కెలపై కార్యాచరణకు ఉపక్రమించే రోజు 'మేడే'.

ఇదే సందర్భంలో కార్మికుల సంక్షేమానికి అభివృద్ధి ఏమి చేశామో సమీక్షించుకుని, ఇంకేమి చేయాలో ప్రణాళిక తయారు చేసుకుని అమలు దిశగా కదిలేందుకు ప్రభుత్వాలకు కూడా ఇది ముఖ్యమైన రోజు.

మన దేశంలో ఉపాధి కల్పనకు ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల్లో తలమానికం అనదగినటువంటిది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ప్రజలకు పని హక్కును కల్పించిన ఈ పథకం ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రశంసలను అందుకున్నది. స్వతంత్ర భారతదేశంలో ఈ పథకం అమలు చారిత్రాత్మకంగా నిలుస్తోంది. పనులు అంతగా లేని కాలంలో వలసలను ఆపి, పేద ప్రజలకు పనులు కల్పించడానికి ఉద్దేశించిన ఈ పథకం గ్రామాల్లోని మహిళలకు మరింత మేలు చేస్తున్నది.

సాధారణంగా వ్యవసాయ పనుల్లోనైనా, కర్మాగారపు పనుల్లోనైనా పురుషులకంటే మహిళలకు తక్కువ వేతనాలివ్వటం పరిపాటి. మన దేశంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 1976లోనే చట్టం చేసినప్పటికీ, చాలా చోట్ల ఆచరణకు నోచుకోలేదు. అందుకే మహిళా కార్మికులు వివక్షకు గురవుతున్నారు. వ్యవసాయ కూలీలో, ఇతర అసంఘటిత రంగాల్లో ఈ వివక్ష ఇప్పటికీ ఉంది. అయితే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో మాత్రం పురుషులకైనా, మహిళలకైనా సమానవేతనం ఇచ్చి తీరాల్సిందే. అందువల్ల, ఈ పథకంలో మహిళల భాగస్వామ్యం బాగా పెరిగింది.

అంతేకాదు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 33శాతం పనులను తప్పనిసరిగా మహిళలకు కేటాయిస్తుండటంతో వారి ఆదాయ వనరులు పెరిగాయి. ఇప్పటికే స్వయం సహాయ బృందాలలో సభ్యులుగా చేరి, మహిళలు రాణిస్తుండటంతో, ఉపాధి హామీ పనులు వారికి మరింత బాసటగా నిలిచాయి. దీనితో వారిలో మరింత ఆత్మ విశ్వాసం పెరిగింది. వారి బ్యాంకు డిపాజిట్లు పెరుగుతుండటంతో కుటుంబంలోనూ, సమాజంలోనూ వారి హోదా పెరిగింది. మహిళలు స్వతంత్రంగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలను కల్పించింది ఉపాధి హామీ పథకం.

చట్టంలో ఖచ్చితంగా నిర్దేశించిన 33 శాతం పనుల్లోనే కాక, మహిళా కార్మికులు ఈ పథకంలో మరింత అధికంగా పాల్గొంటున్నారు. 2006-07లో 33% లేదా అంతకు మించి మహిళల భాగస్వామ్యం ఉన్న రాష్ట్రాలు 15 కాగా, 2009-10 వచ్చే సరికి ఇది 20కి పెరిగింది. కేరళ లాంటి రాష్ట్రాల్లో అయితే, ఉపాధిహామీ పనుల్లో మహిళల భాగస్వామ్యం 90 శాతం వరకు ఉంది. అఖిల భారత స్థాయిలో మహిళల సగటు భాగస్వామ్యం 42 శాతం ఉంది.

ఇప్పుడు ఈ పథకాన్ని మహిళల విస్తృత భాగస్వామ్యం దిశగా మరింతగా విస్తరించాలని కేంద్రప్రభుత్వం తలపెట్టింది. గ్రామాల్లోని అనాధ మహిళలకు, వితంతువులకు ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన జాబ్‌కార్డులివ్వడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, పనులు చేసే మహిళల పిల్లల సంరక్షణార్థం క్రెచ్ (శిశు సంరక్షణ సదుపాయాలు)లను పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

దేశ వ్యాప్తంగా పేదలకు ఖచ్చితమైన ఉపాధిని అందిస్తున్న ఈ ఆదర్శ పథకం మరింత పటిష్టవంతంగా, పకడ్బందీగా అమలు జరగాల్సిన అవసరం ఉంది. స్థానిక సంస్థలు చొరవ తీసుకుని, మహిళా స్వయం సహాయక బృందాల సహాయంతో, సమన్వయంతో పథకం అమలును ఒక కంట కనిపెట్టడం వల్ల లోటు పాట్లు తొలగి, పేదల పనిహక్కు సార్థకమవుతుంది. అన్నింటా అణచివేతకు గురవుతున్న మహిళలు మరింతగా ప్రయోజనం పొందుతారు. ఈ దిశలో స్థానిక సంస్థలు ఈ 'మేడే' సందర్భంగా తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుంటాయని ఆశిద్దాం.

***పాఠకులందరికీ "మేడే" శుభాకాంక్షలతో...***

కె.చంద్రమౌళి

( కె. చంద్రమౌళి )







# 2.20 కోట్ల కుటుంబాలకు 'అమ్మహస్తం'

## రూ: 185 కే 9 రకాల నిత్యావసర వస్తువులు

**దారిద్ర్యరేఖకు దిగువనున్న (బిపిఎల్) తెల్ల రేషన్ కార్డుదారులందరికీ 185 రూపాయలకే 9 రకాల నిత్యావసర వస్తువులు అందించే 'అమ్మహస్తం' అనే వినూత్న పథకాన్ని విజయనామ ఉగాది పర్వదినం నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రారంభించింది. అంతర్జాతీయంగా రోజు రోజుకీ పెరిగి పోతున్న ధరల ప్రభావం పేదలపై పడకుండా వారిని ఆదుకునే ఆశయంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే రూపాయికే 'కిలోబియ్యం' పథకంతో పేదలకు ఆహారభద్రత కల్పించిన ప్రభుత్వం 'అమ్మహస్తం' ప్రవేశ పెట్టడంతో మరో అడుగు ముందుకేసింది.**

నిజానికి పెరిగిన ధరలతో మూడుపూటలా కడుపునిండా తిండి దొరకని నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో ఊరట కల్గిస్తుంది. కిలో కందిపప్పు, ఒక లీటరు పామాయిల్, కిలో గోధుమపిండి, కిలో గోధుమలు, అరకిలో చక్కెర, కిలో ఉప్పు, అరకిలో మిర్చిపొడరు, అరకిలో చింత పండు, వంద గ్రాముల పసుపు ఈ పథకం ద్వారా అందజేస్తారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబం రేషన్ దుకాణాల ద్వారా ఈ నిత్యావసర సరుకులు పొందవచ్చు.

సుమారు 2 కోట్ల 20 లక్షల కుటుంబాలలోని 7 కోట్ల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. అంతేకాక, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పేదలకు ఈ పథకం ద్వారా కొంత ఊరట కలుగుతుంది. పెరిగిన నిత్యావసర వస్తువుల భారం వారిపైపడకుండా, సబ్సిడీ భరిస్తూ, పేదలపట్ల బాధ్యతగా ఈ పథకాన్ని దేశంలో తొలిసారిగా రూపొందించి, మన రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్నది. 292 రూపాయల విలువగల 9 రకాల నిత్యావసర వస్తువులు కేవలం 185 రూపాయలకే ఇవ్వడంతో నిరుపేద ప్రజలకు నెలకు 107 రూపాయల వంతున సంవత్సరానికి 1284 రూపాయలు ఆదా అవుతుందని ప్రభుత్వం పేర్కొంటున్నది.

ఏది ఏమైనా, గ్రామాల, పట్టణాల పరిధిలోని పేదలకు ఈ 'అమ్మహస్తం' పథకం ద్వారా ఆకలి దూరం కావాలని గట్టిగా ఆశిద్దాం.



# బిఎన్‌విలు సేవాభావంతో పనిచేయాలి

## గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్

**భారత్ నిర్మాణ్ వాలంటీర్లు సేవా భావంతో. నిరక్ష రాస్యులైన గ్రామీణులకు చేయూతనిస్తూ వివిధ ప్రభుత్వ పథకాలు వారికి చేరే విధంగా కృషి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్ అన్నారు. ఏప్రిల్ 7, 2013న ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్)లో గిరిజన యువతీ యువకులకు ప్రత్యేకంగా ప్రారంభించిన భారత్‌నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో అవగాహనా లోపం వల్ల ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ప్రతిఫలం ప్రజలకు ఎంతవరకు చేరాలో అంతవరకూ చేరడం లేదన్నారు. అపార్డు నిర్వహించే ఈ శిక్షణ ద్వారా గిరిజన ప్రాంతాల్లో అమలయ్యే ప్రభుత్వ పథకాలు, హక్కులు మొదలైన అంశాలపై ఈ శిక్షణ ద్వారా మంచి అవగాహన కల్పించడానికి వీలుంటుందని పేర్కొన్నారు.

శిక్షణ పొందిన ప్రతి భారత్ నిర్మాణ్ వాలంటీర్ గ్రామాల్లోని సమస్యలను ప్రజలతో చర్చిస్తూ, తమ తమ గ్రామాల కోసం పాటు పడాలని సూచించారు. అదే విధంగా వేతనాలతో కూడిన పనుల రూపకల్పనకై బి.ఎన్.వి.లు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని గిరిజన ప్రాంతాల్లో మరింత పటిష్టంగా అమలు పర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో ముఖ్య అతిథి మాజీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ టి. గోపాలరావు మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి కోసం హేమన్ డార్ఫ్, కొమరంభీం, మల్లుదొర, అల్లూరి సీతారామరాజు వంటి వారిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఇప్పటికే బి.ఎన్.వి.ల కృషి వల్ల చాలా గిరిజన గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా తయారయ్యాయని తెలిపారు.



పంచాయితీరాజ్ సంస్థల్లో గిరిజనుల పాత్ర, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం మొదలైన పలు కీలక అంశాల గురించి ప్రతి ఒక్క గిరిజన బిఎన్‌వి తెలుసుకోవడం ముఖ్యమన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకుని ఆ సమస్యలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.

ఏకలవ్య పౌండేషన్ ప్రతినిధి శ్రీ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ, పథకాల గూర్చి పూర్తిగా అవగాహన లేకపోవటం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు విఫలమవుతున్నాయన్నారు. కాబట్టి పథకాలపై పూర్తి సమాచారాన్ని గ్రామీణ ప్రజలకు తెల్పవలసిన అవసరం ప్రతి భారత్ నిర్మాణ్ వాలంటీర్‌పై ఉందని వివరించారు. ప్రొఫెసర్ కె.వి.రాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజల ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూమిని అభివృద్ధి పర్చేందుకు చేయూతనివ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అపార్డ్ జాయింట్ డైరెక్టర్ డా॥ సి. నాగరాజు, సెంటర్ హెడ్స్, ఫాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సహజవనరుల యాజమాన్య కేంద్రం, సామాజిక న్యాయ మరియు స్వచ్ఛంద చర్య కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.



వ్యక్తి డా॥ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. ఇన్ని సమస్యలున్నా, భారతదేశంలో ప్రభుత్వాన్ని నడపగలుగుతున్నామంటే, ఇది నాయకుల గొప్పతనం కాదని, కేవలం అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఘనతేనని ఆయన వివరించారు.

సామాజిక సాధికారికత, స్వచ్ఛంద చర్యల విభాగాధిపతి శ్రీ మదన్‌మోహన్ మాట్లాడుతూ, వివక్షత లేని వ్యవస్థలను నెల కొల్పేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు.

మీడియా, ప్రచురణల విభాగాధిపతి డా.కె. ఆసయ్య మాట్లాడుతూ, బ్రిటిష్ కౌన్సిల్ గ్రంథాలయంలో ఆనాడు ఉన్న పుస్తకాలను పరి ·ంచిన వారిలో ముగ్గురులో ఒకరు ఇటలీ దేశానికి చెందిన మాజినీ, జర్మనీకి చెందిన కారల్ మార్క్స్ కాగా, మూడో వ్యక్తి డాక్టర్ అంబేద్కర్ అని చెప్పారు. వీరి ముగ్గురి పేర్లు ఆ గ్రంథాలయంలో ఫొటోలతో సహా లిఖించబడ్డాయన్నారు. మహాభారతాన్ని వ్రాసిన వేదవ్యాసుడు, రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి, భారత రాజ్యాంగాన్ని రచించిన డా॥ అంబేద్కర్ వీరు ముగ్గురు దళితులేనని ఆయన అన్నారు.

# భారత ప్రజాస్వామ్య నడవడికకు మార్గం చూపిన వ్యక్తి డా॥ బి.ఆర్. అంబేద్కర్

**డా॥ బి.ఆర్. అంబేద్కర్ 123 వ జయంతి ఉత్సవాన్ని అపార్డ్‌లో ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ, అట్టడుగు వర్ణంలో పుట్టి వివక్షకు గురైనప్పటికీ, అంబేద్కర్ తన మేధస్సు, పట్టుదల, నాయకత్వం, దీక్షల వంటి గుణాల వలన భారతదేశం వంటి అతి పెద్ద దేశ రాజ్యాంగాన్నే రచించారని వివరించారు.**

ఏ వ్యక్తి అయితే మంచి అలవాట్లు, నడవడిక, అవగాహన, క్రమశిక్షణ, లక్ష్యం మొదలగు అంశాలు కలిగి ఉంటారో, వారు నిజమైన సంపద కలిగిన వ్యక్తి అని తెలిపారు. రాజ్యాంగాన్ని మించిన మతంగాని, కులం గాని లేదని, మతగ్రంథాల కన్నా రాజ్యాంగమే గొప్పదని వివరించారు. రేపటి తరం కోసం మార్గాన్ని చూపి ఒక అద్భుతమైన గ్రంథాన్ని రూపొందించిన వ్యక్తి అంబేద్కర్ అని ఆయన కొనియాడారు.

వ్యక్తిని వ్యక్తిగా గౌరవించినప్పుడే ఈ దేశం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. బి.ఎన్.వి.ల వ్యవస్థ ద్వారా అపార్డ్ సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తోందని కమీషనర్ వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రజ్ఞాపాటవాలతో సమాజంలో గుర్తించబడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ దేశం ముందుకు పోవడానికి దశ, దిశ నిర్దేశించిన



డా॥ అంబేద్కర్ నిరంతర పఠనానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రతి కొత్త పుస్తకాన్ని కొని చదివేవారని డా॥ ఆసయ్య చెప్పారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైనింగ్) డా॥ అంజనేయులు, డి.టి.ఎం. వెంకటయ్యలు అంబేద్కర్‌పై గేయాలు పాడారు. ఈ సమావేశానికి అకౌంట్స్ విభాగాధిపతి డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ డా॥ అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అపార్డ్ సెంటర్ హెడ్స్, సలహాదారులు, ఫ్యాకల్టీ సభ్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

◆





# అపార్డ్‌లో డా॥ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి ఉత్సవం

**డా॥ బాబూ జగజ్జీవన్ రామ్ 106 వ జయంతి ఉత్సవాలను అపార్డ్‌లో ఘనంగా జరుపుకున్నారు. జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పలవురు పూలమాల వేసి నివాళులు అర్పించారు.**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐఎఎస్, మాట్లాడుతూ, అణగారిన వర్గాలకు చేయూతనందిస్తూ జాతీయ వ్యవహారాల్లో నైపుణ్యాన్ని చూపించిన నాయకుడు బాబూజగజ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. ప్రతి గొప్ప నాయకుడితో కలిసి అడుగులువేసే అవకాశం అందరికీ రాదన్నారు. వారు పలికిన సూక్తులు లేదా వారు ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకుని ప్రజా జీవనంలో ఇతరులకు ఒక ఉదాహరణగా నిలబడిన వ్యక్తులు నిజమైన పౌరులని శ్రీ చంద్రమౌళి కొనియాడారు.

సమాజంలో ప్రతి పౌరుడు తాను నడుచుకోవలసిన విధానాన్ని అవగాహన చేసుకోకపోతే దేశ అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. సమస్య అనేది ప్రణాళికల్లో లేదని, ప్రణాళికల అమల్లో ఉందని, సమస్య ప్రభుత్వ మదిలో లేదా ప్రజలు తమంతట తాము గీసుకున్న గీతల్లో ఉందన్నారు.

ప్రభుత్వాలు, ప్రభుత్వాల ప్రణాళికల్లో ఎలాంటి లోపం లేదని, అమలవుతున్న విధానంలో, ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి వ్యక్తి గీసుకున్న గీతలు, మనకు చరిత్ర ఇచ్చిన కొన్ని అవాంఛనీచ సంస్కృతులలో ఉందని కమీషనర్ వివరించారు. ఇటువంటి సంస్కృతులకి భిన్నమైన రూపాన్ని ఇవ్వటానికి, సమాజాన్ని ముందుకు తీసుకెళ్ళటానికి బాబూ జగజ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సమ్మిళిత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పని చేయాలని కమీషనర్ పిలుపు నిచ్చారు. సమాజంలో పతనమవుతున్న విలువల పునరుద్ధరణకు కృషి చేయాలని ఆయన అన్నారు. సమాజంలో దిగజారి పోతున్న విలువల్ని మళ్ళీ నిలబెట్టుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



దేశం కోసం కొంతమంది నాయకులు తమ సర్వస్వాన్ని పోగొట్టుకుని, తమకున్నటువంటి ఆస్తిపాస్తులను ధారపోసి ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన వారు కొందరైతే, వచ్చిన స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకుని వర్గ విభేదాలు లేకుండా ఈ దేశ అభివృద్ధి కోసం బాగా తోడ్పడిన వ్యక్తుల్లో బాబూ జగజ్జీవన్ రామ్ ముందు వరసలో ఉంటారని తెలిపారు.

తదుపరి ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన ట్రైనీ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీ రోశయ్య మాట్లాడుతూ, బాబూ జగజ్జీవన్ రామ్ గురించి మాట్లాడటానికి అవకాశం రావటమే మహద్భాగ్యమని, నిజంగా ఆయనతో కలిసి పనిచేసినవారు ధన్యులని ఉద్వేగపూరితంగా అన్నారు. బాబూ జగజ్జీవన్‌రామ్ జీవితంలోని వివిధ ఘట్టాలను, దేశ సంక్షేమం కోసం ఆయన పడిన తపన గూర్చి వివరించారు.

సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ శ్రీ కూర్మారావు మాట్లాడుతూ, డా॥ బాబూ జగజ్జీవన్‌రామ్ ఆనాటికాలంలో వ్యవసాయ రంగానికి, ఆహారభద్రతకు ఎంతో కృషి చేశారని, శాస్త్రీయ పరిజ్ఞానం ద్వారా విత్తనాలను అభివృద్ధి చేసి పంటలు అధిక దిగుబడులనిచ్చేందుకు కృషి సల్పారని చెప్పారు. అంతేకాక, భూ సంస్కరణల అమలుకు, మధ్యవర్తుల తొలగింపునకు, మిగులు భూమి పంపిణీకి కూడా జగజ్జీవన్‌రామ్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ అభివృద్ధికి బాబూ జగజ్జీవన్ రామ్ చేసిన కృషిని కూర్మారావు వివరించారు.

ఈ కార్యక్రమాన్ని అపార్డ్ జాయింట్ డైరెక్టర్ డా॥ సి. నాగరాజు సమన్వయ పర్చగా, అపార్డ్‌లో వివిధ సెంటర్ హెడ్స్, ఫాకల్టీ సభ్యులు, సిబ్బంది, సుమారు 400 మంది శిక్షణార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అపార్డ్‌ను సందర్శించిన యు.జి.సి. బృందం



**గ్రామీణాభివృద్ధి కోనం అపార్డు అమలు చేస్తున్న కార్యక్రమాలతీరుతెన్నులను సమీక్షించడానికి కేంద్రప్రభుత్వంలోని విద్యాశాఖకు చెందిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ బృంద సభ్యులు ఏప్రియల్ 12, 2013న ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్)ను సందర్శించారు.**

అపార్డ్ చేస్తున్న కార్యక్రమాలను గూర్చి అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్ యు.జి.సి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపార్డ్‌లో బోధనా సదుపాయాల గూర్చి వివరించారు. అపార్డ్‌లో ఒకేసారి 1050 మందికి శిక్షణ ఇచ్చేందుకు కావల్సిన శిక్షణా తరగతుల సదుపాయం ఉందని వివరించారు. అదే విధంగా వీడియో సమావేశాలు నిర్వహించేందుకు కూడా అవకాశం ఉందన్నారు.

రాష్ట్రంలోని రెవెన్యూ, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో అధికారులకు శిక్షణనిస్తూ అపార్డు ఉన్నతమైన పేరు సంపాదించిందని కమీషనరు తెలిపారు. భారత్‌నిర్మాణ్ వాలంటీర్లకు శిక్షణనిస్తూ గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం 'అపార్డు' కృషి చేస్తుందని ఆయన వివరించారు. అపార్డు సంస్థ జాతీయ సంస్థలైన ఎన్.ఐ.ఆర్.డి. టిస్ వంటి సంస్థలతో కలసి పని చేస్తున్నదని, అదేవిధంగా అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి సంస్థలతోనూ, నెదర్లాండ్స్ లాంటి విదేశీ ప్రభుత్వాలతో కలసి శిక్షణా సమావేశాలను నిర్వహిస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా అపార్డు రూపొందించిన వివిధ శిక్షణా సామాగ్రి, పుస్తకాల ప్రదర్శనను యు.జి.సి. బృందం సభ్యులు తిలకించారు, అనంతరం బృంద సభ్యులు మాట్లాడుతూ, అపార్డ్‌ను కేంద్రస్థాయిలో డీమ్డ్ విశ్వవిద్యాలయంగా గుర్తించేందుకు తగిన సదుపాయాలన్నీ ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

అపార్డును సందర్శించిన యు.జి.సి. బృందంలో ప్రొఫెసర్ తంగముత్తు, భారతీ దాసన్, విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, ప్రొ॥ గోపాల గురు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎ.ఎన్.సింగ్, లక్నో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చంద్రశేఖర్, పూనా యూనివర్సిటీకి చెందిన ఎం. చితాలే మొదలైనవారు ఉన్నారు. టిస్ డైరెక్టర్ ప్రొ॥ పరశురాం, టిస్ హైదరాబాద్ డైరెక్టరు శ్రీమతి లక్ష్మీ లింగం యుజిసి బృందంతో పాటు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



*ఎ.ఎమ్.ఆర్. అపార్డ్ కమీషనర్ శ్రీ కె.చంద్రమౌళి ఐ.ఎ.ఎస్ కొత్త డిల్లీలోని 'ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది 2013' పురస్కారాన్ని సివిల్ సర్వీసు నందు సేవలకు గుర్తింపు గా పొందారు. బహుమతిని కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి శ్రీ కపిల్ సిబాల్ నుండి పురస్కారాన్ని అందుకొంటున్న దృశ్యం. కేంద్ర కమ్యూనికేషన్ల సహాయమంత్రి డా॥ కిల్లీ కృపారాణి కూడా చిత్రంలో ఉన్నారు.*

# అపార్డ్ కమీషనర్‌కు ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం

**గ్రామీణ ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఇతోధికంగా కృషి చేస్తునందుకు గాను అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్‌కు ఢిల్లీ తెలుగు అకాడమీ వారు సివిల్ సర్వీసు నందు 2013 ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు.**

ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఐ.ఏ.ఎస్ 1990వ బ్యాచ్‌కు చెందిన శ్రీ చంద్రమౌళి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు.

అనంతపురం జిల్లాలో త్రాగునీటి పథకాల అభివృద్ధికి ఆయన పాటుపడ్డారు. కడప జిల్లా కలెక్టరుగా జిల్లాలో పండ్లతోటల పెంపకానికి ఎక్కువగా కృషి చేశారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యంగా పాఠశాల స్థాయి విద్యకు సర్వశిక్షా అభియాన్ డైరెక్టరుగా కృషి చేశారు. ప్రస్తుతం అపార్డ్ కమీషనర్‌గా ప్రజలలో సమిష్టితత్వాన్ని పెంపొందించేందుకు, ఒకరి కోసం ఒకరు అనే భావాన్ని గ్రామీణ ప్రజలలో తీసుకురావటానికి, గ్రామీణ ఆర్థిక వికాసం కోసం సుమారు 38,500 మంది యువతకు బి.ఎన్.వి లుగా అపార్డు ద్వారా శిక్షణ అందజేసి భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా రూపొందించారు.

భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణకు స్ఫూర్తినిస్తూ వాలంటీర్లను ఫ్లాగ్‌షిప్ ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు వారిని ప్రోత్సహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్) సంస్థ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలోనే ఉత్తమ శిక్షణా సంస్థగా ప్రథమ స్థానంలో నిలిచింది.

# గోరంత బీమా, కొండంత ధీమా

## నెలకు ఒక్క రూపాయితో రూ. 2 లక్షల బీమా, ఇతర సంక్షేమ పథకాలు

**ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల (ఉపాధి క్రమబద్ధీకరణ మరియు సర్వీసుల షరతులు) చట్టం 1996, మరియు నిబంధనలు - 1998 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పడింది. దీని ప్రకారం, భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికుల నమోదును ఆగస్ట్ 15 తేదీ, 2009 నుండి కార్మిక శాఖ చేపట్టింది.**

### ఏ వృత్తుల వారు అర్హులు ?

- మట్టి పనివారు, చదును చేయటం, గుంతలు తీయటం, చెరువులు, బావుల పూడిక తీయటం మొదలైన పనులు చేసేవారు.
- ఇటుకలు తయారు చేసేవారు
- ఇనుపరాడ్స్ బైండింగ్ పని చేసేవారు
- తాపీ మేస్త్రీలు, కూలీలు
- కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు
- మార్బుల్, గ్రానైట్, టైల్స్, మొజాయిక్ మొదలైన ఫ్లోరింగు పనులు చేసేవారు
- సెంట్రింగ్, సీలింగ్ కార్మికులు
- రంగులు, సున్నం వేసేవారు
- పాలిషింగ్ చేసేవారు
- రోడ్ నిర్మాణం పని వారు, రోలర్ డ్రైవర్స్, జెసిబి మొదలైన వాటిపై పని చేసేవారు, మట్టి తొలగింపు పనులు చేసే కార్మికులు,
- నిర్మాణ రంగంలో సూపర్ వైజర్లు, క్లర్కులు, అకౌంటెంట్లు మొదలైన వృత్తుల వారు అర్హులు.

పై అర్హతలలో మొదటి అంశాన్ని గమనించినట్లయితే, మట్టి పని వారు, గుంతలు తీయటం, చదును చేయటం, పూడికలు తీయటం వంటి పనులు చేసే వారు, గ్రామీణ ప్రాంతాలలో లక్షలాదిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలుగా నమోదు అయిన వారు ఈ పథకం ద్వారా బీమా పొందడానికి అర్హులు.

కుటుంబంలోని స్త్రీ, పురుష కార్మికులను ఇరువురును భవన, ఇతర నిర్మాణ కార్మికులుగా బీమా నమోదు చేసినట్లయితే, ప్రమాద వశాత్తు కుటుంబంలో ప్రధాన సంపాదనా పరులు మరణించినపక్షంలో కుటుంబం ఆర్థికంగా ఒడిదుడుకులకు లోనై వీధిన పడకుండా పరిహారంగా వచ్చే 2 లక్షల రూపాయల బీమా మొత్తం ఆ కుటుంబాన్ని ఆదుకుంటుంది. తద్వారా కొండంత ధీమా కలుగుతుంది.

### సభ్యత్వ నమోదు ఎలా చేసుకోవాలి

**ఈ పథకం క్రింద సభ్యత్వ నమోదు చేసుకొనేవారు**

- భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులై ఉండాలి.
- 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారై ఉండాలి.
- గడచిన సంవత్సరంలో 90 రోజులలో నిర్మాణ రంగంలో పని చేసి ఉండాలి.




- నిర్ణీత ఫారం (II 7) తో పాటు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఏదైనా గుర్తింపు కార్డు నకలు జత చేయాలి.
- సభ్యత్వ రుసుము రూ. 50/- (ఒక్కసారి మాత్రమే) నెలకు ఒక్క రూపాయి చొప్పున సంవత్సరానికి రూ. 12/- చందా.
- ప్రతి సంవత్సరం నెలకు ఒక్క రూపాయి చొప్పున సంవత్సరానికి రూ.12/- చందాతో నవీకరణ (రెన్యూవల్) చేయించుకోవాలి.
- జీవో.ఎంఎస్ - 33 ప్రకారం 5 సంవత్సరాల వరకు రెన్యూవల్ (నవీకరణ) చేసుకొనే అవకాశం ఉంది.

### నమోదు చేసుకొన్న వారికి లభించే సంక్షేమ పథకాలు

- నమోదు చేసుకొన్న ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డు ఇస్తారు.
- పనిచేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే, కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల మేరకు ఆర్థిక సహాయం.
- పని చేస్తున్న వ్యక్తి శాశ్వత అంగవైకల్యం పొందితే, వారికి రూ.2 లక్షల మేరకు ఆర్థిక సహాయం లభిస్తుంది.
- పని చేస్తున్న వ్యక్తి 50% అంగవైకల్యం పొందితే వారికి 1 లక్ష రూపాయలు లభిస్తాయి.
- పని చేస్తున్న వ్యక్తి 26 నుండి 49% అంగవైకల్యం పొందితే, వారికి 50 వేల రూపాయలు ఇస్తారు.
- సాధారణ మరణం పొందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు రూ. 30,000/- అందజేస్తారు.
- మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం కింద రూ. 5000/- అందజేస్తారు.
- కార్మికుల కుమార్తె వివాహానికి రూ. 5000/- లను వివాహ కానుకగా ఇస్తారు.
- పని ప్రదేశంలో ప్రమాదానికి గురైన కార్మికునికి రోజుకు 100/-, నెలకు 1500/- చొప్పున 3 నెలల వరకు 4500/- ఇస్తారు.

గ్రామీణ ప్రాంతాలలోని భారత నిర్మాణ్ వాలంటీర్లు తమ ప్రాంతాలలోని భవన, ఇతర నిర్మాణ రంగాలలో గల కూలీలలో ఈ పథకం పట్ల అవగాహన కల్పించి, చైతన్య పర్చి ఈ సంక్షేమ పథకంలో భాగస్వాములను చేయటం ద్వారా గోరంత బీమాతో కొండంత ధీమా కల్పించినవారవుతారు.

**- త్రినాధ్,** భారత్ నిర్మాణ్ వాలంటీర్, కనపర్తి, ప్రకాశంజిల్లా




# ఒకచో నేలను పవ్వళించు...!

**ఆభరణాల్ని ధరించడం వల్ల ప్రయోజనం ఎంత మాత్రమూ లేదు. సంకల్పాన్ని ధరించాలి. అది మొక్కవోని విజయాన్నందిస్తుంది. 'అల్పశ్చకాలో బహవశ్చ విఘ్నాః' అన్నారు. కాలం చాలా తక్కువ కానీ ఆటంకాలు ఎక్కువ. ఏదో సాధించాలనుకొనే వారు కూడా సాధించలేక చతికిలపడి, దానికి కారణాలుగా ఎన్నో ఇబ్బందులను చూపుతుంటారు. అది సరైనది కాదు. ఎట్టి కష్టాలలోనైనా, ఎన్ని అవాంతరాలెదురొచ్చినా కార్యసాధకుడు వెనుకంజవేయడు. కార్యసాధకుడెలా ఉండాలో ఈ పద్యం వివరిస్తోంది.**

*"ఒకచో నేలను పవ్వళించు నొకచో నొప్పారు పూసెజ్జపై*
*నొకచో శాకము లారగించు నొకచో నుత్కృష్ట శాల్యోదనం*
*బొకచో బొంతధరించు నొక్కొక తఱిన్ యోగ్యాంబర శ్రేణిలె*
*క్కకు రానీయడు కార్యసాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్"*

ఒక పని మీద తదేక దృష్టి నిల్పినవాడు పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోతాడు. అవసరమైతే నేలమీద పడుకుంటాడు. ఆకులూ, అలములు తింటాడు. ఏమీ లేకపోతే బొంతనే ధరిస్తాడు కానీ, పట్టె మంచాలు పరుపులు, పంచభక్ష్య పరమాన్నాలు కావాలని కూర్చోడు. హీనాధికాలేవీ కార్యసాధకునికి లెక్కకు రావు. అన్ని రకాలయిన సాధనాలు చేకూరినప్పుడు విజయం సాధించడంలో గొప్ప ఏముంటుంది? అసౌకర్యాల్లోంచి కార్యసాధకులు అద్భుత విజయాల్ని పొందుతారు.

శ్రీరాముడి లక్ష్యం లంకను జయించడం. అదేమీ చిన్న విషయం కాదు. సముద్రాన్ని దాటాలి. శత్రువు రావణాసురుడు మహాబలవంతుడు, సైన్య సంపన్నుడు, దానవుడు. రాముడు సామాన్య మానవుడు. యుద్ధంలో సహకరించే వారు వానరులు. ఒకటి చెప్తే ఇంకొకటి చేసే రకం.

సైన్యమా!! రథ, గజ, అశ్వాది బలాలు లేవు. కేవలం కాల్బలమే. అయినా రాముడు ఈ లోటుపాట్లని చూసి వెనుకంజ వెయ్యలేదు. మొత్తం రాక్షసులందరినీ సంహరించాడు. కాబట్టి, 'క్రియా సిద్ధిః సత్వే భవతి మహతాం నోపకరణే'. కార్యసాధకులకు సంకల్పమే సాధనం. ఆయుధం. తక్కిన సాధనాలు, ఆయుధాలు ఏవీ సంకల్పం లేకపోతే పనిచెయ్యవు. ఎన్ని సమకూర్చుకున్నా సంకల్పబలం లేనివాడు ఏమీ సాధించలేడు. ఏమీ లేకపోయినా సంకల్పాన్నే ధరించిన కార్యశూరుడు అసంభవాల్ని సుసంభవాల్ని చేసే ధైర్యం కలవాడై లోకం నుదుటిపై విజయ తిలకాన్ని దిద్దుతాడు.

**- డా॥ అద్దంకి శ్రీనివాస్**

## ఐసీడీఎస్ బలోపేతానికి, పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం

- 'ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం) బలోపేతం, పునర్నినిర్మాణం' పేరుతో కేంద్ర ప్రభుత్వం 2013 ఫిబ్రవరిలో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది.
- కేంద్రం 1975 అక్టోబరు 2వ ఐసీడీఎస్‌ను ప్రారంభించింది. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను కనీస స్థాయికి తగ్గించటం ఈ పథకం లక్ష్యం.
- ఈ పథకం మరింత మందికి అందేలా ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉండాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీచేసింది. అయితే సంస్థాగతమైన లోపాలతో ఈ సేవలు అనుకున్నంత స్థాయిలో విజయవంతం కాలేదు.
- ఈ నేపథ్యంలో కేంద్రం కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 200 జిల్లాలను ఎంపిక చేసింది.
- మన రాష్ట్రం నుండి తూర్పు గోదావరి, ఖమ్మం, రంగారెడ్డి, విశాఖపట్టణం, ఆదిలాబాద్, నిజామాబాద్, విజయనగరం జిల్లాలను ఎంపిక చేశారు.
- కొత్త పథకం కింద నిర్వహణ కోసం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 2000 చొప్పున విడుదల చేస్తారు. పౌష్టికాహారంతో పాటు ఆట వస్తువులు, అద్దెలు, వాహనాలు, కథల పుస్తకాలకయ్యే ఖర్చులకు అందించే మొత్తం కూడా పెరుగుతుంది.
- కొత్త కార్యక్రమం అమలయ్యే కేంద్రాల్లో రోజుకు చిన్నారులకు, మహిళలకు పెట్టే ఖర్చు ఇలా ఉంటుంది.

| **లబ్ధిదారులు** | **ప్రస్తుతం** | **పెంచిన తర్వాత** |
|---|---|---|
| చిన్నారులు (6-72 నెలలు) | రూ. 4 | రూ. 6 |
| పౌష్టికాహారం లోపం ఉన్న చిన్నారులు (6-72 నెలలు) | రూ. 6 | రూ. 9 |
| గర్భిణి లేదా బాలింత | రూ. 5 | రూ. 7 |

- అంగన్‌వాడీ కేంద్రాలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పక్కా భవనాలు నిర్మించాలని కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- ఒక్కో భవనానికి రూ. 4.5 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసి, భవనాల నిర్మాణానికి కార్యచరణ రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# గ్రామీణాభివృద్ధిలో సమాచార హక్కు ప్రాముఖ్యత

**ఏ సమాచారం అయినా మనిషికి శక్తినిస్తుంది. యుక్తిగా వ్యవహరించేందుకు ఉపకరిస్తుంది. మనిషి అభివృద్ధికి ఉపయోగపడే అంశాలు ఎక్కడ లభిస్తాయి అనే విషయాలు తెలుసుకోవటం వలన ఆ మనిషికి తగిన శక్తి లభించినట్లే. గ్రామానికి కావలసిన కనీస వసతులు మంచి నీరు, రోడ్లు, రేషన్ కార్డులు తదితర సదుపాయాలను పొందడానికి తగిన సమాచారం దోహదపడ్తుంది.**

వ్యక్తులు రోజు వారీ పనికి వెళ్లకపోతే, ఇల్లు గడవదు. ఇల్లు గడవడానికి కావలసిన రేషన్ అందుకోవడానికి రేషన్ కార్డు కావాలి. దాన్ని పొందడానికి గ్రామ పంచాయతీ అధికారులను అడగాలి. అడగాలి అంటే, తెలియాలి కదా ! అందుకనే ఆ గ్రామ పెద్దలను ఆశ్రయించాలి. గ్రామంలో ఉన్న వ్యక్తులకు కావలసిన వసతులు పొందాలంటే, ప్రభుత్వ లెక్కల్లో పేర్లు నమోదై ఉండాలి. ఓటరు కార్డు ఉంటే రేషన్ కార్డు వస్తుంది. అందుకు వ్యక్తులు గ్రామ రెవెన్యూ అభివృద్ధి అధికారిని ఆశ్రయించడం జరుగుతుంది. ఆ విధంగా చేయాలి అని తెలియడమే సమాచారం. ఆ సమాచారం మనకు దొరకనపుడు ఆ శాఖలోని సమాచార అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. "నాకు రేషన్ కార్డు లేదు నాకు రేషన్ కార్డు ఇప్పించమని" దరఖాస్తు చేసుకొని, దానితో పాటు రూ. 5 - పోస్టల్ ఆర్డరు కాని, క్యాష్‌ను గాని జత చేయాలి. దరఖాస్తు అందించిన అనంతరం 10 రోజుల్లో లేదా 20 రోజులలో సమాధానం అందితే సరే సరి లేదా 29 రోజుల వరకు వేచి ఉండాలి.

30 రోజులలో ఏ సమాచారాన్ని అందుకొనక పోతే, మన వద్దనున్న రసీదు ద్వారా మరోసారి సంప్రదించి ఆ సమాచారం పంపుతున్నారా, లేదా ? అని తెలుసుకోవాలి. 30 రోజుల లోపు ఏ విధమైన సమాచారం మనకు అందని పక్షంలో రేషన్ కార్డు కోసం సమాచార హక్కు కమీషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తుకు సమాచార కమీషనర్ సమాధానం ఇవ్వడం జరుగుతుంది. అక్కడ నుండి కూడా రాని యెడల మరల సమాచార కమీషనర్ ఆఫీసును సంప్రదించ వచ్చును. అప్పుడు తప్పని సరిగా సమాధానం దొరుకుతుంది. తహసీల్‌దారు ఆఫీసు నుండి రేషన్ కార్డును ఆ వ్యక్తికి అందజేస్తారు.

సమాచారం ఎవర్ని అడగాలి అనేది తెలియడమే ఒక ప్రాథమిక అంశం. ఆ తెలిసిన సమాచారాన్ని మన అవసరాలకు వాడుకోవటం ఒక పద్ధతి. సమాచార అధికారి నుండి సమాచారాన్ని పొందడం మరొక ఎత్తు. నేటి సమాచార హక్కు చట్టం క్రింద మనకు కావలసిన 94% సమాచారాన్ని రాబట్టుకోవడానికి అవకాశం ఉంది. అడిగినవారికి తప్పని సరిగా సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత. సమాచారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం అనేది చట్టం ప్రకారం శిక్షార్హం. కనుక సమాచారాన్ని ప్రజలకు తప్పని సరిగా అందజేయాలి. లేనియెడల సంబంధిత ఉద్యోగి జీతం నుండి నష్టపరిహారాన్ని వసూలు చేయడం జరుగుతుంది.

ప్రజలకు సాధికారికత కల్పించడానికి ఈ సమాచార హక్కు చట్టాన్ని 2005 సం॥రంలో ప్రభుత్వం రూపొందించింది. దీనిని గూర్చి తెలిసి, ఉపయోగించుకున్న వారికి ఎంతో వెసులుబాటు కలుగుతుంది. అదే విధంగా గత 60 సం॥రాల నుండి ఈ సమాచారాన్ని ఇవ్వకుండా ఉద్యోగ స్వామ్యం రహస్యంగా దేశ వ్యవహారాలను నడిపింది. మిగతా ఇతర దేశాలలో రెండో ప్రపంచ యుద్ధం కాలంలోనే సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది.

అసలు సమాచార హక్కు చట్టం ఐరోపా దేశాలైన స్కాండినేవియన్ దేశాలలో (స్కాండినేవియన్ దేశాలంటే స్వీడన్, నార్వే, డెన్మార్కులు) 1870 లోనే ప్రవేశ పెట్టారు. ప్రజల కోసం ఏ ఏ పనులు చేస్తున్నామో స్పష్టంగా ప్రజలకు తెలిపి, వారి అవసరాలకు ప్రభుత్వం పని చేస్తుంది. అదే కాలంలో అమెరికా అధ్యక్షుడుగా ఉన్న అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యం అంటే "ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వం" అని పేర్కొన్నారు. సమాచార హక్కు అంటే ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలే సేకరించుకొనే విధానం.

ఇన్ని సౌకర్యలు కలిగిన సమాచార హక్కు చట్టాన్ని మన వ్యక్తిగత ప్రయోజనాలకు ఇతోధికంగా ఉపయోగించుకోవచ్చును. సమాచార హక్కు చట్టం మీద అవగాహన కల్గించి, ప్రజలకు చేరవేసే పనిని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేపడితే, వారి పురోభివృద్ధికి తోడ్పడినట్లు అవుతుంది.

**- సి.ఎం.పి.**

# వికలాంగుల సంక్షేమానికి అంకితమైన డా. రామభద్రాచార్య

**మానవుల శరీరాంగాలన్నీ సరిగా ఉన్నపుడు అతడు ఒకరి మీద ఆధారపడక స్వతంత్రంగా జీవించవచ్చు. ఏ అంగమైనా వైకల్యం చెందినపుడే అతడు ఇతరుల సహాయంతోనే మనుగడ సాగించగలడు.**

**వికలాంగుల జీవితాలు దయనీయమైనవి. 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అన్నారు. చూపు లేనివారికి ప్రపంచమంతా చీకటిగానే ఉంటుంది. ఎన్ని వైకల్యాలున్నా ధైర్యంగా తలయెత్తుకొని జీవితం సాగించే ధీరులు లేకపోలేదు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, వారిని వెలుగు బాటలో నడిపిస్తున్నది. అంధుల కోసం పాఠశాలలు నెలకొల్పింది ప్రభుత్వం. లూయీ బ్రెయిల్ అంధుల కోసం బ్రెయిలీ లిపిని సృష్టించారు. హెలెన్ కెల్లర్ చెవుడు, మూగ, గుడ్డి అయినా ప్రపంచంలో ప్రముఖ వ్యక్తిగా ప్రశంసలందుకొన్నది.**

వికలాంగుల సంక్షేమం కోసం జీవితం అంకితం గావించిన మహనీయులు రామభద్రాచార్య. ఆయన 1950లో ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ జిల్లా షాదిక్రుద్ గ్రామంలో జన్మించారు. రాజదేవ్ మిశ్రా, శచీదేవిల పుత్రుడాయన. సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. వీరి



అసలు పేరు గిరిధర్ మిశ్రా. కాలక్రమంలో జగద్గురు రామభద్రాచార్యగా పేరుగాంచారు.

ఆచార్య రెండు నెలల బాలుడుగా వున్నపుడు ట్రకోమా వ్యాధిగ్రస్తుడై చూపు కోల్పోయారు. విద్యపట్ల అమితాశక్తిగల ఆ బాలుడు ఐదేళ్ళ వయసులో భగవద్గీతను, ఎనిమిదేళ్ళ వయసులో తులసీదాస్ రచించిన 'రామచరితమానస్' కంఠస్థం చేశారు.

1967లో జాన్‌పూర్ ఆదర్శ గౌరీశంకర్ మహా విద్యాలయంలో అధ్యయనం ప్రారంభించి పాణినీయ సంస్కృత వ్యాకరణంలో దిట్ట అయ్యారు. 1974లో సంపూర్ణానంద సంస్కృత కళాశాలలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

1981లో పండిట్ రామాప్రసాద్ త్రిపాఠి నేతృత్వంలో 'ఆధ్యాత్మ రామాయణం - సంపూర్ణ విమర్శ' అనే విషయంపై సిద్ధాంత గ్రంథం రచించి, డాక్టరేట్ పట్టా అందుకొన్నారు.

1987లో సన్యాసాశ్రమం స్వీకరించి సాధువుల ఆహ్వానం అందుకొని చిత్రకూట్‌లో తులసీపీఠం స్థాపించారు. 1988 లో రామభద్రాచార్య గారిని పీఠాధిపతిగా ఎన్నుకొన్నారు. 1996లో అంధులకోసం పాఠశాలను ప్రారంభించి వారికి ఉచిత విద్యా వసతులు కల్పించారు.

మనదేశంలో 9 కోట్ల మంది వికలాంగులున్నారని అంచనా. వారిలో 5 శాతం మాత్రమే చదువుకు నోచుకొన్నారు. తక్కినవారు ఇతరుల సహాయంతో జీవించాలి. రామభద్రాచార్య వారి కోసంవిశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ విశ్వవిద్యాలయంలో వేయి మందికి పైగా విద్యార్జన చేస్తున్నారు.

యు.జి.సి. ఈ విశ్వవిద్యాలయాన్ని గుర్తించింది చరిత్ర, భాషాశాస్త్రం, సైన్సు, కంప్యూటర్ సైన్స్ విభాగాలున్నాయి. అంధులకు బ్రెయిలీ లిపిలో కంప్యూటర్ విద్య నేర్పుతున్నారు. వివిధ వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తూ, ఫిజియోథెరపీలో శిక్షణ ఇస్తున్నారు. కొందరు విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కొందరు ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్నారు.

రామభద్రాచార్య 'రామకథాగానం' ద్వారా 11 సంవత్సరాలలో 38 కోట్ల రూపాయలను విరాళంగా స్వీకరించి విశ్వవిద్యాలయాభివృద్ధికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.


రామభద్రాచార్య శతాధిక గ్రంథకర్త. దృష్టి లేకపోయినా రచనా వ్యాసంగంలోను, సాంఘిక సేవాకార్యక్రమాల్లోను పాల్గొని, తమ విశిష్ట సేవలతో ఎన్నో పురస్కారాలందుకొన్నారు. 2008లో న్యూయార్క్‌లో జరిగిన మిలీనియం వరల్డ్ పీస్ కమిటీలో భారత ప్రభుత్వం ప్రతినిధిగా ఆహ్వానం అందుకున్నారు.

వికలాంగులు ఇతరుల దయా ధర్మాలతో జీవించక, ఆత్మగౌరవంతో జీవించాలని రామభద్రాచార్య ఆశించారు. రామభద్రాచార్య సేవలు మన దేశానికి గర్వకారణంగా వున్నాయి.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

**సుమారు శతాబ్దానికి పైగా కాకినాడ ఓడరేవు నుంచి చెన్నై వరకూ జల రవాణాను అందించిన బకింగ్‌హాం కాలువ నిర్వహణను పట్టించుకోకపోవడంతో, ఈ కాలువ ప్రస్తుతం గత వైభవం కోల్పోయి నామమాత్రంగానే మిగిలింది. 1839లో నిర్మించిన ఈ కెనాల్ 1975 వరకూ రవాణా సౌకర్యాన్ని కల్పించింది. అయితే, ఆ తర్వాత ఈ కెనాల్ నిర్వహణపట్ల ఆసక్తి చూపకపోవడం, మరో ప్రక్క రైలు, రోడ్డు మార్గాలు అభివృద్ధి చెందడంతో బకింగ్‌హాం కెనాల్‌లో రాకపోకలు నిలిచిపోయాయి.**

ఈ నేపథ్యంలో, ఇటీవల కాలంలో పర్యావరణం, ఇంధన వినియోగం తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపడంతో జలరవాణాను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ మేరకు దేశంలో ప్రధానమైన మూడు జల రవాణా మార్గాలతో పాటు బకింగ్‌హాం కాలువను కూడా వినియోగంలోకి తీసుకువచ్చే దిశగా




# రూ. 2,500 కోట్ల వ్యయంతో బకింగ్‌హాం కాలువ పునరుద్ధరణ యత్నాలు

దృష్టి సారించారు. ఆ మేరకు సుమారు రూ. 2,523/- కోట్ల రూపాయలతో రెండు దశల్లో కెనాల్‌ను అభివృద్ధి పరచడం ద్వారా రాకపోకలను పునరుద్ధరించే అవకాశం ఉందని నివేదికను సమర్పించారు. ప్రస్తుతం ఈ నివేదికను కేంద్ర ఓడరేవులు, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు అందించారు. అయితే రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు ఈ అంశంపై దృష్టి సారిస్తూ ఇటు కాకినాడ - పాండిచ్చేరిల మధ్యే కాకుండా, భద్రాచలం, వజీరాబాద్ ప్రాంతాలకు ఈ జల రవాణాలను అనుసంధానం చేసే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు.

### నాటి నుంచి నేటి దాకా ....

బ్రిటిష్ పరిపాలనలో డ్యూక్ అధిపత్యం కొనసాగుతున్న తరుణంలో తమిళనాడులో కరువు ఏర్పడింది. కాకినాడ ఓడరేవు ప్రాంతం నుంచి చెన్నైకి సరుకులను తక్కువ వ్యయంతో తరలించే నిమిత్తం బకింగ్‌హాం కాలువను అభివృద్ధి పరిచారు. గోదావరి, కృష్ణా నదులతోపాటు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల తీరప్రాంతాల వెంబడి ఈ కాలువను ఏర్పాటు చేసారు. కొంతభాగం సాగునీటితోను, మరికొంత సముద్రం పోటు ద్వారా లభించే నీటితోను కాలువలో నిరంతరం నీరుపారేలా లాకులను నిర్మించి కాలువను ఏర్పాటు చేశారు. 1950 ప్రాంతలో జల రవాణా తగ్గినప్పటికీ, 1975 వరకూ బకింగ్‌హాం కెనాల్‌లో పడవల రాకపోకలు కొనసాగాయి.

అయితే ఆ తర్వాత నుంచి కాలువల నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి నిధులు విడుదల చేయకపోవడంతో కాలువలు పూడికతో నిండి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుప్రాంతాల్లో ఈ కెనాల్ ఆక్రమణలకు గురికాగా, మరికొన్ని ప్రాంతాల్లో కాలువను పూడ్చి

సముద్ర తీరానికి రోడ్లను నిర్మించారు. దీనితో బకింగ్‌హాం కెనాల్ ఉనికిని కోల్పోయింది. ఇలాంటి దశలో కేంద్ర ప్రభుత్వం ఈ మార్గాన్ని 4వ జల రవాణాగా గుర్తించి పునరుద్ధరించేందుకు నిర్ణయించింది. దీనితో ప్రస్తుతం రాష్ట్రంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను కేంద్ర ఓడరేవులు, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు బదలాయించాలని తీర్మానించారు. అదేవిధంగా ఈ కెనాల్ నిర్వహణ బాధ్యతను భారత అంతర్గత జలమార్గాల సంస్థ (ఐడబ్ల్యూఎఐ) కి అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు.

## కాలువ అభివృద్ధి సర్వే

ఈ మేరకు కాలువ అభివృద్ధికి పూర్తిస్థాయి సర్వేను నిర్వహించారు. రెండు దశల్లో సుమారు 2523 కోట్ల రూపాయలను ఖర్చు చేయవలసి ఉంటుందని నిర్ణయించారు. ఈ జలరవాణా కాకినాడ నుంచి రాజమండ్రి వరకూ కాకినాడ కెనాల్ ద్వారా, రాజమండ్రి నుంచి విజయవాడ వరకూ ఏలూరు కెనాల్ ద్వారా, విజయవాడ నుంచి పెదగంజాం వరకూ కమ్మమూరు కెనాల్ ద్వారా, పెదగంజాం నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్ వరకూ నార్త్ బకింగ్‌హాం కెనాల్ ద్వారా, చెన్నై నుంచి యార్కాణం వరకూ సౌత్ బకింగ్‌హాం కెనాల్ ద్వారా, యార్కాణం నుంచి పాండిచ్చేరి వరకూ కలువెల్లి చెరువు ద్వారా కొనసాగుతుంది. మధ్యలో భద్రాచలం నుంచి రాజమండ్రికి గోదావరి నది, వజీరాబాద్ నుంచి విజయవాడ వరకూ కృష్ణా నది నుంచి మరో రెండు మార్గాలు ఈ వ్యవస్థకు అనుసంధానం అవుతాయి. వీటి వల్ల కాకినాడ నుంచే కాకుండా భద్రాచలం, వజీరాబాద్‌ల నుంచి కూడా పాండిచ్చేరికి జల రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. దీనితో మొత్తం 1095 కిలోమీటర్ల మేర జల రవాణాకు అవకాశం కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 888 కిలోమీటర్లు, తమిళనాడులో 188 కిలో మీటర్లు, పాండిచ్చేరిలో 2 కిలోమీటర్ల మేర ఈ మార్గం పయనిస్తుంది. కృష్ణా, గోదావరి నదుల్లో 365 రోజులూ నీరు నిల్వ ఉంటున్న కారణంగా జల రవాణాకు ఎటువంటి అటంకం ఉండదు.

అయితే, కాకినాడ నుంచి రాజమండ్రి వరకూ సుమారు 50 కిలోమీటర్ల మేర కనీసం రెండు మీటర్ల లోతు నీరు ఉండేలా కాలువలను నిర్వహించాల్సి వుంటుంది. ఈ ప్రాంతంలో 310 రోజులు మాత్రమే నీరు అందుబాటులో ఉంటుంది. ఇక విజయవాడ - సీతానగరం లాకుల వరకూ గల 113 కిలోమీటర్ల వరకూ గల కాలువకు ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటిని అందిస్తారు. ఈ కాలువకు నాగార్జున సాగర్ ద్వారా నీటిని అందిస్తే జల రవాణాకు అడ్డంకులు ఉండవు. పెదగంజాం నుంచి చెన్నై సెంట్రల్ వరకూ గల 316 కిలోమీటర్ల నార్త్ బకింగ్‌హాం కాలువ చెన్నై నుంచి యార్కాణం వరకూ గల 110 కిలోమీటర్ల సౌత్ బకింగ్‌హాం కెనాల్ పూర్తిగా సముద్ర అలల నీటిపై ఆధారపడివుంటుంది. పోటు ద్వారా సముద్రంలో నీరు గట్టుపైకి వస్తుంది. ఈ సమయంలో లాకుల విధానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఆ నీటిని సేకరిస్తారు. ఈ జల రవాణా ద్వారా బొగ్గు, బియ్యం, ఆహారధాన్యాలు, సిమెంట్, ఎరువులు, అటవీ ఉత్పత్తులు, ఉప్పు తదితర సరుకులు రవాణా చేసే అవకాశం ఉంది.

కాకినాడ కాలువ, ఏలూరు కాలువ, కమ్మమూరు కాలువలను 1.6 మీటర్ల లోతు, 14 మీటర్ల వెడల్పు ఉండే విధంగా అభివృద్ధి పరచడం ద్వారా 100 టన్నుల సామర్థ్యం గల బార్జీలు, పడవలు రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. గోదావరి నది, కృష్ణానది, బకింగ్‌హాం నార్త్, సౌత్ కాలువలు, కలువెల్లి చెరువులు 1.8 మీటర్ల లోతు, 32 మీటర్ల వెడల్పు ఉండటంతో 300 టన్నుల బార్జీలు, పడవలు రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

**భూసేకరణ చేయాల్సిన ప్రాంతాలు :**

| | | |
|---|---|---|
| కాకినాడ కెనాల్ | : | 227 హెక్టార్లు |
| ఏలూరు కెనాల్ | : | 524 హెక్టార్లు |
| కమ్మమూరు కెనాల్ | : | 497 హెక్టార్లు |
| నార్త్ బకింగ్‌హాం కెనాల్ | : | 129 హెక్టార్లు |
| సౌత్ బకింగ్‌హాం కెనాల్ | : | 298 హెక్టార్లు |
| పాండిచ్చేరి | : | 27 హెక్టార్లు |

**కాలువ ప్రయాణించే మార్గం :**

| | | |
|---|---|---|
| కాకినాడ కెనాల్ (కాకినాడ - రాజమండ్రి) | : | 50 కి.మీ. |
| ఏలూరు కెనాల్ (రాజమండ్రి - విజయవాడ) | : | 139 కి.మీ. |
| కృష్ణా నది (వజీరాబాద్ - విజయవాడ) | : | 157 కి.మీ. |
| గోదావరి నది (భద్రాచలం - రాజమండ్రి) | : | 171 కి.మీ. |
| కమ్మమూరు కెనాల్ (విజయవాడ - పెదగంజాం) | : | 113 కి.మీ. |
| నార్త్ బకింగ్‌హాం కాలువ (పెదగంజాం - చెన్నై సెంట్రల్) | : | 316 కి.మీ. |
| సౌత్ బకింగ్‌హాం కెనాల్ చెన్నై - యార్కాణం) | : | 110 కి.మీ. |
| కలువెల్లి ట్యాంక్ (యార్కాణం - పాండిచ్చేరి) | : | 22 కి.మీ. |

ఈ ప్రయత్నాల దృష్ట్యా బకింగ్‌హాం కాలువ జల రవాణా అతి త్వరలో పూర్తి అవుతుందని ఆశిద్దాం.

**- పుట్టా సోమన్నచౌదరి**

# సమాచార హక్కు చట్టంలో పౌర హక్కులు

**'సమాచార హక్కు చట్టం - 2005' లోని 6వ చాప్టర్‌లో 31 సెక్షన్లు పొందుపర్చి ఉన్నాయి. సాధారణంగా సమాచార హక్కు చట్టం - 2005 ద్వారా పౌరులకు కల్పించిన హక్కులు ఏమిటి అని ప్రశ్నించుకుంటే ఎవరైనా ఒకే సమాధానం చెపుతారు - పౌరులకు సమాచారం పొందే హక్కు కల్పించబడినదని.**

**కాని సమాచార హక్కు చట్టంలోని 31 సెక్షన్‌లలో దాదాపుగా 26 హక్కులు కల్పించటం జరిగింది. ఈ హక్కులపై ప్రజాసమాచార అధికారులకు, అప్పిలేట్ అధికారులకు, పౌరులకు సరైన అవగాహన కల్పించడానికే 'సమాచార హక్కు చట్టం - 2005' లోని పౌర హక్కుల గురించి ఈ వ్యాసాన్ని ఉద్దేశించడం జరిగింది.**

*పౌరులకు సమాచార హక్కు చట్టం - 2005 కల్పించిన హక్కులు సెక్షన్ 2 నుండి 20 వరకు -*

1. పౌరులు స్థల పరిశీలన కోరే హక్కు - సెక్షన్ 2 ప్రకారం
2. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలకు లోబడి సెక్షన్ (3) ప్రకారం పౌరులందరికీ సమాచారం తెలుసుకునే హక్కు కల్పించటం జరిగింది.
3. సెక్షన్ 6 (1) ప్రకారం ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు చేసుకునే హక్కు కల్పించారు.
4. పౌరులకు తెలిసిన స్థానిక భాషలో దరఖాస్తు రాసుకునే హక్కు - సెక్షన్ 6 (1).
5. స్థానిక భాషలో సమాచారం అందించాలని కోరే హక్కు - సెక్షన్ 6 (1).
6. దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవారు దరఖాస్తు ఫీజు నుండి మినహాయింపు కోరే హక్కు - సెక్షన్ 7 (5).
7. దరఖాస్తుదారు చదువురాని వారైతే పౌరుడు చెప్పే అంశాన్ని దరఖాస్తు రూపంలో రాయమని ప్రజా సమాచార అధికారిని కోరే హక్కు - 6 (1) (బి).
8. పౌరులకు కావలసిన సమాచారం ఎందుకోసం అనే కారణాలు చెప్పనవసరం లేకుండా ఉండే హక్కు - సెక్షన్ 6 (2).
9. తను సంప్రదించిన ప్రజా సమాచార అధికారి వద్ద సమాచారం లేనట్లయితే, ఆ సమాచారం ఎక్కడ లభ్యమవుతోందో, అక్కడికి దరఖాస్తు బదిలీ చేయమని కోరే హక్కు - 6 (3) (2).
10. ప్రజా సమాచార అధికారి సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే, ఎందుకు తిరస్కరిస్తున్నారో కారణాలు అడిగే హక్కు - సెక్షన్ 7 (2).
11. సమాచారం పొందడానికి కావలసిన సహాయం చేయమని పౌర సమాచార అధికారిని కోరే హక్కు - 7 (4).
12. తను కోరిన సమాచారానికి ఎంత డబ్బు చెల్లించాలో, దాని వివరాలు తెలపాలని కోరే హక్కు - 7 (3).
13. సమాచారానికి అయ్యే ఖర్చును, సమాచారాన్ని తగిన సమయంలో సమకూర్చని పక్షంలో రద్దు చేయమని కోరేహక్కు - 7 (5)
14. ప్రజా సమాచార అధికారి సమాచారం ఇవ్వలేని పక్షంలో కారణాలు తెలపాలని కోరే హక్కు - 7 (8).
15. సమాచారానికి అయ్యే ఖర్చు మదింపు సక్రమంగా లేదనిపించినప్పుడు, అట్టి మదింపును పున:పరిశీలన చేయమని కోరే హక్కు - 7 (4).
16. ఒకవేళ సంతృప్తికర సమాచారం పొందలేనప్పుడు అప్పీలుకు ఎలా వెళ్ళాలి అనే వివరాలు పొందే హక్కు - 7 (8).
17. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు తమ సమాచారం కోసం అయ్యే ఖర్చు భరించలేమని, తొలగించమని అడిగే హక్కు - 7 (6).
18. ఏదైన సమాచారం మొత్తం ఇవ్వలేనప్పుడు, ఇవ్వదగిన సగం సమాచారం ఇస్తూ మిగిలిన సమాచారం ఎందుకు ఇవ్వలేక పోతున్నారో కారణాలను తెలుసుకునే అధికారం - 10 (ఇ).
19. మూడవ వ్యక్తికి సంబంధించిన సమాచారం కోరే హక్కు - 10 (ఇ).
20. సమాచారం ఇవ్వనందుకు ఫిర్యాదు చేసే అధికారం / కంప్లెయింట్ 18 (1).
21. మొదటి అప్పీలు (అప్పిలేట్ అధికారికి) చేసే హక్కు - 19 (1).
22. రెండవ అప్పీలును రాష్ట్ర సమాచార కమీషనర్ గారికి చేసే హక్కు - 19 (3).
23. ప్రజా సమాచార అధికారికి జరిమానా వేయమని కోరే హక్కు - 20 (1).
24. ప్రజా సమాచార అధికారి తగిన రీతిలో స్పందించనప్పుడు, ఆ వ్యక్తిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరే హక్కు - 20 (2).
25. సమాచారాన్ని స్థానిక భాషలోగాని / ఎలక్ట్రానిక్ రూపంలో గాని ఇవ్వమని కోరే హక్కు - 19 (8).
26. నష్ట పరిహారాన్ని పొందే హక్కు - 19 (8).

పై విధంగా 'సమాచార హక్కు చట్టం - 2005'లో సెక్షన్ 2 నుండి 20 వరకు పౌరులకు 26 హక్కులను కల్పించారు. వీటి ద్వారా పౌరులు తమకు కావలసిన సమాచారం పొందడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, పై హక్కుల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి, పౌరసేవల మెరుగుదలకు దోహదం చేస్తారని ఆశిద్దాం.

*- డా॥ జి. అంజనేయులు*
*డిప్యూటీ డైరెక్టర్, (శిక్షణ) ఎ.ఎమ్.ఆర్ - అపార్డ్*

# కొత్తగా సర్వీసులో చేరిన ఉద్యోగులు సర్వీసు రిజిష్టరులో సరిచూసుకోవలసిన అంశాలు

**ప్రతి ఉద్యోగికి సర్వీసు రిజిష్టరు ఎంత ముఖ్యమైనదో చెప్పవలసిన పనిలేదు. ఉద్యోగి సర్వీసులో చేరిన తేదీ నుండి పదవీ విరమణ పొందే వరకు తన సర్వీసు వివరాలన్నీ నమోదు జరిగే ఏకైక సాధనం ఈ రిజిస్టర్. ఒక ఉద్యోగి సర్వీసుకు సంబంధించిన ఏ వివరాలకైనా ఏకైక ఆధారం కూడా. కావున ఇట్టి సర్వీసు రిజిష్టరులోని వివరాలు క్రమం తప్పకుండా నమోదు చేయవలసిన బాధ్యత తన పై అధికారి (డ్రాయింగ్ ఆఫీసర్) దే అయినా, పని ఒత్తిడి వలన కాని, సిబ్బంది కొరత వలన కాని ఏవైనా వివరాలు నమోదు కాని యెడల ఉద్యోగి పదవీ విరమణ సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి ఉంటుంది.**

అంతేకాక, ఆ వివరాల నమోదు కోసం గతంలో పనిచేసిన ప్రదేశాలకు వెళ్లటం, వారిని ప్రాధేయపడటం, అందుకు అనవసరమైన వ్యయ ప్రయాసలకు గురి అవటం జరుగుతుంది.

ఈ సమస్యలను అధిగమించడానికి ప్రతి ఉద్యోగి తరచుగా సర్వీసు రిజిష్టరులో నమోదు జరుగుతున్నది, లేనిదీ తప్పనిసరిగా సరిచూసుకోవలసి ఉంది. ఏమైనా అంశాలు నమోదు జరగని విషయాన్ని గమనించినట్లైతే, వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సరిచేయించుకోవలసిన బాధ్యత ఉద్యోగిదే.

కావున ప్రతి ఉద్యోగి సర్వీసులో చేరిన వెంటనే తన సర్వీసు రిజిష్టరును అధికారుల నుండి తగు విధానం ద్వారా పొంది సక్రమంగా తన వివరాలు నమోదు చేయించుకోవలసి ఉంది. ప్రతి పేజీ ఫొటో కాపీ చేయించుకొని ఒక గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించుకొని డూప్లికేట్ సర్వీసు రిజిష్టరు తన వద్ద ఉంచుకొనుట సర్వదా శ్రేయస్కరం. అలాగే ఈ క్రింద చూపబడిన నమోదు సక్రమంగా ఉన్నదీ లేనిదీ, సరిచూసుకోవాలి.

### సరిచూసుకోవలసిన అంశాలు

- ★ అపాయింట్‌మెంట్ తేదీ, ప్రొసీడింగ్స్ వివరాలతో సహా ఉద్యోగి పేరు, తండ్రి పేరు, నివాసస్థలం, పుట్టినతేదీ, కులం, పుట్టుమచ్చలు.
- ★ అపాయింట్‌మెంట్ అయిన సంస్థ, యాజమాన్యం.
- ★ విద్యార్హతలు.
- ★ ప్రొబేషన్ పూర్తిచేసిన వివరాలు.
- ★ అదనపు అర్హతలు మరియు డిపార్టుమెంట్ టెస్టులలో పాసైన వివరాల నమోదు.
- ★ బదిలీ అయిన ప్రతిసారీ ఎచట నుండి ఎచటకు బదిలీ అయినది, అంతేకాక ఏ ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయినది.
- ★ జి.ఐ.ఎస్ వివరాలు.
- ★ వార్షిక ఇంక్రిమెంట్లు
- ★ వేతన సవరణ (పి.ఆర్.సి), ఫిక్సేషన్ వివరాలు.
- ★ ప్రమోషన్లు, వాటి ఫిక్సేషన్ వివరాలు.
- ★ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ - ఫిక్సేషన్ వివరాలు.
- ★ వేతన స్కేలు మారినపుడు నూతన స్కేలు వివరాలు.
- ★ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు.
- ★ సంపాదిత సెలవు (ఎరన్డ్ లీవ్).
- ★ అసాధారణ సెలవు (ఎక్స్‌ట్రార్డినరీ లీవ్).
- ★ ప్రమోషన్ పొందినపుడు సంబంధిత సర్వీసు రూల్స్ ప్రకారం ఫిక్సేషన్లు.
- ★ ప్రీపోన్‌మెంట్/స్టెప్ అప్ వివరాలు ఉంటే అవి.
- ★ హోమ్ టౌన్ నమోదు.
- ★ ఎల్.టి.సి వివరాలు.
- ★ ప్రతి సంవత్సరం సర్వీసు వెరిఫికేషన్ ఎంట్రీలు (కంటిన్యుటీ ఉండేలా).
- ★ మెడికల్, మెటర్నటీ, సంపాదిత సెలవుల (ఎరన్డ్ లీవ్) వివరాల నమోదు.
- ★ సంపాదిత సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్ (సరెండర్ లీవ్) వివరాలు.
- ★ జి.పి.ఎఫ్/జెడ్.పి.పి.ఎఫ్ అకౌంట్ నెంబరు చెల్లింపుల వివరాలు.
- ★ ఏవైనా శిక్షణలకు హాజరైతే వాటి వివరాల నమోదు.
- ★ ఏవైనా అవార్డులు/రివార్డులు పొందితే వాటి వివరాల నమోదు
- ★ సి.సి.ఎ. రూల్స్ ప్రకారం ఏవైనా మైనర్/మేజర్ పెనాల్టీలు పొంది ఉంటే వాటి వివరాల నమోదు.
- ★ ఏవైనా సమ్మెల్లో పాల్గొని ఉంటే ఆ కాలాన్ని ఏ విధంగా (స్పెషల్ క్యాజువల్ లీవ్/లీవ్ నాట్ డ్యూ / నో వర్క్-నో పే మొదలైనవి) పరిష్కరింపబడినదో, వాటి వివరాల నమోదు.
- ★ ప్రొబేషన్ కాలంలో నమోదు చేయబడిన ఎరన్డ్ లీవును ప్రొబేషన్ పూర్తి అయిన తరువాత రీకాస్ట్ చేసి నమోదు చేయవలసిన వివరాలు.
- ★ ఏదైనా డిప్యుటేషన్‌పై ఇతర సంస్థలలో పనిచేసినట్లయితే/తిరిగి సొంత సంస్థకు తిరిగి వచ్చిన తరువాత వాటి నమోదు వివరాలు.
- ★ రెండవ భాష (సెకండ్ లాంగ్వేజ్ -తెలుగు) పాసైన వివరాల నమోదు.
- ★ ప్రతి ఉద్యోగి ప్రతి సంవత్సరం తన సర్వీసు రిజిష్టరును సరిచూసుకోవటానికి గల అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలి.

*- డా॥ ఎస్.వి.బి.ఎస్. శాస్త్రి, డిస్ట్రిక్ ట్రైనింగ్ మేనేజర్*
*పశ్చిమగోదావరి, జిల్లా*

# బాలికా శిశు సంరక్షణ పథకం



**1. బాలికా శిశు సంరక్షణ పథకం ఎప్పుడు ప్రారంభమైంది ?**

జ. బాలికా శిశు సంరక్షణ పథకం 2005లో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా, శిశు సంక్షేమ, వికలాంగులు సంక్షేమ శాఖవారు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

**2. బాలికా శిశు సంరక్షణ పథకం అంటే ఏమిటి?**

జ. ఒక బాలిక లేక ఇద్దరు బాలికలు (మరో బాలిక, బాలుడు ఉండరాదు) కలిగిన కుటుంబాలకు ఒక బాలికైతే రూ. 1,00,000/-లు, ఇద్దరు బాలికలు ఉంటే ఒక్కక్కరికో రూ. 30,000/- చొప్పున లబ్ది చేకూర్చే పథకమే బాలికా శిశు సంరక్షణ పథకం.

**3. బాలికా శిశు సంరక్షణ పథకం ద్వారా లబ్ది పొందాలంటే అర్హతలు ఏమి ఉండాలి ?**

జ.
- ఒక బాలిక లేదా ఇద్దరు బాలికలు కలిగి ఉన్న కుటుంబాలు మాత్రమే ఈ పథకానికి అర్హులు.
- తల్లి దండ్రుల్లో ఎవరైన ఒకరు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొని ఉండాలి.
- బాలికా శిశువు కలిగి వున్న కుటుంబాల మొత్తం వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 20,000/- లు పట్టణ ప్రాంతాలలో 24,000/- కంటే తక్కువ ఉండాలి.

**4. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ?**

జ. ప్రభుత్వమే నేరుగా కొంత సొమ్ము కుటుంబంలో పెట్టుబడి పెట్టడం ద్వారా సమాజంలో ఆడపిల్ల మీద ఉన్న చిన్నచూపును, వివక్షతను తొలగించడం.

- ఆడపిల్ల విద్యను ప్రోత్సహించడం, కనీసం ఇంటర్మీడియేట్ వరకైనా చదువుకునేలా ప్రోత్సహించడం
- ఆడపిల్లను 18 ఏళ్ళు నిండే వరకూ వివాహం చేయకుండా చూడటం
- ఇద్దరు ఆడపిల్ల సంతానం కలిగిన తల్లిదండ్రులను కుటుంబ నియంత్రణ పాటించేలా ప్రోత్సహించడం
- బాలికలకు సామాజిక ఆర్థిక సాధికారత కల్పించడం
- ఆడపిల్లల పట్ల వ్యతిరేకత భావాన్ని, ఇతర సాంస్కృతిక దురాచారాలని రూపుమాపడం
- బాలికల హక్కులను ప్రోత్సహించి పరిరక్షించడం, సామర్థ్యాల పట్ల, అవసరాల పట్ల అవగాహన పెంపొందించడం
- కుటుంబంలో ఆడపిల్లల స్థాయి మెరుగుపడేలా, ఆడపిల్లల పట్ల కుటుంబ వైఖరిలో సాను కూలమైన మార్పును తీసుకురావడం.

**5. ఈ పథకం ద్వారా ఆడపిల్లలకు అందే ప్రయోజనాలు ఏమిటి ?**

జ. ఒక ఆడ సంతానమైతే వారికి 20 సంవత్సరములు నిండగానే ఒక లక్ష రుపాయలు పొందటానికి ఆ బాలిక అర్హురాలు అవుతుంది.

- ఇద్దరు ఆడ సంతానమైతే వారికి 20 సం॥ నిండగానే వారిద్దరికీ చెరి 30,000/- రూపాయలు పొందటానికి అర్హులు.
- మూడేళ్ల వయస్సు నుండి ఆ బాలికలకు జీవితభీమా వర్తిస్తుంది
- ఆ ఇద్దరు ఆడసంతానికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఒక్కో బాలికకు సంవత్సరానికి 1200/- రూపాయలు చొప్పున స్కాలర్‌షిప్‌గా ప్రభుత్వం ఇస్తుంది
- ఈ పథకం వర్తించే బాలిక ప్రమాదవశాత్తు మరణిస్తే ఆమె ఒకే సంతానమైతే రూ. 1,00,000/- ఆమె తల్లిదండ్రులకు లభిస్తుంది.

**6. ఈ పథకంలో ఒకే ఆడసంతానం కలిగిన వారికి ప్రాధాన్యత ఏమైనా ఉంటుందా ?**

జ. గ్రామలలో అయితే ఏడాదికి 20,000/ రుపాయల లోపు, పట్టణాలలో అయితే 24000/- రూపాయలలోపు ఆదాయం కలిగి ఉండి మూడేళ్ళలోపు వయసు కలిగిన ఒకే ఒక ఆడ సంతానం వుండి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న కుటుంబాలకు మొదట ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇద్దరు ఆడ సంతానం వున్న కుటుంబాలకు రెండవ ప్రాధాన్యం ఇస్తారు. అయితే ఆ ఇద్దరు

సంతానంలో రెండవ బిడ్డ వయస్సు మూడేళ్ళకు మించరాదు. ధరఖాస్తు చేసిన తేది నాటికి ఆ బాలిక వయస్సును బట్టి ఈ పథకం కింద లబ్ది పొందటానికి అర్హత వున్నది లేనిది నిర్ణయిస్తారు.

**7. అనాధ, నిరాశ్రయులైన బాలికలకు వయస్సు, నియత విద్య విషయంలో సడలింపులు ఏమైనా ఉన్నాయా?**

జ. • అనాధ అంటే బాలిక శిశువు తల్లి దండ్రులిద్దరు లేని వారు అని అర్థం. నిరాశ్రయలు అంటే దారిద్ర్యరేఖకు దిగువున వున్న, వేశ్యా వృత్తిలో కూరుకు పోయిన బాధితులు లేదా హెచ్.ఐ.వి./ఎయిడ్స్ బాధితులు మొదలైన కుటుంబాలు తల్లిదండ్రులచే వదిలివేయబడి ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన ప్రభుత్వేతర సంస్థల ఆశ్రయం పొందిన బాలికా శిశువులు అని అర్థం.

- 18 సంవత్సరాల వయస్సు దాటిన అట్టి నిరాశ్రయలు లేదా అనాధ బాలికలందరూ బాలికా శిశు సంరక్షణ పథకం క్రింద ప్రయోజనాలను పొందటానికి అర్హులు.
- 2005, ఏప్రిల్ కంటే ముందు జన్మించిన అనాధలు, నిరాశ్రయులు, బాలికల విషయంలో నియత విద్య నిబంధనను సడలించడం జరుగుతుంది. 8వ తరగతిని దాటి చదవని బాలికలు వాస్తవంగానే వార్షిక విద్యా స్కాలర్ షిప్పులకు అర్హులు కారు. అట్టి వారు 20 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత వారికి వర్తించెట్లు రూ. 1,00,000/- లేదా రూ.30,000/- లు మాత్రమే పొందుతారు.
- నిరాశ్రయులు, అనాధలు, 2005 ఏప్రిల్ తరువాత జన్మించిన వారందరూ తప్పనిసరిగా పాఠశాలలో చేరివుండి 2వ తరగతి వరకు కొనసాగించిన వారు మాత్రమే ఈ పథకం క్రింద ప్రయోజనాలను పొందటానికి అర్హులు.

**8. వికలాంగ బాలికలకు ఈ పథక నిబంధనలలో సడలింపులు ఏమైనా ఉన్నాయా ?**

జ. బహుళ వికలాంగులైన బాలికల (80% కంటే ఎక్కువ వైకల్యం) విషయంలో బాలిక శిశువు ఒకరు లేదా ఇద్దరు బాలికలు మాత్రమే అన్న నిబంధన వర్తించదు. ఒక బాలిక ఇద్దరు బాలురు (అన్నదమ్ములు) వున్నవారు కూడా బాలికా శిశు సంరక్షణ పథకం క్రింద లబ్ధి పొందటానికి అర్హులు

- బాలికా శిశువు సంరక్షణ పథకం క్రింద ప్రయోజనం పొందటానికి 80% శాతం కంటే ఎక్కువ వైకల్యంగల బాలికలు అర్హులు అయితే అట్టివారు తల్లిదండ్రులు / సంరక్షకులు అన్ని విధాలుగా



అదాయం సంవత్సరానికి రు. 1,00,000/- మించరాదు

- బహుళ వైకల్యం గల బాలికల విషయంలో నియత విద్య నిబంధనను సడలించడమయింది.

**9. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ఎవరిని కలవాలి ? ఎలా దరఖాస్తు చేయాలి ?**

జ. అర్హత నిబంధనలను సంతృప్తి పరిచేవారు సంబంధిత అంగన్‌వాడి సిబ్బందిని పూర్తి వివరాలు వివరించడం జరుగుతుంది. అంగర్‌వాడి సిబ్బంది నుండి గాని లేదా మహిళా శిశు సంక్షేమ శాఖవారి వెబ్‌సైట్ నుండి గాని సంబంధిత దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని వారిని పూరించి అనుబంధాలతో పాటుగా అంగన్‌వాడి సిబ్బందికి సమర్పించాలి. ఈ పథకాన్ని గ్రామస్థాయిలో అంగన్‌వాడి కార్యకర్త మండల స్థాయిలో ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్స్, బ్లాక్ స్థాయిలో ప్రాజెక్ట్ అధికారి, జిల్లాస్థాయిలో ప్రాజెక్ట్ డైరక్టర్ పర్య వేక్షిస్తుంటారు.

**10. ఈ పథకానికి దరఖాస్తు చేయాలంటే దరఖాస్తుతో పాటూ జత చేయవలసినవి ఏమి ?**

జ. • రెండు ఫొటో గ్రాఫ్‌లు (బాలికలవి)

- వైధ్య అధికారి జారి చేసిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స ధృవ పత్రం
- తహసిల్‌దారు జారీ చేసిన ఆదాయ ధృవ పత్రం
- ధృవికరించిన జనన ధృవ ప్రతం ప్రతి
- ధృవీకరించిన తెల్లరేషన్ కార్డు ప్రతి
- ప్రధాన వైద్య అధికారి జారీ చేసిన వెకల్య ధృవ పత్రం (వికలాంగుల విషయంలో)

**- ఎమ్. ప్రదీప్ కుమార్,**
**రిసెర్చ్ అసోసియేట్, అపార్డ్**

## బాలల హక్కులు పర్యవేక్షించే చట్టం

# బాలల న్యాయ (బాలల రక్షణ మరియు సంరక్షణ) చట్టం- 2000 (జువెనైల్ జస్టిస్ చట్టం)

**ముఖ్య ఉద్దేశ్యం:**

**జువెనైల్ (బాలల) న్యాయ (బాలల రక్షణ మరియు సంరక్షణ) చట్టము-2000, ఏప్రిల్ 1, 2000 నుంచి అమలులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ జువెనైల్ (బాలల) న్యాయ (బాలల రక్షణ మరియు సంరక్షణ) నియమావళి 2003లో నిబంధనలను తయారుచేసి ప్రకటించింది.**

చట్టాన్ని అతిక్రమించిన బాలలకు రక్షణ మరియు సంరక్షణ కల్పించడం, అవసరమైన బాలలకు తగిన రక్షణను, సంరక్షణను ఇవ్వడం, వారి అభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లను చేసి ఆదరించడం, బాలలకు సంబంధించిన విషయాలలో న్యాయ నిర్ణయాలు, పరిష్కారాలు చేసేటప్పుడు వారి ప్రయోజనాలకోసం స్నేహపూర్వకంగా దగ్గరకావడం, ఈ చట్టం క్రింద ఏర్పరిచిన వివిధ సంస్థల ద్వారా వారి శాశ్వత పునరావాసం కోసం ఏర్పాట్లుచేయడం.

**బాలల హక్కులు :**

బాలల హక్కుల సమ్మేళనంలో ఆమోదించిన బాలల హక్కులు

బాలలు నాలుగు ప్రధాన హక్కులు కలిగి వున్నారు.

1) జీవించే హక్కు 2) అభివృద్ధి చెందే హక్కు 3) రక్షణ పొందే హక్కు 4) భాగస్వామ్య హక్కు

**జీవించే హక్కు :**

బాలలకు జీవించే హక్కు మరియు జీవించడానికి కావలసిన కనీస అవసరాల గురించి తెలియజేస్తుంది.

- తగిన జీవన ప్రమాణాలు
- నివాసము
- పౌష్టిక ఆహారము
- వైద్య సదుపాయాలను కల్పించడం

**అభివృద్ధి చెందే హక్కు :**

- అభివృద్ధికి దోహదపడే అంశాల గురించి తెలియజేస్తుంది
- ఆటలు మరియు విరామము
- సాంస్కృతిక కార్యక్రమాలు
- సమాచారం పొందే హక్కు
- మతం, మనస్సాక్షి, ఆలోచనలలో స్వాతంత్ర్యం

**రక్షణ పొందే హక్కు :**

బాలలను అన్ని రకాలుగా దుర్వినియోగం, బాలలను స్వలాభం కొరకు ఉపయోగించటం

**నిర్లక్షిత బాలలకు ప్రత్యేక రక్షణ కోసం అభయము నిచ్చుట :**

- శరణార్థుల బాలలు
- దుర్వినియోగం నుంచి రక్షణ
- న్యాయవ్యవస్థ
- సాయుధ పోరాటాల్లో పాల్గొన్న బాలలు
- బాల కార్మికులు
- మత్తు పదార్థాల దుర్వినియోగం
- లైంగిక అత్యాచారాలు

**భాగస్వామ్య హక్కు :**

**బాలలకు వారి వర్గాల్లో, జాతిలో చురుకైన పాత్రను పోషించడానికి అధికారమివ్వడం**

- భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ
- వారికి సంబంధించిన విషయాలలో వారి అభిప్రాయం చెప్పడం
- సంఘాలలో ప్రవేశించటం
- శాంతియుతంగా సమావేశాలు జరుపుకోవడం

### బాలల హక్కుల సదస్సు

బాలలపై హక్కుల సదస్సు (కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చిల్డ్రన్ - సి.ఆర్.సి) - 1989లో రూపొందించిన ఒప్పందంపై భారత ప్రభుత్వం 1992 సం. ఆమోదించి, సంతకం చేసింది. ఈ ఒప్పందంలో -

**ఆర్టికల్: 1.** 18 సం.లోపు వయసువారు బాలలు

**ఆర్టికల్: 2.** ఎవరేని ఇద్దరు బాలల మధ్య వారు ఏ నేపథ్యానికి చెందిన వారయినప్పటికీ వివక్ష చూపరాదు.

**ఆర్టికల్: 3.** బాలల ప్రయోజనాలకోసం, బాలలకు సంబంధించిన ఏ నిర్ణయమైనా, మార్గదర్శకత్వమయినా, ఒప్పందమయినా, సలహా అయినా బాలల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి.

**ఆర్టికల్: 5.** కుటుంబం - బాలలందరికీ వారి కుటుంబంతో వుండే హక్కుంది.

**ఆర్టికల్: 6.** జీవించే హక్కు - బ్రతికుండటం మాత్రమే అని అర్థం కాదు. ఆరోగ్యకరమైన, అవసరమైన అన్ని జీవన నైపుణ్యాలతో అర్థవంతమైన జీవనం అని అర్థం

**ఆర్టికల్: 11.** బాలల క్రయ విక్రయాలు శిక్షార్హమయిన నేరం

**ఆర్టికల్: 12.** భాగస్వామ్య హక్కు- తమ అభిప్రాయాలు తెలియజేయడం, ఆలోచనలు పంచుకోవడం, తమ గురించి చర్చించే వ్యవహారాలను అర్థం చేసుకోవడం మరియు అంతిమ నిర్ణయాలలో భాగస్వాములు కావడం

**ఆర్టికల్: 18.** బాలల సంరక్షణ అనేది ప్రతి కుటుంబం ప్రాథమిక బాధ్యత మరియు ప్రభుత్వం దానికోసం సౌకర్యం కల్పించాలి.

**ఆర్టికల్: 32.** బాల కార్మిక వ్యవస్థకు ఆమోదం లేదు.

**ఆర్టికల్: 37.** బాలలను ఖైదు చేయడం కాని, వారికి మరణ శిక్ష విధించడం గాని చేయరాదు.

**ఆర్టికల్: 39.** బాధిత బాలలకు మరియు బాల నేరస్థులకు పునరావాసం కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**ఆర్టికల్: 40.** నేర స్వభావం గల బాలలకు వారి ప్రవర్తన మార్చుకోవడానికి, తిరిగి సమాజంలోకి వచ్చేందుకు సముచిత అవకాశం ఇవ్వాలి.

**నిర్వచనాలు:**

జువెనైల్ (బాలలు) అనగా ఎవరు?: ఈ చట్టం ప్రకారం బాలలు అనగా 18 సంవత్సరాలు పూర్తికాని బాలుడు లేక బాలిక. ఈ చట్టం ప్రకారం బాలలను 2 రకాలుగా వర్గీకరించారు.

- చట్టాన్ని అతిక్రమించిన బాలలు అనగా నేరము చేశారని ఆరోపించబడిన 18 సంవత్సరాలు పూర్తికాని బాలుడు లేక బాలిక
- రక్షణ మరియు సంరక్షణ అవసరమైన బాలలు
    - అనగా ఎటువంటి స్థిర నివాసం లేని పిల్లలు
    - తగిన జీవనాధారం లేక వదిలివేయబడ్డ పిల్లలు
    - బెదిరింపులకు గురైన పిల్లలు
    - తల్లిదండ్రులు విడిచిపెట్టిన పిల్లలు
    - ఇంటినుండి తప్పిపోయిన, లేక పారిపోయిన పిల్లలు
    - లైంగిక హింసలకు, చట్టవిరుద్ధమైన చర్యల కోసం దుర్వినియోగానికి గురవుతున్న పిల్లలు
    - అక్రమ లాభాల కోసం దుర్వినియోగానికి గురవుతున్న పిల్లలు
    - సాయుధ పోరాటాలు, పౌర సంక్షోభం, ప్రకృతి విపత్తులలో బాధితులైన పిల్లలు.

## బాలల న్యాయ (బాలల రక్షణ మరియు సంరక్షణ) చట్టం 2000 లో బాలలకు కల్పించిన సౌకర్యాలు

- ఆదరణ మరియు సంరక్షణలు అవసరం గల పిల్లలు మరియు చట్టంతో ఘర్షణలో వున్న పిల్లల (పిల్లలు / బాల నేరస్తులు) వయస్సును పరిగణనలో తీసుకోవడంతో పాటు, ఆ పిల్లలు, వారి కుటుంబాల బాగోగులు చూడటం.
- ఇంటి నుండి పారిపోయిన, దోపిడికి గురైన లేదా చట్టంతో ఘర్షణలో వున్న పిల్లల కుటుంబాలకు సమాజంలో సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పించడం.
- చట్టంతో ఘర్షణలో ఉన్న పిల్లలకు పునరావాసం కల్పించడానికి, దీర్ఘకాల న్యాయ వివాదాలలో చిక్కుకోకుండా నివారించడానికి సామాజిక మానవ వనరులుగా నేర్పుగా వినియోగించడం.

**ఉద్దేశ్యాలు:**

- 18 సం.లో ఉన్న వయసు బాలలందరికీ ఉమ్మడి న్యాయవ్యవస్థ.
- చట్టంతో సంఘర్షణలో వున్న బాలల నుండి ఆదరణ మరియు సంరక్షణ అవసరమయిన బాలలను వేరు చేయడం.
- బాల నేరస్తులను, పెద్దవాళ్ళయిన నేరగాళ్ళనుండి విడదీయడం; బాలలపై నేరస్తుల ముద్ర వేయకపోవడం
- బాలలకు ఆదరణ, రక్షణ, చికిత్స, అభివృద్ధి మరియు పునరావాసాల కల్పన మీద దృష్టి పెట్టడం
- దోపిడీ, - చిత్ర హింసలకు గురయిన బాలలకు సత్వర పునరావాసం కల్పించడానికి అన్ని ప్రయత్నాలు చేయడం
- పోలీసులకు, బాల నేరస్థుల ప్రత్యేక పోలీస్ యూనిట్ (స్పెషల్ జువైనైల్ పోలీస్ యూనిట్ - ఎస్.జె.పి.యు) ద్వారా సహాయపడటం.

### ఆదరణ మరియు రక్షణ

- ప్రకృతిపర, మానవ కల్పిత విపత్తులు - సాయుధ ఘర్షణలు, గొడవలు, భూకంపాలు, వరదలు మొదలగు వాటి బాధితులయిన బాలలను కూడా ఆదరణ మరియు రక్షణ కావాల్సిన బాలల జాబితాలో చేర్చడం.
- ఈ క్రింది వారు బాలలను కాపాడి, రక్షించి బాలల సంక్షేమ కమిటి (సి.డబ్ల్యు.సి) ముందుకు రక్షణ - ఆదరణ కొరకు తీసుకురావచ్చు.

- గుర్తింపు పొందిన స్వచ్ఛంద సేవాసంస్థలు, పోలీస్, చైల్డ్‌లైన్ (నెం.1098) లేదా ఎవరైనా సామాజిక సేవాతత్పరులయిన పౌరులు.
- సరైన కారణం లేకుండా బాలలను బాలల సదనాలలో దీర్ఘకాలంలో వుంచరాదు. పిల్లలను సాధ్యమయినంత త్వరగా తల్లిదండ్రులతో తిరిగి కలపాలి- స్వంతవారు లేదా దత్తత తీసుకున్న వారు లేదా పెంచుకునే వారి రక్షణలో ఉండవచ్చును. లేదా తల్లిదండ్రులను వారి పిల్లలను తమ కుటుంబంలో వుంచుకోవడానిక ప్రాయోజిత భృతి అందజేయాలి.

## బాలల సంక్షేమ కమిటీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ - సి.డబ్ల్యు.సి)

కమిటీ ముందు హాజరు పరచబడి రక్షణ మరియు సంరక్షణ అవసరమైన బాలలను వారి తల్లిదండ్రుల వద్దకు, సంరక్షకుల చెంతకు, బాధ్యత వహించే స్వస్థలాలకు గానీ చేర్చడం మరియు అటువంటి బాలలకు రక్షణ కల్పించడం బాలల సంక్షేమ కమిటీ ముఖ్య ఉద్దేశ్యం.

ఈ కమిటీలో ఒక అధ్యక్షుడు మరియు నలుగురు సభ్యులు రాష్ట్ర ప్రభుత్వంచే నియమింపబడతారు. ఇందులో కనీసం ఒక స్త్రీ మరియు బాలల వ్యవహారాలలో నిపుణులైన ఒక వ్యక్తి సభ్యులుగా వుండాలి.

ఈ కమిటీ బాలల సదనం ఆవరణలో కనీసం వారానికి రెండుసార్లు సమావేశమవ్వాలి.

కమిటీ సమావేశాలు చాలా సాధారణంగా జరగాలి. ఎత్తైన వేదిక, విట్‌నెస్ బాక్స్ లాంటివి వుండకూడదు. విచారణ సమయంలో బాలుడిని సానుకూలమైన మరియు ఇంటిని పోలిన వాతావరణంలో వుండేటట్లు జాగ్రత్త వహించాలి.

కమిటీ ముందు బాలుడు ప్రవేశపెట్టబడినపుడు, ఆ బాలుని కేసును విచారణ నిమిత్తము సామాజిక కార్యకర్తకు/కేస్ వర్కర్‌కు/చైల్డ్ వెల్ఫేర్ అధికారికి/ సదరు పర్యవేక్షణాధికారికి అప్పగించాలి.

కమిటీ సమావేశాలు లేనపుడు, బాలుడిని ఏ సభ్యుని ఎదుటైనా హాజరుపరచవచ్చు లేదా అన్ని మౌలిక సదుపాయాలున్న సురక్షిత స్థలంలో వుంచి, బాలుని తల్లిదండ్రులను వెదికి వారితో కలపడానికి కృషి జరగాలి. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవచ్చు

## బాలల సంక్షేమ కమిటీ (సి.డబ్ల్యు.సి) కార్యక్రమాలు

- బాలల సంక్షేమ కమిటీ న్యాయమూర్తుల పీఠంలా వ్యవహరిస్తుంది. నేరశిక్షాస్మృతి-1973 మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ లేదా ఒక ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌లకు దాఖలుపరచిన అధికారాలు కలిగి వుంటుంది. (ఆర్టికల్ 29.5)
- ఆదరణ మరియు రక్షణ కావలసిన బాలలను కమిటీ ముందు పోలీసు అధికారులు, బాలనేరస్తుల ప్రత్యేక పోలీసు యూనిట్‌లు, ప్రభుత్వోద్యోగులు, చైల్డ్ లైన్ లేదా ఇతర స్వచ్ఛంద సేవాసంస్థలు, సంఘసేవకులు లేదా సామాజిక సేవాతత్పరతగల పౌరులు ప్రవేశపెట్టవచ్చును.
- కమిటీ దర్యాప్తు చేసి, పిల్లలను తగు నివాసాలలో వుంచమని ఉత్తర్వులు జారీ చేయవచ్చును. సముచిత పునరావాసం, సామాజిక ఏకీకరణ కల్గించమని, దత్తత, తీసుకునేవారి రక్షణకు పంపడం మద్దతు అందించడం లేదా శిక్షల అనంతరం ఆదరించే సంస్థలకు పంపించడం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులతో సహా తగు ఉత్తర్వులు జారీ చేయవచ్చును.
- బాలల హక్కుల దుర్వినియోగం గురించి కమిటీ దర్యాప్తుచేసి వారి బాల్యాన్ని తిరిగి అందించేలా తగు ఉత్తర్వులు జారీ చేయవచ్చును. (కమిటి జారీచేసిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానాలలో సవాలు చేయవచ్చును.)

## బాలల సంక్షేమ కమిటి (సి.డబ్ల్యు.సి) ముందు ప్రవేశపెట్టవలసిన బాలలు

- బాలకార్మికులు
- వదిలివేయబడిన/తప్పిపోయిన/పారిపోయిన బాలలు
- స్వచ్ఛందంగా చేరినవారు, అదుపుచేయలేని బాలలు
- హెచ్.ఐ.వి/ ఎయిడ్స్‌కు ప్రభావితులైన/ సోకిన బాలలు
- పెద్దల బెదిరింపులు ఎదుర్కొంటున్న పిల్లలు
- ఇంటిపని, డాన్స్‌బార్లు, హోటళ్ళు, కార్ఖానాలు, నిర్మాణ స్థలాలలో ఉన్న బాలలు
- విక్రయానికి/ లైంగిక హింసకు, వినియోగానికి/ బాల్యవివాహాలకు బలైన వాళ్ళు
- యజమానులు - ఇతర సంస్థల నుండి బదిలీ అయి వచ్చినవారు
- సంస్థలలో వుండే పిల్లలను నిర్ణీత కాలంలో సమీక్షించడం - స్వాధీనపరచమని కోరే హక్కు/ సందర్శించే హక్కులు
- అక్రమ లాభాల కోసం దుర్వినియోగానికి గురవుతున్న పిల్లలు
- సాయుధపోరాటాలు, పౌర సంక్షోభం, ప్రకృతి విపత్తులలో బాధితులైన పిల్లలు
- బిచ్చమెత్తుకునే బాలలు
- లొంగిపోయినవారు/ విడిచిపెట్టబడిన బాలలు
- బాలల న్యాయమండలి పంపిన బాలలు
- ఎటువంటి స్థిర నివాసం లేని పిల్లలు
- భౌతిక హింసకు బలైన వారు

## బాలల న్యాయమండలి (జువెనైల్ జస్టిస్ బోర్డ్ - జె.జె.బి)

చట్టంతో విభేదించబడిన బాలలకు సంబంధించిన కేసులను విచారించే నిమిత్తం 'బాలల న్యాయ మండలి' ఏర్పాటు అయింది. ఈ బాలల న్యాయ మండలిలో ఒక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు లేదా జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు 'ప్రిన్సిపల్ మేజిస్ట్రేటు' గాను, ఇద్దరు సామాజిక సేవకులు (అందులో ఒకరు స్త్రీ) సభ్యులుగా, ప్రభుత్వం ద్వారా నియమించబడతారు.

బాలల మనస్తత్వ శాస్త్రం లేక బాలల సంక్షేమం గురించి సరైన అవగాహన/ ప్రత్యేక పరిజ్ఞానం, శిక్షణ కలిగిన న్యాయమూర్తులను జువెనైల్ జస్టిస్ (బాలల న్యాయ మండలి) ప్రిన్సిపల్ న్యాయ మూర్తులుగా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుతో సంప్రదించి నియమిస్తుంది. అటువంటి ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన న్యాయమూర్తులు లభించని పక్షంలో ప్రభుత్వం ఆ న్యాయమూర్తులకు సరైన శిక్షణనిస్తుంది.

ఇద్దరు సామాజిక సేవకులను మండలి సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఈ సభ్యుల కాలపరిమితి మూడు సంవత్సరాలు.

ఈ మండలి సమావేశం పరిశీలన గృహ ఆవరణలోను లేదా ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశంలో అన్ని పనిదినాలలో, నిర్ణయించిన సమయాలలో జరపాలి.

ఏ సభ్యుడైనా మండలి నుండి వైదొలగాలనుకుంటే, ఒక నెల ముందుగా రాతపూర్వకంగా తెలియజేయాలి లేదా ఈ చట్టము సెక్షను 4(5) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏ సభ్యుడినైనా తొలగించవచ్చు.

మండలి సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వంచే నిర్ణయించబడిన గౌరవ వేతనం చెల్లించబడుతుంది.

ఈ చట్టం ప్రకారం, విచారణ అతి సాధారణంగా జరగాలి. ఎత్తైన వేదిక, విట్‌నెస్ బాక్స్ లాంటివి వుండకూడదు. విచారణ నెదుర్కొంటున్న బాలుడు/ బాలిక, విచారణ సమయంలో, ఇంటి వాతావరణలో వున్న అనుభూతిని కలిగించేలా జాగ్రత్త తీసుకోవాలి.

విచారణ సమయంలో, బాలుడిని సానుకూలమైన వాతావరణంలో వుంచి, నేరానికి సంబంధించిన నిజాలనే కాకుండా, ఇంటి పరిస్థితులు, సామాజిక స్థితిగతులు, పిల్లవాడు నేరం చేయడానికి దారితీసిన పరిస్థితుల గురించి విచారణ జరిపి, ఈ చట్టంలోని సెక్షను 15(1) లో వివరించబడిన ప్రత్యామ్నాయాలను ను దృష్టిలో వుంచుకొని మండలి తగు ఉత్తర్వులను జారీ చేయాలి.

సెక్షన్ 15(2) ప్రకారం, తగు ఉత్తర్వులు జారీ చేసే నిమిత్తము, బాలుని నడవడిక మరియు పూర్వాపరాలపై విచారణ జరపమని, ప్రొబేషను అధికారిని కాని, గుర్తింపు పొందిన వాలంటరీ ఆర్గనైజేషను కాని మండలి ఆదేశించి, నివేదికను తెప్పించుకోవాలి.

## ప్రత్యేక పోలీసు విభాగం (స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్)

వయోజన నేరస్తులు, కరుడుగట్టిన నేరస్తుల్లా కాక బాలల్ని ప్రత్యేకంగా చూడటం బాలల న్యాయ (రక్షణ మరియు సంరక్షణ) చట్టం - 2000 అభిమతం.

ప్రత్యేక పోలీస్ విభాగం (స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్) జె.జె. యాక్ట్- 2000 లో పొందుపరచిన ప్రత్యేక విభాగం. పిల్లల పట్ల స్నేహభావంతో పనిచేసే ప్రత్యేక పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జె.జె. యాక్ట్ - 2000 లో పొందుపర్చడం జరిగింది.

ఒక దేశంలోని బాలల సంరక్షణకు సంబంధించిన వారంతా బాలల హక్కులను గుర్తించాలి. ముఖ్యంగా వివిధ చట్టాలను, అందులో అంశాలను ఉల్లంఘించిన పిల్లలతో (అభియోగం మోపబడి చట్టంతో విభేదించబడి) పనిచేసేటప్పుడు పిల్లల గౌరవం, గొప్పతనం, మర్యాదలకు భంగం వాటిల్లకుండా ప్రవర్తించాలి. బాలల వయస్సును పరిగణనలోకి తీసుకొని వారు చట్ట ఉల్లంఘన చేసినప్పటికీ, వారిని ప్రత్యేకంగా చూస్తూ సమాజ నిర్మాణంలో పాలుపంచుకునే భావి పౌరులుగా భావించాలి.

పై ఆశయాన్ని సాధించడం కొరకు వివిధ దేశాలు రకరకాల చట్టాల్ని రూపొందించి చట్టం అమలుకు కావలసినటువంటి హంగులను సమకూర్చుకొనే విధానంలో భాగంగా జె.జె. యాక్ట్ (2000) లో ప్రత్యేక పోలీస్ విభాగం (స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్) చేర్చారు.

## ప్రత్యేక జువెనైల్ పోలీసు విభాగం మరియు చైల్డ్ వెల్ఫేర్ అధికారి

బాలల న్యాయ (రక్షణ మరియు సంరక్షణ) చట్టం 2000 లోని ఆర్టికల్ 63 ప్రకారం, బాలల పట్ల సరియైన అవగాహన, పరిజ్ఞానం గల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు హోదా గల పోలీసు అధికారి నేతృత్వంలో ప్రత్యేక జువెనైల్ పోలీసు విభాగం జిల్లా స్థాయిలోను, ఒక చైల్డ్ వెల్ఫేర్ అధికారి ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ నియమించబడతారు.

ప్రతి జిల్లాలోను ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు హోదా కలిగిన పోలీస్ అధికారి నేతృత్వంలో మిగతా ప్రత్యేక పోలీస్ విభాగాలు పనిచేస్తాయి. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కనీసం ఒక రక్షకభటుడు (ఎవరైతే పిల్లలతో పనిచేయడానికి అర్హత పొంది ఉన్నారో) వారిని పిల్లల సంక్షేమ అధికారిగా హోదా కల్పించాలి.

ప్రత్యేక బాలల న్యాయ (రక్షణ మరియు సంరక్షణ) చట్టం 2000 లోని ఆర్టికల్ 63 ప్రకారం, ప్రత్యేక జువెనైల్ పోలీస్ విభాగంలోని సిబ్బంది తరచుగా ప్రత్యేకంగా పిల్లలతో పనిచేస్తూ, పిల్లలు చేసే నేరాల్ని అదుపులో వుంచగలుగుతూ, పిల్లల పట్ల స్నేహభావం కలిగి పనిచేయాల్సి ఉంటుంది. ఇందు కోసం రక్షకభటులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలి.

**- ఆర్. శివపార్వతి,**

**డిప్యూటీ డైరెక్టర్ - విభాగ అధిపతి, సి.డబ్ల్యు.సి.డి/యస్.టి.ఆర్.సి**

కథ

# జాలిగుండె లేని కొడుకుని కన్నా . . .

**ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబం పార్వతమ్మది. నిత్యకళ్యాణం పచ్చతోరణంలా నిత్యాన్నదాన సత్రంలా ఉన్న ఇల్లు ఇప్పుడు నీళ్ళులేని చిల్లుకుండలా మారిపోయింది. పండుగొచ్చిందంటే చాలు కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు, పిల్లాపాపలతో సందడి సందడిగా కళకళ లాడిన ఇల్లు ఇప్పుడు బోసిపోయి పలకరించేవాళ్ళే కరువయ్యారా అన్నట్టుగా మారిపోయింది.**

భర్త ఉండగా నిండుకుండలా, నిత్యం నవ్వుతూ నట్టింట్లో తిరిగిన పార్వతమ్మ ఇప్పుడు ఆరోగ్యం క్షీణించి నిరాశా నిట్టూర్పులతో రోజులు వెళ్ళదీస్తోంది. మూడేళ్ళ క్రితం మొదలైన మోకాళ్ళ నొప్పి తగ్గనని మొరాయించటంతో అడుగుతీసి అడుగెయ్యటమే కష్టమై, ఎక్కడికీ కదలలేక ఇంట్లోనే కాలం వెళ్ళబుచ్చుతోంది.

చిన్నకొడుకు ప్రవీణ్ చెడు అలవాట్లతో చితికిపోయి ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉన్నా, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పెద్దకొడుకు ప్రకాష్ పరిస్థితి మాత్రం ఫరవాలేదనట్టుగా ఉంది. రాజమండ్రిలో ఉన్న కూతురు విజయ, అల్లుడు అప్పుడప్పుడు వచ్చి మంచి చెడ్డలు చూస్తూ పరామర్శించి పోతుండటంతో పార్వతమ్మకు కొంతలో కొంత ఊరటగా ఉంటోంది.

భర్త ఉండగా ఖర్చుకు వెనకాడకుండా అన్నీ చేసిన పార్వతమ్మకు అప్పుడు అందరూ చుట్టాలే. ఏ చిన్నకార్యక్రమమైనా ఆ ఇంట్లో పెద్ద పండగలాగే జరిగేది. అయితే, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! ఇప్పుడు పరిస్థితులు మారాయి. డబ్బుకే కాదు, జబ్బులూ దాడిచేయటంతో ప్రతిదానికీ పార్వతమ్మ ప్రక్కవాళ్ళమీద ఆధారపడక తప్పటంలేదు.


భర్త పెన్షన్‌తో పాటు తనుంటున్న ఇంటిలో ఒక పోర్షన్‌కొచ్చే అద్దెతో బ్రతుకు బరువుగా నెట్టుకొస్తున్న పార్వతమ్మకు ఆరోగ్యం బాగా దెబ్బతినటంతో, ఆసుపత్రి అవసరాలకు డబ్బు అత్యవసరమై ఒకరోజు చిన్న కొడుక్కి ఫోన్ చేసి "ఒరేయ్ ప్రవీణూ, ఒక రెండువేలు ఉంటే సర్దరా. ఫస్టుకి మీ నాన్న పెన్షన్ రాగానే ఇచ్చేస్తాను" అని అడిగింది ఆత్మాభిమానాన్ని చంపుకొని.

"అమ్మా నా పరిస్థితి నీకు తెలుసుకదా, నా అప్పులే ఇంకా తీరలేదు, నేనిప్పుడేమీ సర్దుబాటు చేయలేను, నీ తంటాలేవో నువ్వుపడు" అంటూ నిర్దయగా ఫోన్ పెట్టేశాడు ప్రవీణ్.

దీంతో బాధను దిగమింగు కుంటూ దిగులుగా పెద్ద కొడుక్కి ఫోన్‌చేసి "ప్రకాష్ ఒక రెండు వేలుంటే పంపరా, నా ఆరోగ్యం బాగాలేదు, మోకాళ్ళ నొప్పులు మరీ ఎక్కువయ్యాయి, వారం రోజులుగా జ్వరం తగ్గటంలేదు, డాక్టరుకీ, మందులకీ అవసరం... మళ్ళీ రెండునెలల్లో నీకు ఇచ్చేస్తాను" అంటూ ప్రాణంమీదకు రావటంతో ప్రాధేయ పడుతున్నట్టుగా అడిగింది పార్వతమ్మ.

"అమ్మా నీకస్సలు బుర్రలేదు, ఇద్దరాడపిల్లల్తో నేనెన్ని బాధలు పడుతున్నానో నీకు అర్థం కాదు, మొన్ననే పిల్లల స్కూలు ఫీజులు కట్టాను, యూనిఫారాలకీ, పుస్తకాలకీ బోలెడు ఖర్చయ్యింది. వేసవికాలం వేడి తట్టుకోలేక పాతికవేలుపెట్టి మొన్ననే ఏసీ పెట్టించాను. ఇంక నేను నీకు ఇప్పుడు డబ్బు ఎలా సర్దగలను, అడగటానికి అర్థపర్థం ఉండాలి, ఏదో నీ బాధ నువ్వు పడు" అంటూ యధావిధిగా ఫోన్ పెట్టేశాడు పెద్దకొడుకు ప్రకాష్.

పాపం పార్వతమ్మ కంటనీరు శివుడి శిరస్సు పైనుండి ఎగిరిపడే



గంగలా ఉబికివచ్చింది. పోనీ చుట్టుప్రక్కలవాళ్ళనడుగుదామంటే అభిమానం అడ్డొస్తుంది. ఒకప్పుడు తన చేత్తో అందరికీ పెట్టిందే కానీ, ఎవరిముందూ చేయిచాచి ఎరుగదు మరి. చేసేదేమీలేక, ఫస్టుతారీకు వరకు అలాగే బాధపడి పెన్షన్ అందాకగానీ ఆసుపత్రికి వెళ్ళలేకపోయింది.

రోజులు గడుస్తున్నాయి. ఒకప్రక్క అనారోగ్యం, మరోప్రక్క నాలుగు నెలలైనా తనెలావుందో కనీసం చూట్టానికూడా రాని కొడుకుల నిర్వాకం తల్చుకుని తల్లడిల్లే తల్లి మనసును ఓదార్చేవారెవరూ లేకపోవటంతో తనకు తానే సర్దిచెప్పుకుని సరిపెట్టుకున్నా, గతవైభవం గుర్తుకురావటంతో గుడ్లనిండా నీరు గంగాజలంలా మళ్ళీ ఉబికివచ్చింది పాపం పార్వతమ్మకు.

ఉన్నట్టుండి ఒకరోజు సాయంత్రం పార్వతమ్మకు కూతురు విజయ ఫోన్‌చేసి ''అమ్మా ప్రకాషన్నయ్యకు ఈరోజు ఉదయం యాక్సిడెంటయ్యిందంట, మోటార్‌సైకిల్‌మీద వెళ్తుంటే ఎదురుగా ఎవరోవచ్చి గుద్దేశారంట, దెబ్బలు బాగాతగిలాయంట, ముఖమంతా కొట్టుకుపోయి స్టీల్‌ప్లాంట్‌లోనే హాస్పిటల్‌లో ఉన్నాడంట'' అంటూ తల్లితో చెప్పి దు:ఖం ఆపుకోలేక ఏడ్చేసింది.

ఫోన్‌లో మాట్లాడుతుండగానే పార్వతమ్మకు ఆవేదన పొంగుకొచ్చింది. ఎంతైనా తల్లిమనసు కదా. తనయులు తప్పుచేసినా, తనపట్ల నిరాదరణ కనబరచినా తనెప్పుడూ వారి క్షేమమే కోరుతుంది. చాలా ఆందోళనపడిపోతున్న తనకు ఎంత అదుపుచేసుకున్నా ఏడుపాగలేదు.

అంతలోనే "నువ్వేమీ కంగారుపడకమ్మా.. నేనూ, మీ అల్లుడు రేపు వైజాగ్ వెళ్ళి అన్నయ్యను చూసి నీకన్ని విషయాలూ ఫోన్‌చేసి చెప్తాను. ధైర్యంగా ఉండు'' అంది విజయ.

"అదికాదే.. నేనూ వస్తాను, అన్నయ్యను చూడాలి. వాడికెలావుందో, తగిలిన దెబ్బలెంత బాధపెడుతున్నాయో'' అంటూ దు:ఖంతో మాట తడబడుతుండటంతో మళ్ళీ ఏడ్చేసింది పార్వతమ్మ.

''అమ్మా నీ మోకాళ్లనొప్పితో నువ్వసలే కదలలేవు. ఇప్పుడెలా ప్రయాణం చేస్తావు? ఇప్పుడొద్దులే నేను రేపు వెళ్ళి చూసొచ్చాక తరువాత నిన్ను తీసుకెళతాలే. నువ్వేమీ ఆందోళనపడకు'' అంటూ కన్నీళ్ళతోనే తల్లిని సముదాయించి ఫోన్ పెట్టేసింది విజయ.

* ****

**బా**గా దెబ్బలు తగిలాయేమో నొప్పులు బాధపెట్టకుండా ఇంజెక్షన్స్ ఇచ్చి ముఖానికీ, చేతులకీ కట్లుకట్టటంతో రాత్రంతా స్పృహలేనట్టుగా నిద్రపోయాడు ప్రకాష్. ఉదయమే విజయ భర్తతోపాటు హాస్పిటల్‌కు వచ్చి మంచంమీద అచేతనంగా పడివున్న అన్నయ్యను చూసి కన్నీళ్ళపర్యంతమైంది. అన్నయ్యను చూడగానే అక్కడ్నుంచే పార్వతమ్మకు ఫోన్‌చేసి "అమ్మా అన్నయ్యదగ్గరకొచ్చాను, దెబ్బలు బాగా తగిలాయి, ఆసుపత్రిలో డాక్టర్లు మంచిమందులే ఇస్తున్నారు, త్వరగానే కోలుకుంటాడు, నువ్వేమీ కంగారుపడకు'' అంటూ - తను భయపడుతున్నా, తల్లికిమాత్రం ధైర్యం చెప్పింది.

ఆరోజు సాయంత్రం వరకు ఆసుపత్రిలోనే ఉండి విజయ, వాళ్ళాయన స్టీల్‌ప్లాంట్‌లోనే వున్న ప్రకాష్‌వాళ్ళింటికొచ్చి పడుకున్నారు. రాత్రంతా అన్నయ్యకు జరిగిన యాక్సిడెంట్ గురించీ, తల్లి పడుతున్న ఆందోళన గురించీ ఆలోచించుకుంటూ నిద్రలేకుండానే గడిపింది విజయ.

మూడవరోజు తెల్లారింది. గత రెండు రోజులుగా ఇచ్చిన మందులు, ఇంజెక్షన్‌లు బాగా పనిచేయటంతో ప్రకాష్ బాగానే కోలుకున్నాడు. స్పృహలోకి వచ్చి చుట్టూ చూసి గమనించగలుగుతున్నాడు. మంచం మీద నుండి లేవటానికి కొంచెం ఓపిక రావటంతో నిదానంగా లేచి కూర్చున్నాడు.

రెండు రోజులుగా మగతగా వున్న ప్రకాష్ లేచి కూర్చోగానే, ప్రక్క మంచం మీద ఎవరో పడుకుని మూలుగుతూండటం గమనించి అటుగా తల తిప్పి చూశాడు. దుప్పటి కప్పుకొనివున్న ఆ మనిషి మూలుగు విన్న ప్రకాష్‌కు ఈ గొంతు ఎక్కడో విన్నట్టుగా వుందే అనిపించి అక్కడున్న నర్సును ఆతృతగా పిలిచి "ఈ ప్రక్క మంచం మీద ఉన్నది ఎవరు, ఏమయ్యింది, ఎందుకు మూలుగుతూ ఏడుస్తున్నారు'' అని అడిగాడు - తనలాగా ఏదైన యాక్సిడెంట్ కేసేమోననే అనుమానంతో.

''ఆ.. ఎవరో ముసలావిడ, వాళ్ళబ్బాయికెవరికో నిన్న యాక్సిడెంటయ్యిందట. అతను స్టీల్‌ప్లాంట్‌లోనే పనిచేస్తాడట. నిన్న సాయంత్రం వాళ్ళమ్మాయి ఫోన్‌చేసి చెప్పిందట. ఈరోజు తెల్లవారురుఝామున ఐదుగంటలకే పడుతూ లేస్తూ ఆసుపత్రికి వచ్చి "మా అబ్బాయికి యాక్సిడెంటయ్యింది, ఈ ఆసుపత్రిలోనే ఉన్నాడంట, అర్జెంటుగా చూడాలి'' అంటూ గట్టిగా ఏడుస్తూ, కుంటుకుంటూ, మెట్లెక్కబోయి జారిపడి స్పృహతప్పిపోయింది పాపం.. సరే తెల్లారాక వివరాలు కనుక్కోవచ్చులే అని మన స్టాఫే ఆవిడను స్ట్రెచర్‌పై తీసుకొచ్చి ఇంజెక్షన్స్ చేసి ఈ మంచం మీద పడుకోబెట్టారు, వాళ్ళ తాలూకు వాళ్ళెవరూ ఇంకా రాలేదు'' అంటూ ఏకబిగిన తన ధోరణిలో చెప్పుకుపోయింది నర్సమ్మ.

ప్రకాష్‌కు ఒక్కసారిగా గుండె జారిపోయినంత పనయ్యింది. ఒంట్లో ఓపికనంతా కూడదీసుకుని లేచి, మంచం దిగి ప్రక్క మంచం దగ్గరకెళ్ళి దుప్పటి తీసిచూసి తుళ్ళిపడ్డాడు. "నాయినా ప్రకాష్ నీకెలావుందిరా, దెబ్బలు బాగా తగిలాయంటగా, ఇప్పుడేమైనా నొప్పులు తగ్గాయా.. నిన్ను వెంటనే చూడాల్రా '' అంటూ కలవరిస్తూ మూలుగుతున్న తల్లి పార్వతమ్మను చూసి ఉలిక్కిపడ్డాడు. అంతే... కుళాయిధారలా కారుతున్న కన్నీళ్ళతో తన ప్రమేయం లేకుండానే ఆమె కాళ్ళపై పడిపోయాడు.

"అమ్మా నన్ను క్షమించు.. నిన్ను చూడటానికి నేను రాకపోయినా కదలలేని స్థితిలో కూడా కుంటుకుంటూ నన్ను చూట్టానికొచ్చావా, నీ విషయంలో ఇంకెప్పుడూ తప్పు చేయనమ్మా.. కొడుకుగా నా బాధ్యత మరిచి కర్కశంగా వ్యవహరించిన నన్ను క్షమించమ్మా...'' అంటూ పశ్చాత్తాపంతో బోరుమని విలపించాడు.

కొడుకు కన్నీళ్ళ వెచ్చదనం కాళ్ళను తాకటంతో కన్నపేగు కలుక్కుమని ఉలిక్కిపడి లేచిన పార్వతమ్మ మసకమసకగా కనిపిస్తున్న ప్రకాష్ ముఖాన్ని గుర్తుపట్టి దగ్గరకుతీసుకుని కన్నప్రేమనంతా కలబోసి వొళ్ళంతా తనివితీరా తడుముతూ "నాయనా ప్రకాష్, నీకెలా ఉందిరా బాగా దెబ్బలు తగిలాయంటగా.. ఇప్పుడేమైనా తగ్గాయా.. నొప్పులు కొంచెం తేలికపడ్డాయా..'' అంటూ బావురుమంది..

***- డా॥ వి. రాజేంద్రప్రసాద్,***
*రీజినల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,*



# గ్రామీణాభివృద్ధిపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించిన అపార్డ్

**గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులకు వారి వారి కర్తవ్యాలను తెలియజేసి, వారి ఉపాధి నైపుణ్యాలను పెంపొందించే ప్రక్రియలో భాగంగా సోషల్ ఆడిట్ సంస్థ, ఇ.జి.ఎమ్.ఎమ్., అపార్డ్ సంయుక్తంగా చేపట్టిన 3 వారాల సర్టిఫికెట్ కోర్సు 3వ బ్యాచ్ 2013 ఏప్రియల్ 8వ తేదీన ప్రారంభమైంది. ఈ శిక్షణా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాగ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రమణ్యం, ఐ.ఎ.ఎస్., విశిష్ట అతిథులుగా శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్, సోషల్ ఆడిట్ సంస్థ డైరెక్టర్ కుమారి సౌమ్య హాజరయ్యారు.**

ఈ సందర్భంగా శ్రీ ఆర్. సుబ్రమణ్యం మాట్లాడుతూ, సమాజంలో పతనమై పోతున్న విలువల్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జరిగే అక్రమాలను వెలికి తీసి ప్రజలకు చెందాల్సిన డబ్బును ఎటువంటి అరమరికలు లేకుండా ప్రజల వద్దకు చేర్చాలని ఆయన సూచించారు.

ప్రశ్నించే తత్వం అలవర్చుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ప్రశ్నించడం ద్వారా రాజ్యాంగ పరంగా, చట్టపరంగా ఉన్న హక్కులను ప్రజలు దక్కించుకో గల్గుతారని, అందుకు యువత గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు అభిమానించగలిగే ప్రవర్తనను సామాజిక తనిఖీలో పనిచేసి ప్రతి ఒక్కరూ అలవర్చుకుని ఆదర్శంగా నిలవాల న్నారు. సామాజిక తనిఖీలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఒక అత్యుత్తమైన స్థానంలో ఉందన్నారు.

అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్, మాట్లాడుతూ, ఈ దేశంలో ప్రతి సమస్యకి ఒక పరిష్కారం, ఒక ప్రణాళిక ఉన్నదని, అయినప్పటికీ, అభివృద్ధిలో ఇంకా వెనుకబడి ఉందన్నారు. దీనికి కారణం యువత ఇంకా మేల్కొనక పోవటమేనని ఆయన వ్యాఖ్యానించారు.

యువత పూనుకుంటేనే ఈ దేశం అభివృద్ధి పథం వైపు ముందుకు వెళ్తుందని శ్రీ చంద్రమౌళి తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చేసే బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందన్నారు. ఎవరికి వారు నిస్వార్థంగా సేవా తత్పరతతో పని చేయడమే కాక, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై నిఘా కూడా పెట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అపార్డ్ జాయింట్ డైరెక్టర్ డా॥ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ డా॥ ప్రసాద్, సెంటర్ హెడ్స్ శ్రీ కూర్మారావు, శ్రీ కుమార్ రాజా, ప్రొ॥ సూర్యనారాయణ రెడ్డి, శ్రీమతి ఉషారాణి, సోషల్ ఆడిట్ అధికారి శ్రీ మురళి పాల్గొన్నారు.





# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ద్వారా "పిల్లల మనుగడ, ఎదుగుదల"

**ఏ దేశ ప్రగతి అయినా ఆ దేశ పౌరుల శారీరక, మానసిక ధారుఢ్యం పైనే ఆధారపడి ఉంటుంది. ఇది జగమెరిగిన సత్యం. అందుకే,**

> ***"తిండి కలిగితె కండ కలుగును, కండకలవాడేను మనిషోయి!"***
> ***"యీసురో మని మనుజులుంటే, దేశమేగతి బాగుపడునోయ్!"***

అన్నారు గురజాడ వారు. అంత ప్రాముఖ్యత గల ధారుడ్యం "పిల్లల మనుగడ, ఎదుగుదల" పై ఎంతటి ప్రభావాన్ని చూపుతుందో వేరే చెప్పనక్కర్లేదు. పిల్లల మనుగడ, ఎదుగుదల అనేది తల్లి శారీరక, మానసిక స్థితిపై, ఆరోగ్యంపై కూడా ప్రత్యక్షంగా ఆదారపడి ఉంటుంది.

అందుకే ప్రభుత్వం తల్లి, పిల్లల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలను రూపొందించడమే కాక అనేక పథకాలను అమలుచేస్తోంది.

ఈ క్రమంలో తల్లీపిల్లలకు అనుబంధ పోషకాహార పంపిణీ, గ్రోత్ మానిటరింగ్, ప్రాథమిక పూర్వ విద్య, ఆరోగ్య తనిఖీలు, వ్యాధి నిరోధక టీకాలు, బాలికా సంరక్షణ, శిశు విహార్, శిశుగృహ, సబల ఇలా ఒకటేమిటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు పరుస్తూ పిల్లల మనుగడ, ఎదుగుదలను పెంపొందించేందుకు కృషి చేస్తోంది.

అయినా ఇప్పటికీ మన రాష్ట్రంలో ముఖ్యమైన పోషణ సంబంధిత సమస్యలు తమ ఉనికిని చాటుకుంటూనే వున్నాయి. అవి :

- పుట్టే పిల్లలలో 100 కి 30 మంది తక్కువ బరువుతో పుట్టడం
- ప్రతి వెయ్యి శిశు జననాలలో 46 మంది శిశువులు మరణించడం (వీటిలో 60 శాతం మరణాలు పోషకాహార లోపం వలన సంభవిస్తున్నాయి)
- 1 సంవత్సరం నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలలో ప్రతి 1000 మందికి 52 మంది మరణించడం
- ప్రతి లక్ష ప్రసవాలలో 134 మంది తల్లులు ప్రసవ సమయంలో మరణించడం
- 33.5 శాతం స్త్రీలు ఉండవలసిన బరువుకన్నా తక్కువ ఉండడం
- 5 సంవత్సరాలలోపు పిల్లల్లో 43 శాతం మంది తక్కువ బరువు కలిగి ఉండడం
- గర్భిణీలు, పాలిచ్చే తల్లుల్లో, ఇంకా ముఖ్యంగా యవ్వన దశలోని బాలికల్లో 59 శాతం రక్తహీనతతో బాధపడడం. అంటే ప్రభుత్వ పథకాలు ఆశించిన మేరకు ప్రజల చెంతకు చేరడం లేదు. అందుకే ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధులుగా పని చేసి అద్భుత ఫలితాలు సాధిస్తున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తే ఎలా ఉంటుందన్న అలోచన వచ్చింది. ఆ తలంపుతోనే యునిసెఫ్ సహాయ సహకారాలతో రూపుదిద్దుకున్న ప్రాజెక్టే **"పిల్లల మనుగడ, ఎదుగుదల".**

## పిల్లల మనుగడ అభివృదిలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

ఈ ప్రాజెక్టులో భాగంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామ స్థాయిలో పిల్లల మనుగడ, అభివృద్ధి, రక్షణ విషయంగా ప్రభుత్వ అధికారులను, ప్రతినిధులను కలుపుకొని పోతూ ఒక వార్షిక ప్రణాళికను అమలు పరచాలి. ఇందుకు గాను ఏప్రిల్ 12, 13, 2013 తేదీలలో గుర్తించిన కొంత మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, జిల్లా స్థాయి శిక్షణా మేనేజర్లు, విస్తరణ శిక్షణా కేంద్రాలలోని ఫాకల్టీ సభ్యులకు అపార్డ్ నందలి నీరు మరియు పారిశుద్ధ్య కేంద్రం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కమీషనర్ కె చంద్రమౌళిగారి అధ్వర్యంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు సంవత్సర కాలపు దిశానిర్దేశాన్ని రూపొందించడం జరిగింది. అవేమిటో వివరంగా తెలుసుకుందాం,

## భారత్ నిర్మాణ్ వాలంటర్ల ముందున్న లక్ష్యాలు

| 3 నెలల కాల వ్యవధి | 6 నెలల కాల వ్యవధి | సంవత్సరం కాల వ్యవధి |
|---|---|---|
| 1. అందరికీ వ్యాధి నిరోధక టీకాలు<br>2. ఆసుపత్రి ప్రసవాలు<br>3. మెడికల్ చెకప్<br>4. పిల్లలను బడిలో చేర్పించడం<br>5. చేతులు శుభ్రపరుచుకోనే విధానం<br>6. ఇంకుడు గుంతలు<br>7. నీటి సరఫరా విధానం పర్యవేక్షణ<br>8. పాఠశాల అంగన్‌వాడీలలో పారిశుద్ధ్యం<br>9. ఇంటింటికి మరుగుదొడ్డి<br>10. కిశోర బాలికలకు హైజీన్ ప్రాక్టిస్ | 1. మరో హెల్త్ చెకప్<br>2. పౌష్టికాహారం<br>3. పెరటి తోటల పెంపకం<br>4. గుట్కా, మత్తు పానీయాల నిషేధం<br>5. ప్లాస్టిక్ నిషేధం<br>6. పిల్లల అభివృద్ధి పట్టీక తయారీ<br>7. కటుంబ నియంత్రణ పద్ధతులు<br>8. అర్హులకు పెన్షన్‌లు<br>9. కార్మికులకు బీమా సదుపాయం | 1. శిశు మరణాలు, 5 సంవత్సరాలలోపు పిల్లల మరణాలు లేవు<br>2. మాతృ మరణాలు లేవు<br>3. నూటికి నూరు శాతం ఆసుపత్రి ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాలు<br>4. మంచి పోషకాహారాలు<br>5. బాల్య వివాహాలు లేవు<br>6. నూరు శాతం త్రాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు సాధన<br>7. పిల్లల ఎదుగుదల పట్టీక<br>8. మెడికల్ క్యాంపులు<br>9. అనాధ పిల్లలు, HIV/ఎయిడ్స్ పిల్లలకు షెల్టర్స్ |

**పై లక్ష్యాలను సాధించాలంటే భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామస్థాయిలో క్రింది కార్యక్రమాలను నిర్వహించవచ్చు:**

- గ్రామంలోని ప్రజలకు త్రాగునీరు సరఫరా జరిగే ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రతి 15 రోజులకు ఒక మారు శుభ్రం చేస్తున్నదీ లేనిది, నీరు ట్యాంక్‌లో నింపిన ప్రతిసారీ తగు మోతాదులో క్లోరినేషన్ చేస్తున్నదీ లేనిదీ గమనించడం.
- ఋతు పవనాలు ప్రారంభమైన వెంటనే నీటి నాణ్యత పరీక్షలను అక్కడి గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా జరిగేలా చూడడం.
- ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్డి వాడుకునేలా ప్రోత్సహించి, బహిరంగ మల విసర్జనా రహిత గ్రామంగా ఆవిర్భవించేటట్లు కృషి చేయడం.
- మల విసర్జన తదుపరి, భోజన తయారీ ప్రక్రియకి ముందు, భోజనానికి ముందు, చంటి బిడ్డలకు పాలిచ్చే ముందు సబ్బుతో చేతులు కడుగుకోనేలా ప్రోహిత్సహించడం ద్వారా సబ్బుతో చేతులు కడుగుకోవడం ఒక అలవాటుగా మార్చడం.
- ఇంటి నుండి వచ్చే మురుగు నీరు పారేందుకు సరైన డ్రైనేజి వ్యవస్థ లేని పక్షంలో ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకునేలా మార్గదర్శకత్వం వహించడం.
- అవకాశం ఉన్న ఇళ్ళలో వంటగది స్నానాల గది నుండి వచ్చేటువంటి వృథా నీటిని పెరటితోటకు మళ్ళించడం ద్వారా కురాగాయలు, ఆకుకూరలు, పండ్లు మొదలగునవి ఇంట్లోనే లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవడం.
- కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఋతుచక్ర నిర్వహణపై అవగాహనా సమావేశాలు ఏర్పాటు చేయడం.
- బడి ఈడు పిల్లలు (14 సంవత్సరాల వయస్సు వరకు) బడిలో వుండేలా పాఠశాల సిబ్బందికి సహాకరించడం. తద్వారా గ్రామస్థాయిలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడడం.
- గ్రామస్థాయిలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ముఖ్యంగా మహిళలలో అనీమియా (రక్త హీనత) లేకుండా జాగ్రత్త పడడం.
- పాఠశాలలను, అంగన్‌వాడి సెంటర్లను సందర్శించి అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను అంచనా వేసి గ్రామ స్థాయి అధికారులు,



## జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు



**జూ**న్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభమవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి కె. జానారెడ్డి చెప్పారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉంటాయన్నారు. ఆ తర్వాత పదిహేను రోజులకు మండల, జిల్లాపరిషత్ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను వారం రోజుల్లోపు పూర్తిచేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందిస్తామన్నారు. ఆ తర్వాత ఎన్నికల తేదీలోపు అదే నిర్ణయం తీసుకుంటుందని జానారెడ్డి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుంచి తాము ఓటర్ల జాబితా సవరణ, రిజర్వేషన్ల నిర్ధారణ కార్యక్రమాన్ని మొదలు పెట్టామన్నారు. వారంరోజుల్లోపు ఇది పూర్తవుతుందని వివరించారు. ఇప్పటికే ఎన్నికలు ఆలస్యమయ్యాయనీ...., దీని వల్ల అభివృద్ధి నిధులు కూడా ఆగిపోయాయన్నారు. వాయిదా వేయబోమని స్పష్టం చేశారు.

గ్రామ పెద్దలు, పాఠశాల పారిశుద్ధ్య కమిటీ దృష్టికి తీసుకువెళ్ళడం ద్వారా అవసరమగు చర్యలు చేపట్టి బడిలో పిల్లలందరు మరుగు దొడ్లు, మూత్రశాలలు ఉపయోగించుకోవడం, మరియు చేతులు శుభ్రపరచుకోవడం అలవరుచుకోనేలా చేయడం.

- గ్రామంలోని గర్భిణీ స్త్రీలందరికీ హెల్త్ చెకప్స్, అనుబంధ పోషకాహారం, ధనుర్వాతం రాకుండా టిటి ఇంజక్షన్‌లు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, హస్పిటల్‌లో ప్రసవాలు, ఒకరు లేదా ఇద్దరికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా? లేదా? అన్నవి తెలుసుకోవడం, అవసరమైతే తగు సూచనలను, సలహాలను, సహాయాన్ని అందించడం.
- జన్మించిన ప్రతి శిశువుకు ఆరు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించే దిశగా వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నదీ, లేనిదీ పరిశీలించడం.
- గ్రామంలో బాల్య వివాహాలు జరపకుండా అవసరమైతే ఆడ పిల్లల తల్లిదండ్రులతో, గ్రామ పెద్దలతో, గ్రామసమాఖ్య సభ్యులతో చర్చించడం, తద్వారా బాల్య వివాహాలను నిరోధించడం.
- చిన్న పిల్లలపై వారి తల్లిదండ్రులు గానీ, సంరక్షకులు గానీ, ఉపాధ్యాయులు గానీ, ఇతరులు గానీ మానసికంగా లేదా శారీరకంగా గానీ హింసించడం లేదా బాధించడం వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం.
- పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి పిల్ల లేదా పిల్లవాడినీ (5 సంవత్సరాలలోపు) అంగన్‌వాడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా పొడవు, బరువులను కొలచి వాటిని గ్రోత్ మానిటరింగ్ ఛార్ట్ రూపకల్పనలో అంగన్ వాడీ కార్యకర్తకు సహాయపడడం, తద్వారా పిల్లల అభివృదికి దోహదపడడం.
- గ్రామంలో గుట్కా, పాన్‌పరాగ్, ఇతర మత్తు పదార్ధాల విక్రయం, వినియోగాలను నిషేధించేలా కృషి చేయడం.
- గ్రామంలో అర్హులై వుండి ప్రభుత్వం నుండి పెన్షన్ అందని వితంతువులు, వృద్ధ మహిళలు, వికలాంగులకు తగు చేయూతనిచ్చి ప్రభుత్వం నుండి పెన్షన్ సమకూరేలా చేయడం.
- గ్రామంలోని చెత్తా చెదారాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఇంటింటా ఎరువు గుంతలను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం, వంటి చర్యలు చేపట్టడం.
- భవన నిర్మాణ రంగంలో, ఇతర కూలీ పనులలో పని చేస్తున్న కార్మికులకు భీమా సదుపాయం అమలులోకి వచ్చేలా ప్రయత్నించి, వారందరినీ ఇన్సూరెన్సు కవరేజ్‌లోనికి తీసుకు రావడం.
- గ్రామంలోని అనాధ పిల్లలు, హెచ్.ఐ.వి./ఎయిడ్స్ బారిన పడిన పిల్లలకు తగు వసతిని (షెల్టర్) సమకూర్చడంలో సహాయ పడడం.



పై కార్యక్రమాల అమలు ద్వారా సంవత్సరం గడిచేటప్పటికి అంటే రాబోయే ఉగాది నాటికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అకుంఠిత దీక్ష, పట్టుదల, కార్య సాధనల ఫలితంగా వారి వారి గ్రామలలో, నవ భారత నిర్మాణానికై పనిచేస్తున్న ప్రతి భారత్ నిర్మాణ్ వాలంటీర్‌కు కావాలి ఇదే లక్ష్యం.

**- శ్రీమతి పిన్నింటి మాధురి, ఫ్యాకల్టీ, అపార్డ్**

నైపుణ్యత అవసరంలేని కూలిపని చేయడానికి ముందుకు వచ్చే ప్రతి కుటుంబంలోని వయోజనులకి వంద రోజులకు తక్కువ కాకుండా ఒక ఆర్థిక సంవత్సరంలో వేతన ఉపాధి కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో అమలు కాబడుతున్న చట్టమే 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 2005'. జాతీయగ్రామీణ ఉపాధిహామీ చట్టం ఆగస్టు 23, 2005న పార్లమెంట్ ఆమోదం పొందింది.



# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 2005 - కూలీల హక్కులు

## కూలీల హక్కులు

- గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నటువంటి గ్రామీణ ప్రజలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం, 2005 ద్వారా కొన్ని హక్కులు కల్పించబడినాయి.
- నైపుణ్యత అవసరంలేని కూలిపని చేయటానికి ముందుకు వచ్చే ప్రతి ఒక్కరూ తమ పేరును గ్రామపంచాయితీలో నమోదు చేయించుకుని 'జాబ్‌కార్డు' ను పొందే హక్కు.
- గ్రామ పంచాయితీలో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ 'పనిని కోరే హక్కు'.
- పని కోరిన ప్రతి కుటుంబానికి 100 రోజులకు తక్కువ కాకుండా కూలిపని తప్పని సరిగా కల్పిస్తారు.
- పనికొరకు ధరఖాస్తు చేసుకున్న 15 రోజులలో కుటుంబ పరిమితికి లోబడి కోరుకున్నన్ని పనిదినాలు కల్పిస్తారు. పని కల్పించని పక్షంతో కూలీలకు రోజువారీ నిరుద్యోగ భృతిని చెల్లించాలి. దాని ద్వారా కూలీలకు 'నిరుద్యోగ భృతి కోరే హక్కు' కల్పించబడినది.
- నిరుద్యోగ భృతిని మొదటి 30 రోజులకుగాను కనీస కూలీ రేటులో 25 శాతం, మిగిలిన రోజులకు 50 శాతం చొప్పున చెల్లించాలి.
- చేసిన పనికి సంబంధించిన కూలీని పనిచేసిన 15 రోజులలోపు చెల్లించాలి. లేనిచో ఆలస్యపు చెల్లింపులను చేసినందులకు కూలీలకు వారి వేతనంతో పాటు అదనంగా నష్టపరిహారం (Delay Compensation) చెల్లించాలి. దీని ద్వారా కూలీలకు 'పనిచేసిన 15 రోజులలోపు వేతనం పొందే హక్కు' నష్టపరిహారం (Delay Compensation) పొందే హక్కు' కల్పించబడినది.
- దరఖాస్తు చేసుకున్న సమయంలో ఉంటున్న ప్రదేశానికి 5 కిలోమీటర్ల పరిధిలో పని కల్పించాలి. అలా కాని పక్షంలో రవాణా, ఇతర ఖర్చుల క్రింద కూలీ మొత్తంలో 10 శాతం అదనంగా చెల్లించాలి.
- పని వద్ద కనీస సౌకర్యాలు పొందే హక్కు. పని ప్రదేశంలో త్రాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు, పిల్లల్ని చూసుకొనుటకు ఆయాని నియమించడం, నీడను కల్పించాలి.
- సమానవేతన చట్టం 1976 ప్రకారం. స్త్రీ - పురుషులు సమాన వేతనం పొందే హక్కును కల్పించడం జరిగినది.
- పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగి శాశ్వత వైకల్యం, మరణం సంభవిస్తే నష్టపరిహారం పొందే హక్కు.

పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే నష్టపరిహారం రూ. 50,000, తీవ్ర అంగవైకల్యం సంభవిస్తే 25,000 రూపాయలు చెల్లిస్తారు. అదే విధంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించాల్సి వస్తే ఆసుపత్రి ఖర్చు, వైద్యం, మందుల ఖర్చుతో పాటు కూలీరేటులో 50% తగ్గకుండా ఆసుపత్రిలో ఉన్నన్ని రోజులు వేతనాన్ని పొందే హక్కును కూడా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 ద్వారా కూలీలకు కల్పించబడినది.

**- బి. లావణ్య, సిఎన్ఆర్ఎమ్, అపార్డ్**

# ఆదర్శ గ్రామ నిర్మాతలుగా మారుతున్న లంబాడిపల్లె, మాణిక్యాపూర్ బిఎన్‌విలు

**కరీంనగర్ జిల్లా కేంద్రానికి 58 కి॥మీ, మల్యాల మండల కేంద్రానికి 6 కి॥మీ దూరంలో ఉన్న లంబాడి పల్లె ఎటువంటి అభివృద్ధికి నోచుకోని, వెనుకబడిన గ్రామం. గ్రామం నుండి డిఐఇటిలో ఉపన్యాసకులుగా పని చేస్తున్న శ్రీ మొండయ్య సొంత ఊరిపై మమకారంతో ఆ గ్రామంలో చదువుకుంటున్న, చదువు ఆపిన యువకులను సమీకరించి, యువజన సంఘంగా ఏర్పరిచారు. ఊరికి అవసరమైన మంచి పనులను, 'మనకు మనమే చేసుకుందాం' అనే దృఢ సంకల్పంతో ఎన్ఎస్ఎస్ వారి ద్వారా సేవా కార్యక్రమాలతో ప్రారంభించారు.**

**'స్థానికపాలన' పత్రికలో బిఎన్‌విల సేవల గురించి చదివిన గ్రామ యువకులు 40 మంది 'భారత్ నిర్మాణ్ వాలంటీర్లు' గా నమోదు అయి, ఆ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా మార్చుకునేందుకు ఈ క్రింది కార్యక్రమాలు చేపట్టి విజయం సాధించారు.**








- త్రాగునీరు, పారిశుధ్యంపై ఏఎమ్ఆర్ అపార్డ్‌లో శిక్షణ పొందిన బిఎన్‌విలతో ప్రతి వాడలో ట్రిగ్గరింగ్ సమావేశాలు నిర్వహించి, 80% ఐఎస్ఎల్ నిర్మాణాలు సాధించారు. 2 నెలలలోపు 100% ప్రణాళిక ప్రకారం పూర్తి చేయడానికి బిఎన్‌విలు ప్రత్యేక పద్ధతిలో 'మరుగు దొడ్డి కట్టుకో మల్లన్న' పేరుతో జానపద పాటలు, 'సారా మానుదాం' వీడియో చిత్రీకరణ, డప్పుల చప్పుళ్లతో ఇంటి, ఇంటికి బొట్లతో తిరుగుతూ, వ్యక్తిగత, సామాజిక పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
- ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, పారిశుధ్యం, జెండర్, త్రాగునీరు, ఉద్యోగ అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, స్థానిక వనరుల గరిష్ఠ వినియోగం, ప్రభుత్వ పథకాల పటిష్ట అమలుపై జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్, డిఆర్‌డిఎ, వివిధ లైన్ డిపార్ట్‌మెంట్‌ల గ్రామస్థాయి సిబ్బందితో 'ప్రజాదర్బార్' లను ప్రతి వాడలో నిర్వహించటం జరిగింది.
- గ్రామంలోని 'యువత' పెడదారులు పట్టకుండా, చెడు అలవాట్లు మానే విధంగా బిఎన్‌విలు ఒక ఓపెన్ లైబ్రరీని పాఠశాలలో ప్రారంభించటంతో, పలు వార, దిన పత్రికలు, ఉద్యోగ అవకాశాలు గల పత్రికలను చదువుకుంటున్నారు. నోడల్ బి.ఎన్.వి.లు అయిన పెద్ది తిరుపతి, మహేష్, మిత్కారి, అంజయ్యలు గ్రామంలో 100 మంది పాఠకులను కూడగట్టి ఒక్కొక్కరు రూ. 50 జమ చేసి జిల్లా గ్రంథాలయ సంస్థ వారిని కలసి, 'పుస్తక నిక్షిప్త కేంద్రం' (Book Deposit Center) ఏర్పాటుకు గ్రామ ప్రత్యేక అధికారి, కార్యదర్శి నుంచి అనుమతి లేఖ సమర్పించారు.
- 3 ఎకరాల ప్రభుత్వ భూమిని బిఎన్‌విల శ్రమదానంతో చదును చేసుకొని, చుట్టూ పోల్స్‌తో కంచె ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, ఆటలు ఆడటం, పోలీస్, ఆర్మీ ఉద్యోగాలకు, అవసరమైన శారీరక వ్యాయామాలు చేస్తున్నారు.

యువత మద్యం, గుట్కా, పాన్ మసాలా మొదలైన చెడు అలవాట్లతో, సంస్కారం లేకుండా తయారవుతున్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం చేసేవారు లేకపోవటం, గ్రామాలలో పూర్వంలాగా పాఠశాలల్లో ఆటలు, పాటలు లేకపోవటం వంటి కారణాల వల్ల యువత





పెడదారులు పడుతున్నారని శ్రీరాం వాపోయారు. అందుకే తమ గ్రామంలో చదువుకుంటూనే గ్రామ (సమాజ) సేవలో పాల్గొనేలా లక్ష్యం పెట్టుకుని అందరి కర్తవ్యంగా భావించి మార్పుకు ప్రయత్నిస్తున్నామని ఆయన బివిఎన్‌విల సమావేశంలో పేర్కొన్నారు.

★ స్వచ్ఛంద విరాళం (శ్రీమాత ద్వారా)తో బివిఎన్‌విల శ్రమదానంతో ఉన్నత ప్రాథమిక పాఠశాలలో బడి పిల్లలకు త్రాగునీరు, మరుగుదొడ్ల మరమ్మత్తులు చేపట్టారు. పాఠశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కృషితో, డిఐఇటి బోధకుల సహాయంతో బడికి వచ్చే పిల్లల దాహార్తి తీర్చటం హర్షించదగిన విషయం.

★ మహనీయులైన గాంధీ, వివేకానంద, బి.ఆర్. అంబేద్కర్, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ వంటి వారి జయంతి, వర్ధంతి సభలకు ముందు పిల్లలకు వారు చేసిన సేవలు వివరించటం, వారిపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించటం, గ్రామంలో ప్రత్యేక ప్రతిభ కనపర్చిన పిల్లలకు బహుమతులు అందజేయటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

★ గ్రామ ప్రజల భాగస్వామ్యంతో, బివిఎన్‌విల చొరవతో రోడ్డు నిర్మాణం, వరద నీరు పోవడానికి పైపులు వేసుకుని గ్రామ ప్రగతికి బాటలు వేస్తున్నారు. అధికారులు తొంగిచూడక పోయినా, సహాయం కోరినా చేయని పరిస్థితుల నుండి బయటపడి 'మన ఊరిని మనమే ఉద్ధరించుకుందాం' అనుకొని, అందరూ కలసి ముందడుగు వేస్తున్నారు. యధార్ధ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా, గ్రామంలోని అన్ని వనరులను సద్వినియోగం చేసుకునేలా 'సమగ్ర గ్రామాభివృద్ధి' ప్రణాళికను అంకిత భావంతో, ఐక్యమత్యంగా అమలు చేస్తూ చుట్టు పక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

## మహిళా సంఘాల సమన్వయంతో మద్యనిషేధం

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 70 కి॥మీ. దూరంలో గల భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్ ఒక మారుమూల గ్రామం. ఒకప్పుడు నక్సలిజంతో భూమి, భుక్తి, విముక్తి ఉద్యమాలు నడిపిన గ్రామం.

గ్రామంలో తీవ్రమైన త్రాగునీటి సమస్యతో సతమతమవుతున్న ప్రజలు, వాడ వాడకు అమ్ముతున్న సారాయి, గుడుంబా, మద్యం, బెల్టుషాపులు, గుట్కా, అంబర్ పొగాకు ఉత్పత్తుల వస్తువులను వాడుతూ ఆరోగ్యం పాడు చేసుకుంటున్న పురుషులు, ఆర్థికంగా తాము నష్టపోతూ, స్త్రీలకు కష్టనష్టాలు కల్గిస్తూ కూలీడబ్బు, పొదుపు డబ్బులు ఖర్చు చేస్తూ, వారిని తిట్టటం, కొట్టటం వంటివి చేస్తుండటంతో పసి పిల్లల లేత మనస్సులపై తీవ్ర ప్రభావం చూపుతున్న పరిస్థితులపై ప్రతి స్పందించిన వొగ్గె శేఖర్ అనే యువకుడు గ్రామంలో నలుగురిని కూడగట్టి 35 మందిని 'భారత్ నిర్మాణ్ వాలంటీర్స్'గా నమోదు చేయించారు.



ఒక సమావేశం నిర్వహించి ప్రజల సమక్షంలో సమాలోచన చేసి గ్రామాన్ని మద్య రహిత గ్రామంగా, 'మాణిక్యం' లా మార్చేందుకు శ్రీకారం చుట్టిన శేఖర్ బివిఎన్‌విల సహకారంతో పలు కార్యక్రమాలు చేపట్టారు.

★ మాణిక్యాపూర్ గ్రామంలో బివిఎన్‌విలు మొదటగా పాఠశాల విద్యార్థులకు పలు సామాజిక సమస్యలు, నివారణా మార్గాలు, వ్యక్తిగత పారిశుద్ధ్యం, ఐఎస్ఎల్ వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

★ గ్రంథాలయ వారోత్సవాలలో బడి పిల్లలకు వ్యాసరచన, ఉపన్యాసం, పాటలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

★ ఎస్ఎస్‌సిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు పంపిణీ చేశారు.

★ యువతకు పఠనాసక్తి పెంపుదలకై ఇ. బిక్షపతి (బివిఎన్‌వి) బాధ్యులుగా 'పుస్తక నిక్షిప్త కేంద్రం' నడుపుతూ పలు దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచార పంపిణీ చేస్తున్నారు.

★ ప్రతి నెల జరిగే 'మార్పు' కార్యక్రమంలో మహిళల ద్వారా అంతరాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి వారి సేవలు పొందడానికి కృషి చేస్తున్నారు.






★ ఆడపిల్లలు బాల్యంలో, యవ్వనంలో ఎదుర్కొనే సమస్యలపై, మధ్య వయస్సు, మహిళలు, వృద్ధాప్యంలో ఎదుర్కొనే పలు సమస్యలు, నివారణ మార్గాలపై సంబంధిత ఎఎన్ఎం, సామాజిక చర్యల కమిటీలు, నిర్భయ కమిటీలు, పాఠశాల కమిటీలతో, అధికారులతో మహిళా బివిఎన్‌విలు చర్చిస్తున్నారు.

★ మద్య నిషేధం, పొగాకు ఉత్పత్తులను గ్రామంలో నిషేధించటంపై పలు ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలను మహిళా సంఘాలతో సమన్వయంగా, సిడిఎఫ్ వారి సహకారంతో, ఎక్సైజ్ సి.ఐ శిరీష సహకారంతో చేపడుతూ, గ్రామంలో 'పాడు సారాయి వద్దు-పాడిపంటలు ముద్దు' అంటూ విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

నేటి యువత అన్ని గ్రామాలలో ఇదే విధంగా తమ చదువులు కొనసాగిస్తూ, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే, తమ విశ్రాంతి సమయాన్ని సమాజ సేవకు (గ్రామాల సేవకు) కేటాయించి, ఆదర్శ గ్రామాలుగా మారేందుకు, నవ భారత నిర్మాణానికి కృషి చేయాలని, భారత్ నిర్మాణ్ వాలంటీర్స్ కృషితో రాష్ట్రంలోని అన్ని గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా మారాలని ఆశిద్దాం.

*- కోట సురేందర్ (డిటిఎమ్),*
*జిల్లా ప్రజాపరిషత్, కరీంనగర్ జిల్లా*




వేసవి చలివేంద్రం ప్రారంభించిన తూర్పుగోదావరి జిల్లా అంబాజి పేట మండలం ముక్కామల గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.




ది. 10-04-2013న దూరదర్శన్ ద్వారా అపార్డ్ ప్రచారం చేసిన గ్రామవికాసం కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం జిల్లా పొంగలిపాక గ్రామ బి.ఎన్.వి. శ్రీ సత్యనారయణ, అపార్డ్ కన్సల్టెంట్ శ్రీ జి. జయపాలరెడ్డి, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్., దూరదర్శన్ యాంకర్ శ్రీమతి సుజాత.

సి. వెంకటేష్ అనే వికలాంగ బాలుడికి దాతలు సహకారంతో వీల్‌చైర్ పంపిణీ చేసిన ఖమ్మం జిల్లా ముత్తగూడెం గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు




# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల




నగదుబదిలీ పథకం పై పూర్తి వివరాలను కరపత్రం ద్వారా ప్రజలకు అవగాహన కల్గిస్తున్న రంగారెడ్డి జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



పేరుకుపోయిన డ్రైనేజి పూడికను తీస్తున్న పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రు మండలం చిననిండ్రుకొలను గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

ది. 17-04-2013న దూరదర్శన్ ద్వారా అపార్డ్ ప్రచారం చేసిన గ్రామవికాసం కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా రామచంద్రాపూర్ గ్రామ బి.ఎన్.వి. శ్రీ భానుప్రకాశ్ అపార్డ్ కన్సల్టెంట్ శ్రీ జి. జయపాలరెడ్డి, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్., దూరదర్శన్ యాంకర్ శ్రీమతి సుజాత.





ఉచిత వైద్యశిభిరం ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న నల్గొండ జిల్లా సూర్యాపేట మండలం తాళ్ళఖమ్మం పహెడ్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



స్కూలు పిల్లలకు చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్గిస్తున్న మెదక్ జిల్లా కోల్చారం మండలం యెనగండ్ల గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



మహబూబ్‌నగర్ జిల్లాలో చిన్నారి శ్రేయ దారుణ హత్యకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

# అపూర్వ విజయాలు



విశాఖపట్నం జిల్లా పాడేరు మండలం కిండంగి గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి బి.ఎన్.వి.లను అడిగి తెలుసుకుటుంన్న సి.ఇ.ఓ. శ్రీ వెంకటరెడ్డి.




ది. 27-03-2013న దూరదర్శన్ ద్వారా అపార్డ్ ప్రచారం చేసిన గ్రామవికాసంకార్యక్రమంలోపాల్గొన్న చిత్తూరుజిల్లాకోటాలగ్రామబి.ఎన్.వి. శ్రీమతి సుధ, అపార్డ్ డిప్యూటి డైరెక్టర్ డా॥ వి.ఎస్.ఎస్ ప్రసాద్, సెంటర్ హెడ్ శ్రీ కూర్మారావు దూరదర్శన్ యాంకర్ శ్రీమతి సుజాత.




మద్యం అమ్మకాలు, పోగాకు ఉత్పత్తులను నిలిపి వేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న కరీంనగర్‌జిల్లా భీమదేవరపల్లి మండలం, మాణిక్యపూర్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



# తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించటం ఎలా ?

**వరిని సాగు చేసే విషయంలో పలు విషయాల్లో తగిన సూచనలు పాటించినట్లయితే ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చుని రాష్ట్ర వ్యవసాయ శాఖ తెలియజేసింది. ఏ సమయంలో పొలం దున్నాలి, ఏ విత్తనాలు వాడాలి, విత్తనాల శుద్ధి ఎలా చేయాలి, వాడవలసిన పురుగు మందులు, ఎరువులు, మోతాదు, తదితర అంశాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతులకు పలు సూచనలు చేసింది. అవేమిటంటే-**

- **వేసవిలో దుక్కులు :** వేసవిలో దుక్కులు దున్నటం వలన భూమిలో నిద్రావస్థలో ఉన్న పురుగులు, సూక్ష్మజీవులు ఎండ తీవ్రతకు నశించి పురుగులు, తెగుళ్ళ ఉధృతి తగ్గి పురుగులు, తెగుళ్ళకు అయ్యే ఖర్చు తగ్గుతుంది.
- **రైతులు స్వంత విత్తనాలు** వాడుకొంటే, 40 శాతం ఖర్చు తగ్గించుకొనవచ్చు.
- **విత్తన శుద్ధి :** విత్తనం ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు కార్బండిజమ్/సుడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేసినట్లయితే నారుమడిలో వచ్చే తెగుళ్ళపై పెట్టే ఖర్చు తగ్గించుకొనవచ్చు.
- నారుతీసే 8 రోజుల ముందు కార్బోప్యూరాన్ 3-జి గుళికలు వేసుకొన్నట్లైతే నాటిన తరవాత వచ్చే కాండం తొలుచు పురుగు నివారించుకొనవచ్చు. తద్వారా ఖర్చు తగ్గించుకొనవచ్చు.
- జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట పైరులు/ పశువుల ఎరువులు వేయటం వలన భూమి ఆరోగ్యం పెరిగి, రసాయన ఎరువులపై ఖర్చు తగ్గించుకొనవచ్చు. సేంద్రియ ఎరువులు వాడటంవల్ల పైరులకు పురుగులు, తెగుళ్ళు తట్టుకొనే శక్తి వచ్చి దిగుబడులు పెరుగుతాయి.
- ఫాస్ఫేట్ సాల్యూబుల్ బాక్టీరియా వాడటం వలన భూమిలో లభ్యం కాని స్థితిలో ఉన్న భాస్వరం పైరుకు లభ్యం అవుతుంది.
- భూసార పరీక్షలను బట్టి ఎరువులు వాడినట్లయితే ఎరువులు సమతుల్యంగా వినియోగమవుతాయి.
- నాట్లు వేసేముందు మొక్కల చిగుళ్ళను త్రెంచి, మొక్కలను

క్లోరోపైరి ఫాస్ ద్రావణంలో ముంచి నాటినట్లయితే, కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, ఆకుముడత పురుగుల నివారణకు పెట్టే ఖర్చు తగ్గించుకొనవచ్చు.

- వరి పైరులో బాటలు తీయటం వలన ఎరువులు, పురుగు మందులు చల్లుకొనుటకు వీలుగా ఉండటమే కాక, పైరుకు గాలి, వెలుతురు తగిలి, పిలకలు ఎక్కువగా తొడిగి పైరు ఏపుగా పెరుగుతుంది. అంతేకాక, ఎలుకల బెడద, దోమ పోటు వ్యాప్తి తగ్గి ఖర్చు తగ్గుతుంది.
- వేప సంబంధిత పదార్థాలు వాడటం వలన మిత్రపురుగులను సంరక్షించటమే గాక, వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.
- కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యాంత్రీకరణ ద్వారా ఖర్చు తగ్గించుకొనవచ్చు.
- డ్రమ్ సీడ్, నేరుగా వెదజల్లుట వలన నారు పోసి, పెంచి, నాట్లువేసే ప్రక్రియలో ఖర్చు తగ్గించుకొనవచ్చు.
- 'శ్రీ' పద్ధతి, వరి నాటు యంత్రం వాడి విత్తనం, నారుమడి మరియు నాట్లు వేసే ఖర్చును 50 శాతం తగ్గించు కొనవచ్చు.
- కలుపు మందులు వాడటం వలన కూలీలతో కలుపు తీసే ఖర్చును తగ్గించుకొనవచ్చు.

### నాసిరకం మందుల అమ్మకంపై నిషేధం

రాష్ట్రంలో వినియోగంలో ఉన్న క్రిమి సంహారక మందులు, పురుగు మందులను పరీక్ష చేయించిన వ్యవసాయ శాఖ నాసిరకంగా ఉన్న మందులను గుర్తించి, వాటి అమ్మకాలను నిషేధించింది. రైతులు ఈ విషయాలను గమనించాలని శాఖ కోరుతోంది.

మెసర్స్ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి P11020201 బ్యాచ్ నెం. గల అసిఫేట్ 75 శాతం యస్.పి (ట్రేడ్ నేమ్ - ఏస్ 75 యస్.పి) (Acephate 75% SP) (Batch No.P11020201) (Trade Name - Ace 75 SP) క్రిమి సంహారక పురుగు మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, రాజేంద్రనగర్ నందు నాసిరకం (Misbrand) గా నమోదు అయింది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్‌కు చెందిన అసిఫేట్ 75 శాతం యస్.పి (ట్రేడ్ నేమ్ - ఏస్ 75 యస్.పి) (Acephate 75% Sp) (Batch No.P111020201) (Trade Name - Ace 75 SP) క్రిమి సంహారక పురుగు మందు నిల్వచేయటాన్ని, అమ్మటాన్ని నిషేధించడమైనది. రైతులు ఈ విషయం గమనించవలసినదిగా వ్యవసాయశాఖ కోరింది.



మెసర్స్ సబెరో ఆర్గానిక్ గుజరాత్ లిమిటెడ్ వారి OSD1008020 బ్యాచ్ నెం. గల క్లోరిపైరిఫాస్ 20 శాతం ఎస్ సి (ట్రేడ్ నేమ్ - రుబస్ట్) (Chlorpyriphos 20% EC) (Batch No. OSD 1008020) (Trade Name - ROBUST) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, విశాఖపట్నం నందు నాసిరకము (Misbrand) గా నమోదు అయింది.

## గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే యువత పూనుకోవాలి



"దేశాన్ని ఒక మంచి దేశంగా, గ్రామాన్ని ఒక మంచి శుభ్రమైన గ్రామంగా, మన చుట్టు ప్రక్కలవున్న వాతావరణాన్ని ఒక మంచి ఆదర్శవంతమైన ప్రదేశంగా తీర్చి దిద్దవలసిన బాధ్యత భారత్ నిర్మాణ్ వాలంటీర్లపై ఉందన్నారు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డొక్క మాణిక్య వరప్రసాద్‌రావు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రభుత్వంలో అమలవుతున్న అనేక ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామాల్లో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని గమనించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు యొక్క ప్రతిఫలాలు నిరుపేదలకు అందేలా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చొరవ తీసుకువాలన్నారు. కేంధ్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి పథకంలో జరిగే అవకతవకలను అడ్డుకుని ప్రశ్నించాలన్నారు. దీనికోసం గ్రామాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్ కు చెందిన (Chlorphyriphos 20% EC) (Batch No.OSD1008020) (Trade Name - ROBUST) క్రిమి సంహారక మందు నిల్వచేయటం, అమ్మటం నిషేధించడమైనది.

మెసర్స్ జై శ్రీ రసాయన్ ఉద్యోగ లిమిటెడ్ వారి NMOR-691 బ్యాచ్ నెం. గల మోనో్క్రోటోఫాస్ 36 శాతం ఎస్ ఎల్ (ట్రేడ్ నేమ్ - ఫైటోఫాస్) (Monocrotophos 36% SL) (Batch No.NMOR-691) (Trade Name - NOMORUS) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, విశాఖపట్నం నందు నాసిరకము (Misbrand) గా నమోదు అయింది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్ కు చెందిన (Monocrotophots 36% SL) (Batch No. 691) (Trade Name - MONOROUS) క్రిమి సంహారక మందు నిల్వచేయటం, అమ్మటం నిషేధించడమైనది.

మెసర్స్ యునైటెడ్ ఫాస్పారస్ లిమిటెడ్ వారి IH3PKL3613 బ్యాచ్ నెం. గల మోనో్క్రోటోఫాస్ 36శాతం ఎస్ ఎల్ (ట్రేడ్ నేమ్ - ఫైటోఫాస్) (Monocrotophos 36% SL) (Batch No- IH3PKL3613) (Trade Name - PHOSKILL) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, విశాఖపట్నం నందు నాసిరకము (Misbrand) గా నమోదు అయింది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్ కు చెందిన (Monocrotophots 36% SL) (Batch No. IH33613) (Trade Name - PHOSKILL) క్రిమి సంహారక మందు నిల్వచేయటం, అమ్మటం నిషేధించడమైనది.

మెసర్స్ ఫైటో కెమ్ ఇండియా లిమిటెడ్ వారి 15 బ్యాచ్ నెం. గల మోనో్క్రోటోఫాస్ 36 శాతం ఎస్ ఎల్ (ట్రేడ్ నేమ్ - ఫైటోఫాస్) (Monocrotophos 36% SL) (Batch No.15) (Trade Name - PHOYTOFOS) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా






కేంద్రం, విశాఖపట్నం నందు నాసిరకము (Misbrand) గా నమోదు అయింది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్ కు చెందిన (Monocrotophots 36% SL) (Batch No.15) (Trade Name - PHOYTOFOS) క్రిమి సంహారక మందు నిల్వచేయటం, అమ్మటం నిషేధించడమైనది. రైతులు ఈ అంశాలను గమనించవలసిందిగా వ్యవసాయ శాఖ కోరుతోంది.

మెసర్స్ ఘరడ కెమికల్స్ లిమిటెడ్ వారి GOV064CAX బ్యాచ్ నెం, గల డెల్టమెత్రిన్ 1 శాతం + ట్రైజోఫాస్ 35 శాతం ఇ.సి. (ట్రేడ్ నేమ్ - షికారి) (Deltamethrin 1%+ Triazophos 35% EC) (Batch No.GOV064CAX) (Trade Name - SHIKARI) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, రాజేంద్రనగర్ నందు నాసిరకము (Misbrand) గా నమేదు కాబడినది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచ్ కు చెందిన (Deltamethri 1%+Triazophos 35% EC) (Batch No. GOV064CAX) (Trade Name- SHIKARI) క్రిమి సంహారక మందు నిల్వచేయుట మరియు అమ్ముట నిషేధించడమైనది. రైతులు ఈ విషయము గమనించవలసినదిగా కోరడమైనది.

టి. స్టేన్స్ & కంపెని లిమిటెడ్ వారి 33 బ్యాచ్ నెం. గల అజరిడైరెక్టిన్ 1 శాతం ఇ.సి. (ట్రేడ్ నేమ్- నింబిసైడిన: ప్లస్) (Azadirachtin 1% EC) (Batch No. 33) (Trade Name- Nimbecidine Plus) క్రిమి సంహారక మందు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, గుంటూరు నందు నాసికరకము (Misbrand) గా నమోదు కాబడినది. అందువలన పైన పేర్కొనబడిన బ్యాచునకు చెందిన (ట్రేడ్ నేమ్- నింబిసైడిన్ ప్లస్) (Azadirachtin 1% EC) (Batch No.33) (Trade Name Nimbecidine Plus) క్రిమి సంహారక మందు నిల్వచేయుట మరియు అమ్ముట నిషేధించడమైనది. రైతులు ఈ విషయము గమనించవలసినదిగా కోరడమైనది.

**- టి. సురేష్ కుమార్**

# మహిళలు గ్రామీణాభివృద్ధి – తీరు తెన్నులు



**భారత దేశం గ్రామాలలో జీవిస్తుంది. నేటికి 48% దేశీయ స్థూల జాతీయోత్పత్తితో గ్రామాలు ఎక్కువుగా భాగం పంచుకొంటున్నాయి. భారతీయ జీవన విధానంలో మహిళకున్న పాత్ర మరే దేశంలోను లేదు. గతంలో మాతృస్వామిక కుటుంబాల వలన కుటుంబ వ్యవస్థ ఆధారపడి దేశ ఆర్థిక వ్యవస్థను నిర్ణయించేది. వాటి స్థానంలో పితృస్వామిక కుటుంబాలు ఏర్పడిన మహిళలకు తమ స్థానం పదిలంగా ఉంది. ఎందుకంటే మహిళల ఉత్పాదకతకు మూలం కుటుంబ వ్యవస్థలో ప్రముఖమైన భూమిక పోషిస్తుంది. ఎవరైన ఇంటికి వస్తే "ఇల్లును చూసి ఇల్లాలుని చూడండని" అంటారు. అందుకే సామెత వాడుకలోకి వచ్చింది.**

భారతీయ బలమైన ఆర్థిక వ్యవస్థ ఏ ఆటు పోటునైన ఎదుర్కొని నిలబడగలిగిందంటే అందుకు మహిళలే ప్రధాన కారణం. ఇల్లు కట్టాలన్నా, ఇల్లును నిలబెట్టాలన్నా మహిళలే మూలం. మహిళలు భాగస్వామ్యం లేకుండ ఏ వ్యవస్థ బతికి బట్టకట్టలేదు. ఆ వ్యవస్థలు నిలబడాలన్నా మహిళల భాగస్వామ్యం అవసరం ఉందనేది మనమే అందుకు నిర్ధారణ. కుటుంబ వ్యవస్థ కుదురుగా ఉంటే ఆ గ్రామ వ్యవస్థ కూడా కుదురుగా ఉంటుంది. మహిళయే నిర్మించేది, నిలబెట్టేది అని అంటారు. అదిగాక మహిళలేని ఇల్లు అది ఒక ఇల్లేనా? విచ్చలవిడి తనంకు విచ్చిన్నంకు దోహదం చేస్తుందని అంటారు. అందుకే మన గ్రామీణ భారతంలో మహిళ అన్ని రంగాలలో ప్రముఖ స్థానంను కలిగి ఉందనేది వాస్తవం. అందుకే గ్రామీణాభివృద్ధి గాని, వ్యవసాయోత్పత్తి రంగాలలో మహిళలు పాత్ర ప్రధానమైనది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ లో ఏ పల్లెకు పోయిన మహిళల యొక్క ప్రాధన్యత కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మన గ్రామీణ పురోగతికి మహిళల పాత్రను పరిశీలించుదాం.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళ సగం స్థానంను ఆక్రమించింది. కాని ఆమె శ్రమను, కష్టంను గుర్తించినట్లు కనిపించదు. వ్యవసాయ పనులలో నాట్లు వేయడం దగ్గర నుండి ధాన్యం ఇంటికి వచ్చే వరకు మహిళలు భాగం పంచు కొంటున్నారు. కాని ఆమెకు వేతనాల వ్యత్యాసం చూపుతూనే ఉన్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇంకా అమలు జరుగుట లేదనే చెప్పాలి.

గృహాన్ని పోషించుటలో ఆమె ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. ఉదయం లేచి ఎంతో దూరం నుండి నీటిని సేకరించడం, కుటుంబానికి కావలసిన ఆహారంను తయారు చేసి పిల్లలను స్కూలుకు తీసుకెళ్ళడం వారి ఆలన పాలనా చూడడం దగ్గర నుండి రేషన్ షాపుకు వెళ్ళి రేషన్ సేకరించడం, వంట, వార్పు అన్ని ఆమె చేసే పనులు, మగ వారు ఏ పనికైనా వెళ్ళినా తెచ్చిన మొత్తంను ఇంటికి వినియోగించరు. అయిన ఆమె పడే తపన, ఆరాటం, శ్రమ గుర్తించుటకు ఈ సమాజం సిద్ధంగా లేదు. కనుక ఒక కుటుంబం సక్రమంగా నిల దొక్కు కొనేందుకు ఆమె పడే కష్టం ఇంతా అంతా కాదు. అయినా తను పొలం పనికి వెళుతుంది. భాగం పంచుకొంటుంది.

ఆహార సేకరణలో మగవారితో సమానంగా పొలం పనులలో భాగం పంచుకోవడంలో వెనుక బడిన ప్రాంతాల మహిళల యొక్క పాత్ర కొట్ట వచ్చినట్లు కనిపిస్తుంది.

## సూర్యుడ్ని నిద్రలేపుదాం

నేడు పల్లెల్లో
సూర్యుడిని
నిద్రలేపే రైతులు లేరు
చందమామ మళ్ళో
పడుకోమని చెప్పే పెద్దలూ లేరు
కానీ, పల్లెల్లో వ్యవసాయం ఉంది
వ్యయం పెట్టి సాగు చేసే వ్యవసాయం ఉంది.
మా వూరు మారాలని కాంక్షించే ఓ వాలంటీర్
దసరా సెలవులకు ఇంటికెళ్లి చూస్తే
ఆ వూరు ఎంతో మారి ఉంది.
సంతోషపడాలా ? చూడండి.....
ప్రత్తి తప్ప వేరే పంట తెలియదన్నట్లు
ప్రత్తికే అతుక్కుపోయిన మన రైతులు
ఎడ్లను అమ్మకానికి బెట్టి ట్రాక్టర్ల చేతిలో
పరాధీనులైన వ్యవసాయ దారులు
సారాకు బానిసై చావుకు దగ్గరౌతున్న పల్లెవాసులు
ఇలా ఒకటా రెండా ఎన్నో.... ఎంతో మార్పు
కొట్లాటలకు కొలువుగా, స్వార్థానికి నెలవుగా, ఇలా ఒకటా రెండా
పల్లెల్లో ఎంత మార్పు
మార్పును కాంక్షించే వాళ్లకు
ఆ వూరును మార్చడం సాహసమే అవుతుంది
పట్టుదలనే పెట్టుబడిగా ముందుకు సాగితే సాధ్యమే అవుతుంది.
అపార్డ్ ఇచ్చిన శిక్షణా తరగతులు
పాడిపశువుల పెంపకంతో
మనపల్లెలు, మన ఇల్లు, సల్లతో సల్లగా ఉంటాయి.
సేంద్రియ ఎరువుల వాడకంతో
భూమాతకు ప్రాణం వచ్చి, జీవసత్వాలతో మనిషి రూపు దాల్చుతాడు.
వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చిన స్ఫూర్తి
అడుగు ముందుకు వేయడానికి పునాది
వర్షపు నీటి నిర్వహణ, నీటి కరువునే తొలగించే సాధన విధానమై
సమాచార హక్కు చట్ట వినియోగం ప్రజల చైతన్యానికి ప్రతీకగా
ఇలా...... ఎన్నో, ఎన్నెన్నో
మమ్మల్ని మార్చింది, మా మెదళ్ళను మార్చింది.
అపార్డ్, మాపై మాకు అపార నమ్మకాన్నిచ్చింది, మానవత్వ చిత్రాలు చూపి,
కమిషనర్‌గారి కష్టం, చైతన్యరెడ్డి గారి చైతన్యం వక్తల విలువైన
విషయాలు వృథా కానివ్వం.....
భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా గ్రామాభివృద్ధికై పాటు పడుతాం
రెండు సంవత్సరాల తరువాత
ఇదిగో.... సూర్యాస్తమయం.... దారిపొడుగునా గెంతులేసుకుంటూ వస్తున్న
గేదెలు, గొర్రెలు.... నా గుండె కూడా ఆనందంతో గంతులేస్తుంది.

**- తగుళ్ళ గోపాల్**







విద్యకు మహిళను చాలవరకు దూరంగా ఉంచారని చెప్పవచ్చును. ధనిక వర్గ మహిళలు ఏ పరిమితులు లేకుండా విద్యనభ్యసిస్తారు. మధ్య తరగతి మహిళలకు కుటుంబ అవగాహన బట్టి విద్య అబ్బింది. కాని దిగువ తరగతి మహిళలకు అసలు చదువే అందుబాటులోకి రాలేదు. అందుకే వీరి శాతం 20 కు మించలేదు. గిరిజన దళిత మహిళలలోనైతే కేవలం 14.5% మంది మాత్రమే విద్యావంతులైన మహిళలున్నారు. అదికూడ కేవలం ప్రభుత్వ వసతి గృహ సౌకర్యం వచ్చిన 1985 నుండి విద్య దళిత మహిళలకు చేరింది. అయినా వారు మధ్యలోనే వదలి పెళ్ళిళ్ళు చేయడం వలన చదువు మానుకొంటున్నారు. కనుక వేయి మంది దళిత మహిళల్లో కేవలం 5-6 మంది వరకు స్కూలుపైనలువరకు వస్తున్నారు. కారణాలు ఆర్థిక స్థితి, అవగాహనా లోపం. ఎంత చదివినా ఆడ పిల్లకు పెళ్ళి చేయక తప్పదు అనే మీమాసంతో వారిని చదువుకు దూరం చేస్తున్నారు. ఉన్నత కులాల మహిళలు చదువుకున్న ఉద్యోగం చేసేవారి సంఖ్య మరీ తక్కువుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మహిళలు లేకుండ గ్రామీణ జీవితం కుంటి నడక నడుస్తుంది.

**- డా॥ కె. ఆసయ్య,** ఐ.ఐ.ఎస్., సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్స్, అపార్డు

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో సంపూర్ణ పారిశుద్యం

**'వ్యక్తిగత మరుగుదొడ్ల కార్యక్రమము' అత్యంత ప్రధానాంశంగాను, గ్రామీణ నిరుపేదలకు ఆరోగ్యవంతమైన మరియు సంపూర్ణ పారిశుద్య వాతావరణముతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్న కార్యక్రమము. ప్రధానంగా మహిళల పక్షాన నిలిచి సంఘములో వారి ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా గ్రామీణాభివృద్ధి శాఖకు మరియు వమహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకమునకే గ్రామాలలో మరొక వన్నె తెచ్చిన పథకము అని ప్రజల మన్ననలతో పాటు నీరాజనాలు అందుకుంటున్నాయి.**







కరీంనగర్ జిల్లాలోని 57 మండలాలలోని 1193 గ్రామ పంచాయితీలలో 2,64,079 వ్యక్తిగత మరుగుదొడ్లు రూ॥ 118.83 కోట్లతో అంచనాలు తయారు చేసి పరిపాలన మంజూరీ చేయించడం జరిగింది. ప్రత్యేకంగా, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని అర్హులైన బడుగు, బలహీన వర్గాల లబ్ధిదార్లకు జిల్లాలో 50 వేలకు పైగా క్రొత్త జాబ్‌కార్డులు పథక



సంచాలకులద్వారా మంజూరీ చేయించి, సంపూర్ణ పారిశుద్య వాతావరణములో సదుపాయాలు కల్పించడానికి 'జిల్లా నీటి నిర్వహణ సంస్థ' ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుంది.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ కార్యక్రమములో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బందితో పాటు క్షేత్రస్థాయి ఇందిరాక్రాంతి పథక సిబ్బంది, రెవెన్యూ శాఖ, అంగన్‌వాడీ టీచర్లు, సాక్షరభారత్ వాలంటీర్లు, పోలీస్‌శాఖ, పంచాయితీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు మరియు జిల్లా పాలన యంత్రాంగము కృత నిశ్చయముతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతూ, అవగాహన కల్పిస్తూ, నిర్మాణాలు వేగవంతము చేయు టకు సకాలంలో వేతన మరియు సామాగ్రి చెల్లింపులు వేగవంతముగా చెల్లిస్తూ లబ్దిదార్లను భాగస్వాములను చేయడం జరుగుతుంది.

పర్యవేక్షణలో భాగంగా, శ్రీ చక్రధర్‌రావ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి, కరీంనగర్, 23-11-2012 కోడిమ్యాల మండలములోని రాంసాగర్ గ్రామ పంచాయితీ క్షేత్ర పర్యటన చేసి వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్దిదార్లకు అవగాహన కల్పిసత్తూ వేగవంతముగా నిర్మాణాలు పూర్తి చేసుకొని వాటిని ఉపయోగములోకి తీసుకొస్తూ సంపూర్ణ పారిశుద్యాన్ని ప్రోత్సహించాలని లబ్దిదార్లకు తెలియజేయడం జరిగింది.

రాంసాగర్ గ్రామ పంచాయితీ వాస్తవ్యులు శ్రీ పునుగోటి కృష్ణరావుగారు, ఆ గ్రామ పరిధిలోని మంజూరైన 273 వ్యక్తిగత మరుగుదొడ్లకు కావలసిన రా-మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచి నిర్మాణాలు పూర్తి దశకు తీసుకురావడం జరిగింది. ఒక్క కుటుంబం కూడా సంపూర్ణ పారిశుద్యాన్ని విస్మరించకూడదని సామాజిక బాధ్యతలను గుర్తుచేయడం జరిగినది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా జి.ఓ.నెం. 250 ప్రకారంగా ముందు వరుసలో ఉండటమే కాకుండా వాటి చెల్లింపులలోను వేగవంతము చేయుటకు ప్రధానంగా జిల్లా కలెక్టర్ & ప్రోగామ్ కో-ఆర్డినేటర్ మరియు పథక సంచాలకులు ఎప్పటికప్పుడు పనులు ప్రగతిని సమీక్షించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళడం జరుగుతుంది.

గ్రామాభివృద్ధిలో, గ్రామీణాభివృద్ధి శాఖ బలహీనవర్గాల భాగస్వామ్యాన్ని పెంచాలి. అయితే వాస్తవ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వ్యక్తిగత మరుగుదొడ్ల కాలపరిమితిని కొన్ని మాసాల పాటు పొడగించాలి. ఇలాంటి పథకాలు మరిన్ని చేపట్టి గ్రామీణాభివృద్ధి శాఖ మరిన్ని విజయాలు సాధించాలి.

- **శ్రీనివాస్ దుర్గం**, అదనపు కార్యక్రమ అధికారి,
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకం, కొడిమ్యాల, కరీంనగర్‌జిల్లా

# షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక కింద 2013-14 సంవత్సరంలో నిధుల కేటాయింపులు

**రాజ్యాంగంలో షెడ్యూల్డు కులాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలు, సదుపాయాలు, రిజర్వేషన్ల అమలు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టటం జరిగింది. దానిలో భాగంగా షెడ్యూల్డు కులాల అభివృద్ధిని ఆశిస్తూ 1978-79 సంవత్సరం నుండి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక కింద నిధులను కేటాయించటం జరుగుతున్నది.**

**కేంద్ర ప్రభుత్వపు ప్రణాళికా నిధులలో దేశ జనాభాలోని షెడ్యూల్డు కులాల జనాభా దామాషాకు తగ్గకుండా అన్ని మంత్రిత్వశాఖలు నిధులను కేటాయించి ఆ నిధులను షెడ్యూల్డు కులాల సంక్షేమానికి వినియోగించ వలసి ఉంటుంది.**

రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రణాళికా నిధులలో రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డు కులాల జనాభా దామాషాకు తగ్గకుండా నిధులను కేటాయించి, రాష్ట్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలు అన్ని నిధులను షెడ్యూల్డు కులాల సంక్షేమానికి ఖర్చుచేయవలసి ఉంటుంది.

1978-79 నుండి షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక కింద నిధులను కేటాయిస్తూ ఖర్చు చేస్తున్నప్పటికీ, ఆ ఉపప్రణాళికకు చట్టబద్ధత లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ రూపొందించిన, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక (ప్లానింగ్, ఆలోకేషన్ అండ్ యుటిలైజేషన్ ఆఫ్ ఫైనాన్సియల్ రిసోర్సెస్) బిల్లు 2012 ను ప్రత్యేకంగా సమావేశపరచిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిసెంబరు 2, 2012 తేదీన ఆమోదించటం జరిగింది. ఈ చట్ట రూప కల్పన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమంలో అతి ముఖ్యమైన చారిత్రక ఘట్టం.

ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 9 ప్లానింగ్ (XXII) శాఖ తేది 23.02.3013 ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రణాళికా నిధులలో 16.2 శాతం నిధుల ను షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక క్రింద కేటాయించవలసినదిగా నిర్దేశించడమైనది.

2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 52,955.28 కోట్ల వార్షిక బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక క్రింద రూ. 8,578.75 కోట్ల నిధులను కేటాయించవలసి ఉన్నది.

ఉపప్రణాళికల నోడల్ ఏజన్సీ, రాష్ట్ర కౌన్సిల్ ఆమోదంతో 2013-14 సంవత్సరానికి రూ.8584.83 కోట్ల రూపాయలను ఉపప్రణాళిక కింద నిధులను కేటాయించటం జరిగింది. ఈ మొత్తంలో రూ.2170.28 కోట్లు సాంఘిక సంక్షేమ శాఖకు, రూ.5406 కోట్లు 41 ప్రభుత్వ శాఖలకు 789 పద్దు కింద కేటాయించటం జరిగింది.

2013-14 ఆర్థిక సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖకు, ఇతర 41 ప్రభుత్వ శాఖలకు 749 పద్దు కింద ఈ క్రింది నిధులను కేటాయించటం జరిగింది.

నోడల్ ఏజన్సీ సిఫారసులతో రాష్ట్ర కౌన్సిల్ ఆమోదంతో అవసరం లేని శాఖల నుండి అవసరం ఉన్న శాఖలకు ఈ ఉప ప్రణాళికా నిధుల ను మార్పులు, చేర్పులు చేయటానికి అవకాశం ఉంది. ఈ ఉప ప్రణాళికా నిధుల సద్వినియోగం ద్వారా షెడ్యూల్డు కులాల స్థితిగతులు మెరుగుపడతాయని ఆశిద్దాం.



| 2013-14లో నిధుల కేటాయింపు (లక్షల్లో) | | | | |
|---|---|---|---|---|
| క్ర.సం. | శాఖ | కేంద్రం | రాష్ట్రం | మొత్తం |
| I. | సాంఘిక సంక్షేమ శాఖ పద్దు కింద నిధుల కేటాయింపులు | | | |
| 1. | సాంఘిక సంక్షేమ శాఖ | 90757.67 | 217027.85 | 307785.52 |
| II. | 789 పద్దు కింద వివిధ శాఖలకు నిధుల కేటాయింపులు | | | |
| 2. | వ్యవసాయ శాఖ కమీషనర్ | 5201.80 | 35000.00 | 40201.80 |
| 3. | ఉద్యానవన శాఖ సంచాలకులు | 164.51 | 10000.00 | 10164.51 |
| 4. | పశుసంవర్థక శాఖ | 628.20 | 4000.00 | 4628.20 |
| 5. | మత్స్య శాఖ | | 1000.00 | 1000.00 |
| 6. | అటవీ శాఖ | 544.34 | | 544.34 |
| 7. | సహకార సంఘాల రిజిస్ట్రార్ | 85.70 | | 85.70 |
| 8. | గ్రామీణాభివృద్ధి కమీషనర్ | | 75000.00 | 75000.00 |
| 9. | ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ | | 25000.00 | 25000.00 |
| 10. | పంచాయితీరాజ్ కమీషనర్ | | 6410.00 | 6410.00 |
| 11. | ఛీఫ్ ఇంజనీర్, చిన్నతరహా నీటిపారుదల శాఖ | | 70457.00 | 70457.00 |
| 12. | ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి కార్పోరేషన్ | | 10615.21 | 10615.21 |
| 13. | భూ గర్భ నీటివనరుల శాఖ | | 200.00 | 200.00 |
| 14. | ఎ.పి.ట్రాన్స్‌మిషన్ కార్పోరేషన్ | | 10000.00 | 10000.00 |
| 15. | పరిశ్రమల శాఖ కమీషనర్ | | 9500.00 | 9500.00 |
| 16. | ఆంధ్రప్రదేశ్ తోళ్ళ అభివృద్ధి కార్పోరేషన్ | 1200.00 | 700.00 | 1900.00 |
| 17. | రోడ్ల శాఖ ఛీఫ్ ఇంజనీర్ | | 3000.00 | 3000.00 |
| 18. | పంచాయితీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ | | 10000.00 | 10000.00 |
| 19. | ప్రణాళికా శాఖ | | 16000.00 | 16000.00 |
| 20. | సమాచార సాంకేతిక పరిజ్ఞాన శాఖ | | 1400.00 | 1400.00 |
| 21. | ప్రాథమిక విద్య | 8366.61 | 19005.40 | 27372.01 |
| 22. | రాజీవ్ విద్యా మిషన్ | | 26294.60 | 26294.60 |
| 23. | ఇంటర్ మీడియట్ విద్య | 289.00 | | 289.00 |
| 24. | ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు | | 14000.00 | 1400.00 |
| 25. | సాంకేతిక విద్య | 1470.25 | 4200.00 | 5670.25 |
| 26. | సాంస్కృతిక వ్యవహారాలు | | 1000.00 | 1000.00 |
| 27. | వైద్య విద్య | | 15000.00 | 15000.00 |
| 28. | ప్రజారోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు | 745.05 | | 745.05 |
| 29. | ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ | 5656.21 | 24017.49 | 29673.70 |
| 30. | ప్రజారోగ్యం చీఫ్ ఇంజనీర్ | | 743.80 | 743.80 |
| 31. | హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ | | 4330.86 | 4330.86 |
| 32. | గ్రామీణ త్రాగునీటి సరఫరా | | 20000.00 | 20000.00 |
| 33. | బలహీనవర్గాల ఇళ్ళు | | 60000.00 | 60000.00 |
| 34. | పురపాలక శాఖ | | 42282.85 | 42282.85 |
| 35. | గ్రేటర్ హైదరాబాద్, మునిసిపల్ కార్పోరేషన్ | | 7.00 | 7.00 |
| 36. | హైదరాబాద్ మెట్రో అభివృద్ధి సంస్థ | | 8960.49 | 8960.49 |
| 37. | పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ | | 3675.00 | 3675.00 |
| 38. | పౌర సంబంధాల శాఖ | | 1000.00 | 1000.00 |
| 39. | ఉపాధి మరియు శిక్షణ | | 500.00 | 500.00 |
| 40. | వికలాంగుల సంక్షేమం | | 100.00 | 100.00 |
| 41. | మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమం శాఖ | 10862.00 | 19800.00 | 30662.00 |
| | **మొత్తం** | **35213.67** | **540599.70** | **575813.37** |
| III. | 7% విభజనకు వీలుపడని మౌలిక సదుపాయాల కల్పన | | | |
| i. | భారీ నీటిపారుదల శాఖ | | 66381.56 | 66381.56 |
| ii | మధ్య తరహా నీటిపారుదల శాఖ | | 3717.00 | 3717.00 |
| iii | ఆయకట్టు అభివృద్ధి సంస్థ | | 3276.56 | 3276.56 |
| iv | వరద నియంత్రణ మరియు మురుగు నీటికాల్వల నిర్వహణ | | 2107.00 | 2107.00 |
| v | రోడ్లు భవనాల శాఖ | | 23289.84 | 23289.84 |
| vi | ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. | | 700.00 | 700.00 |
| vii | వైద్య విద్య మౌలిక వసతుల కల్పన | | 1012.55 | 1012.55 |
| viii | మౌలిక వసతులు మరియు పెట్టుబడులు | | 371.00 | 371.00 |
| | **మొత్తం** | | **100855.51** | **100855.51** |
| | **మొత్తం ఉప ప్రణాళిక నిధులు** | **125971.34** | **858483.06** | **984454.40** |

*- **మట్టా మదన మోహన రావు,** విభాగాధిపతి,*
*సామాజిక న్యాయ మరియు స్వచ్ఛంద చర్య కేంద్రం, ఎ.ఎమ్.ఆర్.-అపార్డ్, హైదరాబాద్*

# 'నిర్భయ' చట్టం ఏమి చెప్తోంది?

## నేరచట్ట సవరణ శాసనం - 2013 (Criminal Law (Amendment) Ordinance - 2013)

**డిశంబర్ 16వ తేదీ 2012 సంవత్సరంలో దేశ రాజధాని ఢిల్లీలో ఒక యువతిపై జరిగిన గ్యాంగ్ రేప్ తర్వాత జరిగిన పరిణామాలలో నేర చట్టం సవరణ శాసనం-2013 ఒకటి. ఢిల్లీ గ్యాంగ్‌రేప్ ఘటనపై భారత ప్రభుత్వం నియమించిన జస్టిస్ వర్మ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు భారత శిక్షాస్మృతి (Indian Penal Code), నేర విధాన స్మృతి-1973(Criminal Procedure Code), భారత సాక్ష్యాల చట్టం-1872 (Indian Evidence Act) లకు కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ నేర చట్టం సవరణ శాసనం - 2013 ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఒక్కొక్క చట్టానికి చేయబడిన సవరణలను వరుసగా వివరంగా తెలుసుకుందాం.**

**I. భారత శిక్షా స్మృతి (Indian Penal Code)**

1. భారత శిక్షా స్మృతి లోని సెక్షన్ 100 నందలి రెండవ క్లాజులోని 'తీవ్ర హాని' (Grevious hurt), అనే పదం తర్వాత '326 ఏ' సెక్షన్ క్రింద శిక్షించదగిన తీవ్ర హానిని కలుగ జేసే నేరంతో కలిపి (Including the offence of grevious hurt punishable Under Section 326A)ను క్రొత్తగా చేర్చటం జరిగింది.

2 **అదేవిధంగా సెక్షన్ 166 తర్వాత 166ఏ ను క్రొత్తగా చేర్చారు. ఈ సెక్షన్ ప్రకారం :**

- ★ ఏదైన విషయాన్ని లేదా నేరాన్ని విచారించటానికి చట్టం ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులను ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించటం లేదా అమలు పరచకపోవటం.
- ★ సదరు ఉద్యోగి చేయవలసిన విచారణను ఎవరేని వ్యక్తిపై దురభిమానంతో సరిగా నిర్వహించనపుడు, సదరు విచారణను ఒక క్రమ పద్ధతిలో నిర్వహించడానికి చట్టం ద్వారా జారీ చేయబడిన ఇతర ఉత్తర్వులను లెక్క చేయక పోవటం.
- ★ నేరం విధాన స్మృతి-1973 (Criminal Procedure code) నందలి సెక్షన్ 154 లోని సబ్ సెక్షన్ (1) ప్రకారం 354, 354ఏ, 345బి, 354సి, 345డి నందలి సబ్ సెక్షన్ (2), 376, 376ఏ, 376బి, 376సి, 376డి, 376ఇ, సెక్షన్ ల క్రింద విచారించ దగిన నేరాలకు సంబంధించిన వివరాలను లేదా సమాచారాన్ని నమోదు చేయటంలో విఫలం కావటం.

పై మూడు కేటగిరీలలో తెలుపబడిన విధంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సరే తమ నిధి నిర్వహణలో విఫలమైనట్లయితే, ఒక సంవత్సరం లేదా అంతకు మించిన జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటిలోనూ శిక్షించబడతారు.

3. **యాసిడ్ దాడులతో తీవ్రంగా బాధించటం మొదలైన వాటి నిమిత్తం సెక్షన్ 326 తర్వాత క్రొత్తగా 326ఏ, 326బి లను, భారత శిక్షాస్మృతిలో చేర్చటం జరిగింది.**

- ★ 326ఏ సెక్షన్ ప్రకారం యాసిడ్‌తో దాడి చేయడం ద్వారా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ తీవ్రంగా బాధించడం జరిగినా, ఎవరైనా వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా అటువంటి నేరాలకు పాల్పడటం జరిగినా అటువంటి వ్యక్తులకు కనీసం 10 సంవత్సరాల జైలు శిక్ష, గరిష్ఠంగా జీవిత ఖైదు, 10 లక్షల జరిమానా విధించబడుతుంది. ఈ సెక్షన్ క్రింద విధించబడిన జరిమానాను యాసిడ్ దాడికి గురైన వ్యక్తికి లేదా యాసిడ్ దాడికి గురికాబోయిన వ్యక్తికి ఖచ్చితంగా ఇవ్వాలి.
- ★ 326 బి సెక్షన్ ప్రకారం ఎవరైనా వ్యక్తి మీద యాసిడ్ పోయటం లేదా పోయడానికి ప్రయత్నించడం ద్వారా ఉద్దేశ్యపూర్వకంగా ఎదుటి వారికి పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ హాని తలపెట్టడం లేదా తీవ్ర హాని కలిగించిన వారికి కనీసం 5 సంవత్సరాలు, గరిష్ఠం 7సంవత్సరాలు జైలు శిక్ష విధించటంతో పాటు జరిమానా కూడా విధించబడుతుంది.

4. **భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 354 క్రింద ప్రస్తుతం విధించబడుతున్న శిక్షలను సవరిస్తూ, కనీసం ఒక సంవత్సరం, గరిష్ఠంగా 5 సంవత్సరాల శిక్షతో పాటు నేరం చేసిన వ్యక్తులు జరిమానాకు కూడా బద్ధులే అనే అంశాన్ని చేర్చారు.**

5. **అదే విధంగా సెక్షన్ 354 తర్వాత 354ఎ ను చేర్చారు. సెక్షన్ 354ఏ సబ్ సెక్షన్ (1) క్రింద ఈ దిగువ పేర్కొనబడిన చర్యలు లేదా ప్రవర్తన అన్నీ లైంగిక వేధింపుల నేరం క్రింద పరిగణించబడతాయి.**

- ★ శారీరక స్పర్శ, లైంగిక సంతోషం కోసం స్పష్టంగా కానీ, ఊహించని విధంగా కానీ ప్రవర్తించటం.
- ★ లైంగికంగా సహకరించమని అర్థించటం లేదా ఆదేశించటం.
- ★ లైంగిక చర్యలకు సంబంధించిన వ్యాఖ్యలు చేయటం.
- ★ అశ్లీల సాహిత్యాన్ని బలవంతంగా చూపించటం.
- ★ లైంగిక స్వభావం కలిగిన మాటలు, చేతలు లేదా ఊహించని భౌతిక చర్య
- ★ సెక్షన్ 354, సబ్ సెక్షన్ (1) నందలి క్లాజు (1) లేదా (2) లో

తెలిపిన విధంగా ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే అట్టి వారు సెక్షన్ 354ఏ సబ్ సెక్షన్ (2) క్రింద 5 సంవత్సరాల వరకు పొడిగించదగిన కఠినమైన జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటితోనూ శిక్షించబడతారు.

★ సెక్షన్ 354 ఏ, సబ్ సెక్షన్ (1) నందలి క్లాజు 3 నుండి 5 వరకు తెలిపిన విధంగా ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే అట్టివారు సెక్షన్ 354 ఏ సబ్ సెక్షన్ (3) క్రింద న్యాయం స్థానం విధించిన లేదా ఒక సంవత్సరం వరకు పొడిగించదగిన జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షించబడతారు.

★ ఎవరైనా వ్యక్తి ఒక మహిళను పబ్లిక్ ప్రదేశంలో ఉద్దేశ్యపూర్వకంగా వివస్త్రను చేయటం లేదా ఆమెను నగ్నంగా మారమని బెదిరించటం చేసినట్లయితే అటువంటి వారు సెక్షన్ 354బి క్రింద 3 సంవత్సరాలకు తక్కువ కాకుండా, ఏడు సంవత్సరాల వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానాతో శిక్షించబడతారు.

★ 354సి సెక్షన్ క్రింద ఒక మహిళ శృంగార కార్యకలాపాల ను రహస్యంగా చూడటం కానీ, చిత్రించటం కానీ చేసిన వ్యక్తులు మొదటి సారి అయితే ఒక సంవత్సరం తక్కువ కాని, 3 సంవత్సరాల వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానాతో శిక్షించబడతారు. అదే నేరాన్ని రెండవ సారి చేస్తూ పట్టుబడినట్లయితే 3 సంవత్సరాలకు తక్కువ కాని, 7 సంవత్సరాల వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానాతో శిక్షించబడతారు.

★ ఎవరేని వ్యక్తి, ఒకవ్యక్తిని పదే పదే అనుసరించటం, తనకు ఇష్టం లేదని చెప్పిన తర్వాత కూడా మాటలు కలపడానికి ప్రయత్నించడం, వేరే వ్యక్తుల ఇంటర్నెట్ వినియోగం, ఇ-మెయిల్స్ లేదా ఇతర సాంకేతిక వస్తువుల ద్వారా నిర్వహించబడిన సంభాషణను గమనిస్తూ వుండటం వంటి చర్యల ద్వారా ఎదుటి వారిలో హింసా సంబంధిత భయాన్ని రేకెత్తించటం లేదా మనసులో వ్యాకులతను ఏర్పరచటం లేదా మనశ్శాంతి కొల్లగొట్టటం వంటి చర్యలన్నీ 'స్టాకింగ్' అనే నేరం కిందకు వస్తాయని సెక్షన్ 354డి నందలి సబ్ సెక్షన్ (1) చెబుతోంది.

అయితే ఈ దిగువ తెలిపిన సందర్భాలలో మాత్రం చేయబడిన చర్యలు 'స్టాకింగ్' క్రింద పరిగణించబడవని కూడా చెప్పింది.

1. నేర పరిశోధన నిమిత్తం ఒక వ్యక్తికి అట్టి బాధ్యత అప్పగించబడినపుడు.
2. ఏదైనా చట్టం క్రింద అవసరమైన విధంగా అన్వేషించబడినపుడు.
3. తప్పనిసరి పరిస్థితులలో ఇతరులను అన్ని విధాలుగా గమనించటం అనివార్యమైనపుడు.

★ సెక్షన్ 354డి నందలి సబ్ సెక్షన్ (1) క్రింద తెలుపబడిన నేరాలను చేసిన వారిని ఒక సంవత్సరం కంటే తక్కువ కాని, 3 సంవత్సరాల వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానాతో శిక్షిస్తారని సబ్ సెక్షన్ (2) చెబుతోంది.

**6. భారత శిక్షా స్మృతి లోని సెక్షన్ 370 నందు 1 నుండి 7 వరకు సబ్ సెక్షన్ చేర్చబడ్డాయి.**

*సబ్ సెక్షన్ (1) :* ఎవరైనా ఒక వ్యక్తిని లేదా వ్యక్తులను దోపిడీ (Exploitation) కోసం నియమించటం, రవాణా చేయటం, పట్టుకోవటం, బదలాయించటం, స్వీకరించటం ఈ దిగువ తెలిపిన ప్రకారం చేసినట్లైతే అది అక్రమ రవాణా (Trafficking) గా పరిగణించబడుతుంది.

1. బెదిరింపుల ద్వారా
2. బలాన్ని ఉపయోగించటం లేదా ఏ రకమైన నిర్భంధాన్ని ఉపయోగించినా
3. అపహరించడం ద్వారా
4. నమ్మించి మోసం చేయటం లేదా వంచన ద్వారా
5. దుర్భాషలాడటం ద్వారా
6. ప్రలోభపెట్టడం ద్వారా

అక్రమ రవాణా క్రింద వివిధ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు విధించే శిక్షలను సెక్షన్ 370 నందలి సబ్ సెక్షన్‌లు (2) నుండి (7) వరకు, సెక్షన్ 370ఏ నందలి సబ్ సెక్షన్‌లు (1) (2) లు కూడా తెలియజేస్తున్నాయి.

| సెక్షన్ | అక్రమ రవాణా నేరం వివరం | విధించదగే శిక్ష |
|---|---|---|
| 370 (2) | ఒక వ్యక్తి | 7 నుండి 10 సం॥ల కఠిన జైలు శిక్ష, జరిమానా |
| 370 (3) | ఒకరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు | 10 సం॥ల నుండి జీవితకాలం కఠిన జైలు శిక్ష జరిమానా |
| 370 (4) | ఒక మైనర్ | 10 సం॥ల నుండి జీవితకాలం కఠిన జైలు శిక్ష |
| 370 (5) | ఒకరి కంటే ఎక్కువ మంది మైనర్‌లు | 14 సం॥ల నుండి జీవితకాలం కఠిన జైలు శిక్ష |
| 370 (6) | మైనర్‌ల అక్రమ రవాణాలో ప్రభుత్వ ఉద్యోగి లేదా పోలీసు అధికారి కూడా ఉన్నట్లయితే | జీవిత కాలం ఖైదు అంటే వారు సహజంగా బ్రతికి ఉన్నంత కాలం. |
| 370 (7) | మైనర్‌ల అక్రమ రవాణాలో ఒకసారి కంటే ఎక్కువ సార్లు దోషిగా నిర్ధారించబడిన వారికి | జీవిత ఖైదు. |
| 370 (1) | అక్రమ రవాణాకు గురికాబడిన పిల్లలని తెలిసీ పనిలో పెట్టు కొన్నందుకు | 5 నుండి 7 సం॥ల వరకు కఠిన జైలు శిక్ష, జరిమానా |

7. భారత శిక్షా స్మృతి సెక్షన్ 375 ప్రకారం దిగువ తెల్పిన చర్యలు చేసిన వ్యక్తి లైంగిక దౌర్జన్యం (Sexual Assault) చేసినట్లుగా భావించబడుతుంది.

★ ఒక వ్యక్తి పురుషాంగాన్ని, స్త్రీ జననాంగంలోనికి లేదా నోటిలోనికి లేదా మూత్ర ద్వారం లోనికి లేదా మలద్వారం లోనికి చొప్పించటం లేదా ఆ విధంగా చేయమని మరో వ్యక్తిని ప్రోత్సహించటం.

★ ఏదైనా వస్తువును లేదా శరీర భాగాన్ని స్త్రీ జననాంగాంలోనికి, మూత్ర ద్వారంలోనికి లేదా మలద్వారం లోనికి చొప్పించటం

లేదా ఆ విధంగా చేయమని మరొక వ్యక్తిని ప్రేరేపించటం.

* పై తెల్పిన విధంగా చేయటానికి ఒక వ్యక్తి శరీరాన్ని నిమరటం ద్వారా సంసిద్ధం చేయటం లేదా మరొకరిని ఆ విధంగా చేయటానికి ప్రోత్సహించటం.
* రహస్యాంగాలను నోటితో తాకటం లేదా మరొకరిని తాకే విధంగా చేయటం.
* రహస్యాంగాలను స్పృశించటం లేదా మరొకరిని అలా స్పృశించే విధంగా చేయటం.

అయితే వైద్య ప్రయోజనాలు లేదా సక్రమమైన ఆరోగ్యం కోసం పై తెల్పిన విధంగా చేయవలసిన పరిస్థితులు తలెత్తినపుడు, దిగువ సందర్భాలలో అది లైంగిక దౌర్జన్యం క్రింద పరగణించబడదని ఈ సెక్షన్ తెలియజేస్తోంది.

1. ఎదుటి వ్యక్తి ఇష్టానికి విరుద్ధంగా
2. ఎదుటి వ్యక్తి అంగీకారం లేకుండా
3. చనిపోతాననే భయంతోను లేదా బాధతోను ఒక వ్యక్తి ఎదుటి వారిపై ఇష్టంతో అంగీకరించినపుడు
4. లైంగిక దౌర్జన్యానికి గురికాబడిన వ్యక్తి స్త్రీ అయితే ఆమె సమ్మతితో
5. తనకు తెలియని పరిస్థితిలో అంగీకారం తెలిపినపుడు
6. 18 సం॥ల లోపు వయసుగల వ్యక్తి అంగీకార / అనంగీకారంతో
7. ఒక వ్యక్తి తన అంగీకారాన్ని తెలియజేయనపుడు

అదే విధంగా ఏ వ్యక్తి అయినా తన భార్యతో లైంగిక చర్యలు చేయటం, సంభోగించటం లైంగిక దౌర్జన్యం క్రింద పరిగణించబడదనీ, అయితే భార్య వయసు 16 సంవత్సరాలు పైబడి వుండాలనీ తెలియజేయబడినది.

సెక్షన్ 376 సబ్ సెక్షన్ (2) నందు తెలిపిన వారికి మినహా, లైంగిక దౌర్జన్యాలకు పాల్పడిన వారందరికీ 7 సంవత్సరాలకు తక్కువ కాకుండా జీవితకాలం వరకు కఠిన జైలు శిక్ష, జరిమానా సబ్ సెక్షన్ (1) ప్రకారం విధించబడతాయి.

ఏ. ఒక పోలీసు అధికారిగా నియమించబడిన పోలీసు స్టేషన్ పరిధిలో ఏదైనా పోలీసు స్టేషను ఆవరణలో తన ఆధీనంలోని వ్యక్తిపై లేదా తన క్రింద పనిచేస్తున్న అధికారి ఆధీనంలోని వ్యక్తిపై దౌర్జన్యం చేసిన పోలీసు అధికారి.

బి. తన ఆధీనంలోని వ్యక్తిపై లేదా తన క్రింద పని చేయుచున్న అధికారి ఆధీనంలోని వ్యక్తిపై దౌర్జన్యం చేసిన ప్రభుత్వ అధికారి.

సి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే మోహరించబడిన సాయుధ బలగాలలోని సభ్యుడు

డి. చట్టం ద్వారా సమయానుసారం ఏర్పాటు చేయబడిన ప్రదేశాలు, జైళ్ళు, రిమాండు హోములు, మహిళలు, బాలల కొరకు సంస్థలు నిర్వహిస్తున్నవారు.

ఇ. ఒక వైద్యశాలను నిర్వహిస్తున్న లేదా సదరు వైద్యశాలలో సిబ్బందిగా పని చేస్తున్న వ్యక్తి.

ఎఫ్. ఒక వ్యక్తి బంధువు, సంరక్షకుడు, టీచరు, విశ్వాసం పొందిన వ్యక్తి, అధికారం ఇవ్వబడిన వ్యక్తి.

జి. గర్భవతి అని తెలిసిన మహిళపై

హెచ్. 18 సం॥ల లోపు వయసుగల వ్యక్తిపై

ఐ. తన అంగీకారాన్ని తెలుపలేని వ్యక్తిపై

జె. సామాజిక, ఆర్థిక ఆధిక్యం లేని వ్యక్తిపై

కె. మానసిక, శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులపై లైంగిక దౌర్జన్యం చేసిన వారు.

ఎల్. లైంగిక దౌర్జన్యం కారణంగా తీవ్రమైన అవయవ లోపం, అంగవైకల్యం కలిగినా లేదా జీవితానికి ప్రమాదం ఏర్పడినా

ఎమ్. నిరంతర లైంగిక దౌర్జన్యం చేసినా అట్టి నేరాలకు పాల్పడిన వ్యక్తులకు 10 సం॥లకు తగ్గకుండా, జీవితకాలం వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానా కూడా విధించబడుతుంది.

***376 ఏ:*** సెక్షన్ 376 నందలి సబ్ సెక్షన్ (1) లేదా సబ్ సెక్షన్ (2) క్రింద శిక్షించదగిన నేరాన్ని చేసినపుడు, దాని పర్యవసానంగా ఎదుటి వ్యక్తి చనిపోవటం లేదా చావు బ్రతుకుల మధ్య ఉన్నపుడు నేరం చేసిన వ్యక్తికి 20సం॥లు తక్కువ కాకుండా, జీవిత కాలం పొడిగించదగిన కఠిన జైలు శిక్ష విధించబడుతుంది.

***376 బి:*** ఎవరైనా వ్యక్తి ఒక ఆచారాన్ని అనుసరించి లేదా వేర్పాటు చట్టం (Decree of Separation) క్రింద విడిగా జీవిస్తున్న తన భార్యపై, ఆమె అంగీకారం లేకుండా లైంగికంగా దౌర్జన్యం చేసినట్లయితే సెక్షన్ 376బి క్రింద 2 సం॥లు తక్కువ కాకుండా 7 సం॥లు వరకు పొడిగించదగిన జైలు శిక్ష, జరిమానాతో శిక్షించబడతాడు.

ఏ. అధికార స్థానంలో వున్న లేదా ధర్మ కర్తృత్వ సంబంధం కలిగి వున్న వ్యక్తి

బి. ఒక ప్రభుత్వ అధికారి

సి. ఒక జైలు పర్యవేక్షకుడు లేదా నిర్వాహకుడు

డి. వైద్యశాల యాజమాన్యంలోని వ్యక్తి లేదా సిబ్బందిగా పని చేస్తున్న వ్యక్తి

ఒక వ్యక్తి స్థానాన్ని లేదా సంబంధాన్ని కించపరుస్తూ ఎదుటి వ్యక్తిని ప్రలోభ పెట్టటం లేదా ఆకర్షించటం ద్వారా ఆ వ్యక్తితో సంభోగం జరిపినట్లయితే అట్టి నేరానికి సెక్షన్ 376సి క్రింద 5 సం॥లకు తగ్గని, 10 సం॥ల వరకూ పొడిగించదగిన కఠిన జైలు శిక్ష, జరిమానా విధించబడుతుంది. అయితే ఈ నేరాన్ని లైంగిక దౌర్జన్యం క్రింద పరిగణించటం లేదని ఈ చట్టం చెబుతోంది.

* ఒకే ఉద్దేశ్యంతో ఒకరు లేదా ఎక్కువ మంది వ్యక్తులు ఒక బృందంగా ఏర్పడి మరో వ్యక్తిపై లైంగికంగా దౌర్జన్యం చేయటం జరిగినపుడు లింగభేదం లేకుండా బృందంలోని ప్రతి ఒక్కరినీ దోషులుగా భావించి సెక్షన్ 376డి క్రింద 20 సం॥లకు తక్కువ కాకుండా, జీవితకాలం వరకు పొడిగించదగిన కఠిన జైలు శిక్ష విధించబడుతుంది. అంతేకాకుండా బాధితుల వైద్య ఖర్చులు, పునరావాసం క్రింద తగిన నష్ట పరిహారాన్ని కూడా నేరస్తులు బాధితులకు చెల్లించాలి.
* గతంలో 376 లేదా 376ఏ లేదా 376సి లేదా 376డి క్రింద శిక్షించబడి, ఆ తర్వాత కూడా ఈ సెక్షన్‌ల క్రింద నేరస్థుడిగా పరిగణించబడిన వ్యక్తులు సెక్షన్ 376ఇ ప్రకారం జీవితఖైదుతో

శిక్షించబడతారు.

★ భారత శిక్షాస్మృతి నందలి సెక్షన్ 509లో తెలుపబడిన శిక్షాకాలాన్ని ఒక సంవత్సర సాధారణ జైలుశిక్ష, జరిమానా లేదా రెండింటి స్థానే 3 సం॥ల వరకూ పొడిగించ దగిన జైలు శిక్ష, జరిమానాను చేర్చారు.

## II. నేర విధాన స్మృతి (Criminal Procedure code)

★ అరెస్టు చేయబడిన వ్యక్తిని గుర్తించే వ్యక్తి శారీరక లేదా మానసిక వైకల్యం కలిగిన వారైతే గుర్తింపు ప్రక్రియ అంతా జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో జరగాలి. ఆ ప్రక్రియ మొత్తాన్ని వీడియో ద్వారా చిత్రీకరించాలి అనే నిబంధనను సెక్షన్ 54ఏ నందు చేర్చారు.

★ భారత శిక్షా స్మృతి నందలి సెక్షన్ 326ఎ, 326బి, 354, 376, 376ఏ, 376బి, 376సి, 376డి, 376ఇ, 509 క్రింద తనకు విరుద్ధంగా నేరం జరిగినట్లు ఒక మహిళ ఇచ్చిన సమాచారాన్ని సాధ్యమైనంత వరకు మహిళా పోలీసు అధికారితో నమోదు చేయించాలి. అంతే కాకుండా సదరు మహిళకు న్యాయ సహాయాన్ని, ఆరోగ్య పరమైన జాగ్రత్తల ను కూడా కల్పించాలనే విషయాన్ని సెక్షన్ 154 నందలి సబ్ సెక్షన్ (1) తెలియజేస్తోంది.

★ పై సెక్షన్‌లలో తెలుపబడిన నేరాలు జరిగిన సందర్భంలో అత్యాచారానికి లేదా హింసకు గురైన వ్యక్తి తాత్కాలికంగా కానీ, శాశ్వతంగా కానీ, మానసికంగా కానీ, శారీరకంగా కానీ వైకల్యానికి గురైనప్పుడు నేరం జరిగిన సమాచారాన్ని ఒక పోలీసు అధికారి రిపోర్టు చేయదలచిన వ్యక్తి ఇంట్లోగానీ, సదరు వ్యక్తి ఇష్టపడిన మరో ప్రాంతంలో గానీ రిపోర్టు చేయదలచుకున్న వ్యక్తి చెప్పే అంశాల ను చక్కగా వివరించ గలిగే వారి సమక్షంలో నమోదు చేయడమే కాకుండా, మొత్తం సమాచారాన్ని వీడియో ద్వారా చిత్రీకరించాలి.

★ సెక్షన్ 160 నందలి సబ్ సెక్షన్ (1) నందలి '15 సం॥రాలు లేదా మహిళ' అనే పదాలను '18 సం॥రాలు లేదా 65 సం॥రాలు పైబడిన లేదా మహిళ లేదా శారీరకంగా లేదా మానసికంగా వైకల్యం పొందిన వ్యక్తి' అనే పదాలతో సవరించారు.

★ భారత శిక్షా స్మృతి నందలి సెక్షన్ 354, 354ఏ, 354బి, 354సి, 354డి, 375, 376, 376ఏ, 376బి, 376సి, 376డి, 376ఇ, 509 క్రింద నేరం జరిగినట్లు ఎవరేని మహిళ యిచ్చిన సమాచారాన్ని సాధ్యమైనంత వరకు ఒక మహిళా పోలీసు అధికారి ద్వారానే నమోదు చేయించాలని సెక్షన్ 161 నందలి సబ్ సెక్షన్ (3) తెలియచేస్తోంది.

★ భారత శిక్ష్మా స్మృతి నందలి 354, 354ఏ, 354బి, 354సి, యొక్క సబ్ సెక్షన్ (2), 376 యొక్క సబ్ సెక్షన్లు (1) (2), 376ఏ, 376బి, 376సి, 376డి, 376ఇ క్రింద శిక్షించదగిన నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సెక్షన్ 164 నందలి సబ్ సెక్షన్ (5) లో తెలిసిన ప్రకారం పోలీసుల దృష్టికి సమాచారం వచ్చిన వెంటనే జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో నమోదు చేయాలి. సమాచారం ఇచ్చే వ్యక్తి తాత్కాలికంగా కానీ, శారీరకంగా కానీ, మానసికంగా కానీ వైకల్యం పొందినపుడు అట్టివ్యక్తులు చెప్పే అంశాలను చక్కగా వివరించే వ్యక్తుల సహాయంతో నమోదు చేయడంతో పాటు ఆ మొత్తం ప్రక్రియను వీడియో ద్వారా చిత్రీకరించాలనే విషయాన్ని సెక్షన్ 164 నందలి సబ్ సెక్షన్ (5ఏ), క్లాజు (ఏ) నందు చేర్చటం జరిగింది.

★ భారత శిక్షా స్మృతి నందలి సెక్షన్ 376బి క్రింద పరిగణించే నేర విచారణను ఒకవేళ సదరు వ్యక్తుల మధ్య వివాహ సంబంధం కలిగి ఉన్నట్లైతే ఫిర్యాదు చేయబడిన నేరానికి సంబంధించిన అంశాలు సహజంగా, తృప్తికరంగా అనిపిస్తే తప్ప లేదా నిందితుడైన భర్తకు వ్యతిరేకంగా భార్య ఫిర్యాదు చేస్తే తప్ప ఏ కోర్టు విచారణను చేపట్టరాదు అనే విషయాన్ని సెక్షన్ 198బి ను చేర్చటం ద్వారా తెలియజేయబడినది.

★ లైంగిక దౌర్జన్యానికి లేదా లైంగిక నేరానికి గురైన వ్యక్తి 18 సం॥ల లోపు వయసు కలిగి వున్నట్లయితే, అట్టివ్యక్తి సాక్ష్యాన్ని నమోదు చేయడం, సదరు వ్యక్తిని నిందితుడి బారి నుండి కాపాడటానికి అవసరమైన చర్యలను కోర్టు చేపట్టాలని సెక్షన్ 273 నందు తెలియజేశారు.

★ నేర చట్ట సవరణ శాసనం క్రింద తెలుపబడిన సెక్షన్‌లలో సెక్షన్ 166ఏ, 354ఏ (2), 354 సి క్రింద శిక్షించదగిన నేరాలను విచారణ అవసరంలేని బెయిల్ మంజూరు చేయదగిన నేరాలుగాను, మిగిలిన సెక్షన్‌ల క్రింద శిక్షించదగు నేరాలను విచారించదగిన నాన్ బెయిల బుల్ నేరాలుగా పరిగణించారు.

## III. భారత సాక్ష్యాల చట్టం (Indian Evidence Act)

★ భారత శిక్షాస్మృతి లోని 354, 354ఎ, 354బి, 354సి, 376(1) (2), 376ఎ, 376బి, 376సి, 376డి, 376ఇ సెక్షన్‌ల క్రింద శిక్షించ దగిన నేరాలను విచారించేటప్పుడు గత లైంగికానుభవం లేదా శీలం సంబంధిత సాక్ష్యం అవసరం లేదని సెక్షన్ 53ఎ ను చేర్చటం ద్వారా సవరించారు.

★ భారత శిక్షా స్మృతి నందలి సెక్షన్ 376 (2) నందలి (ఎ) నుండి (ఎం) వరకు గల క్లాజుల ప్రకారం లైంగిక దౌర్జన్యానికి సంబంధించిన నేరాలను విచారించేటప్పుడు, నిందితుడు సంభోగం చేసినట్లు నిరూపించబడినా ఆ చర్యలో పాల్గొన్న స్త్రీ అంగీకారం లేదనే భావించాలని సెక్షన్ 114ఎ ద్వారా తెలియచేయటం జరిగింది.

★ ఎవరేని సాక్షి మాట్లాడలేని అశక్తుడైనప్పుడు అతను/ఆమెకు నచ్చిన విధంగా రాత ద్వారా కానీ, సంజ్ఞల ద్వారా కానీ బహిరంగంగా చెప్పినట్లయి దాన్నీ నోటి మాటగా చెప్పిన సాక్ష్యంగా భావించవచ్చనీ, అయితే అటువంటి సాక్ష్యాన్ని విశ్లేషించే సామర్థ్యం కలిగిన వ్యక్తుల సహాయాన్ని కోర్టు తీసుకోవచ్చనీ, ఈ ప్రక్రియనంతా వీడియో ద్వారా చిత్రీకరించాలనీ తెలియజేస్తోంది.

★ భారత శిక్షాస్మృతి నందలి 376 (1) (2), 376ఎ, 376బి, 376సి, 376డి, 376ఇ సెక్షన్‌ల క్రింద శిక్షించదగిన నేరాలను విచారించేటప్పుడు గత లైంగికానుభవం లేదా శీలానికి సంబంధించిన అంశాలపై క్రాస్ ఎగ్జామినేషన్‌ను నిరోధిస్తూ సెక్షన్ 146 ను సవరించారు.

మహిళల రక్షణార్థం క్రొత్తగా చేయబడిన ఈ శాసనంలోని అంశాలను సామాన్య ప్రజానీకానికి కూడా అందజేయాలనే ఉద్దేశ్యంతో చేసిన చిరు ప్రయత్నమే ఈ వివరణ.

*- జి. సత్యవాణి, ఫాకల్టీ మెంబర్*
*సిడిపిఎ, ఎఎంఆర్ - అపార్డ్*

**ప్రస్తుత సమాచార శకాన్ని శాసిస్తున్న ఇంటర్‌నెట్ అనే సాంకేతిక సమాచార విప్లవాన్ని వినియోగించుకొని, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆధునిక సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రాష్ట్ర రైతాంగానికి అందించేందుకు వ్యవసాయ శాఖ www.apagrisnet.gov.in పేరున ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించి అందులో భూసార పరీక్షా ఫలితాలను కూడా తెలుసుకొనే వీలు కల్పించింది.**

రైతులకు కావల్సిన వివిధ పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర రైతన్నల మాతృభాష అయిన తెలుగులో అందించడమే కాకుండా, భూసార పరీక్షా ఫలితాలతో పాటు, విత్తన శుద్ధి, రకాల ఎంపిక, విత్తనాలు మరియు ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, పంటల కనీస మద్దతు ధరలు మొదలగు సమాచారాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా అందివ్వడం జరుగుతుంది.

అగ్రిస్‌నెట్ వెబ్‌సైట్‌ను రైతులకు మరింత చేరువలోకి తెచ్చేందుకు భూసార పరీక్షా ఫలితాలను కూడా ఇంటర్‌నెట్‌లో పొందుపర్చారు.

ఉదాహరణకు, నమూనా సంఖ్య 2011-12 ఆర్ఆర్‌డి 16 2001 ఇందులో మొదటి ఆరు అంకెలు (2011-12) మట్టి నమూనా సేకరించిన సంవత్సరాన్ని తెలియజేస్తుంది. ఆ తర్వాత గల మూడు అక్షరాలు (ఆర్ఆర్‌డి) జిల్లాను తెలియచేస్తాయి.

ఉదాహరణకు (ఆర్ఆర్‌డి) రంగారెడ్డి జిల్లా, అదే విధంగా కరీంనగర్ జిల్లాకు (కెఎన్ఆర్), వరంగల్ జిల్లాకు (డబ్ల్యుజిఎల్) అని ప్రతి జిల్లాకు ఒక మూడు అక్షరాల కోడ్ ఇవ్వబడింది. ప్రతి మండలానికీ రెండు అంకెలు గల ఒక సంఖ్యను కేటాయించారు.

ఉదాహరణకు రెండు అంకెలు అనగా (16) జిల్లాలోని రాజేంద్రనగర్ ఒక మండలాన్ని సూచిస్తుంది. చివరన పొందుపరిచిన నాలుగు అంకెల సంఖ్య (0001) ఆ మండలంలో సంబంధిత మట్టి నమూనా సంఖ్య రైతుకు సంబంధించింది. ఒక నిర్దేశిత సంవత్సరంలో, జిల్లాలోని ఏ మండలంలో, ఎన్ని నమూనాలను సేకరించారనే విషయం తెలియపరుస్తుంది. ఈ విధంగా ఒక మండలానికి, ఒక సంవత్సరం కాలంలో 9999 మట్టి నమూనాలను సేకరించి పంపే అవకాశం ఏర్పడుతుంది.

# ఇంటర్‌నెట్ ద్వారా భూసార ఫలితాల సమాచారం

అందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మట్టి నమూనాలతో పాటు రైతులు అందించే సమాచార పత్రంలో సమూలమైన మార్పులు చేసి, ప్రతి నమూనాకు 15 అంకెలు గల ఒక విశిష్ఠమైన కోడ్ నంబరును మరియు మూడు భాగాలుగా సమాచార పత్రాన్ని రూపొందించింది.

మొదటి భాగాన్ని మట్టి నమూనాతో పాటుగా భూసార పరీక్షా కేంద్రానికి అందజేస్తారు. రెండవ భాగాన్ని రైతు రశీదుగా, మూడవ భాగాన్ని వ్యవసాయ అధికారి కార్యాలయంలో భద్రపరుస్తారు. భూసార పరీక్షా కేంద్రానికి మట్టి నమూనా అందిన వెంటనే వ్యవసాయ సిబ్బంది మట్టి పరీక్షలను జరిపి వాటి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. తద్వారా రైతులు గతంలో మాదిరిగా కాకుండా, తమ కోడ్ నంబరును ఉపయోగించుకుని ఇంటర్‌నెట్ నుండి తమ పంట చేల పరీక్షా ఫలితాలను తెలుసుకోవచ్చును. ప్రింటు రూపంలో సమాచారాన్ని పొందవచ్చును.



దీని ద్వారా రైతులే స్వయంగా వారి వద్దనున్న 15 అంకెలు గల సంఖ్యతో ఏ ఇంటర్ నెట్ కేంద్రం నుండైనా వారి భూసార పరీక్షా వివరాలను తెలుసుకొనవచ్చును. లేదా మండల వ్యవసాయ అధికారి నుండి కానీ ఈ ఫలితాల వివరాలను పొందవచ్చును. భూసార పరీక్షా కేంద్రం నుండి సరియైన సమయంలో ఫలితాలు అందడం లేదనే ఇబ్బంది ఇక ముందు వుండదు. రాష్ట్రంలో అన్ని మండలాల్లో ఏర్పాటయ్యే (మండలానికి 2 నుండి 3 చొప్పున) కామన్ సర్వీస్ సెంటర్లను, ఈ-సేవా కేంద్రాలను ఉపయోగించుకొని గ్రామీణ రైతాంగం తమ పంటల సాగుకు సంబంధించిన సమాచారంతో పాటు, భూసార ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ అందిస్తుంది.

రాష్ట్ర రైతాంగం, వ్యవసాయ శాఖ నూతనంగా ప్రారంభించిన ఈ అగ్రిస్‌నెట్ వెబ్‌సైట్ సౌకర్యాన్ని వినియోగించుకొని, అధిక రసాయనాల వినియోగాన్ని తగ్గించుకొని, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని ఆచరించి, తక్కువ ఖర్చుతో, నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తారని ఆశిద్దాం.

సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు పరుస్తుంది. దీని కొరకు ప్రతి జిల్లాలోను కొంతమంది రైతులను ఎంపిక చేసి, గ్రూపులుగా ఏర్పాటు చేసి శిక్షణ ద్వారా వారికి సేంద్రీయ వ్యవసాయం, సాగు పద్ధతులు, నాణ్యతా ప్రమాణాలు, తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగిస్తారు. మొత్తం యాజమాన్యం వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో జరుగుతుంది. రైతులు సాధించిన వ్యవసాయ ఉత్పత్తులకు వ్యక్తిగతంగా కాకుండా, గ్రూపునకు మొత్తంగా సేంద్రీయ ఉత్పత్తి ధృవీకరణ పత్రం పద్ధతి ప్రవేశపెట్టారు. కొంతమేరకు రాయితీలు కూడా కల్పించారు.

*- వి. సంధ్యారాణి, ఇన్‌ఫర్మేషన్ సెల్,*
*వ్యవసాయ కమీషనర్ కార్యాలయం, హైదరాబాద్.*

# దార్శనికతకు మారుపేరు జలగం వెంగళరావు

**ఒక సాధారణ పంచాయతీ గుమాస్తాగా జీవితాన్ని ప్రారంభించిన జలగం వెంగళరావు అనంతరకాలంలో అపూర్వమైన నాయకత్వ పటిమతో దేశ నాయకునిగా కీర్తింపబడ్డారు. అంచెలంచెలుగా ఎదుగుతూ పంచాయతీ సమితి అధ్యక్షునిగా, జిల్లా పరిషత్తు అధ్యక్షునిగా, రాష్ట్ర శాసన సభ్యునిగా, పంచాయతీ ఛాంబర్ అధ్యక్షునిగా, రాష్ట్రమంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. నిరంతరం ప్రజలతో మమేకమయి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి పలువురికి మార్గదర్శకమయ్యారు. ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ వారిని అభివృద్ధి బాట నడిపించడటానికి సర్వశక్తులూ ఒడ్డిన కృషీ వలుడు శ్రీ జలగం వెంగళరావు. ఆయన చొరవతో హైదరాబాద్‌లో ఏర్పాటైన కేంద్ర విశ్వవిద్యాలయం, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కరీంనగర్ జిల్లాలోని రామగుండం సూపర్ థర్మల్ విద్యుత్ ప్లాంటు మరియు ఖమ్మం జిల్లాలోని పలు నీటి పారుదల ప్రాజెక్టులు నేడు ప్రజలకు అందచేసే సేవలు ఆయన దార్శనికతకు అద్దం పడతాయి.**



22 ఏళ్ళ వయస్సులో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిపోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాలు పంచుకొన్నారు. ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషించారు. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో పాల్గొని ప్రజా కంటకులుగా మారిన భూస్వాములు, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా ఊరూరా తిరిగి ప్రజలను చైతన్య పరిచేవారు. తిరువూరు సరిహద్దు శిబిరానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు.

1947 ఆగస్టు 7న నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి రాష్ట్రంలో సర్వత్రా జాతీయ పతాకాలను ఆవిష్కరించిన సందర్భంలో ప్రభుత్వం పలువురిని అరెస్ట్ చేసింది. వీరిలో జలగం వెంగళరావు, హీరాలాల్ మోరియా, దాశరథి కృష్ణమాచార్య తదితరులున్నారు.

1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్‌పై భారతప్రభుత్వం జరిపిన సైనిక చర్యలో భారతసైన్యానికి బాసటగా నిల్చి తిరువూరు వైపు నుంచి పురోగమించిన సైనిక దళాలకు సహకరించారు. నిజాం పాలన నుండి ప్రజలకు విముక్తి లభించిన తరువాత కూడా భూస్వాములకు వ్యతిరేకంగా వెంగళరావు ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణ మానలేదు. భూస్వాముల వత్తిడికి తలొగ్గిన రాష్ట్రప్రభుత్వం శ్రీ వెంగళరావు చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ చెరసాల పాలు చేసింది. జైలు నుండి వచ్చిన వెంగళరావు మళ్ళీ ప్రజా పక్షాన నిలిచి కౌలుదారుల హక్కుల కోసం పోరాటం కొనసాగించటం కొసమెరుపు.

### జిల్లా పరిషత్తు అధ్యక్షునిగా....

1959 నవంబరు 1న మన రాష్ట్రంలో పంచాయితీరాజ్ సంస్థలు ఏర్పాటయ్యాయి. జలగం వెంగళరావు కల్లూరు పంచాయతీ సమితికి కో -ఆప్టెడ్ మెంబరుగా ఎంపికయ్యి తద్వారా సమితి అధ్యక్షులు అయ్యారు. అదే విధంగా జిల్లా పరిషత్ అధ్యక్షులుగా అందరి ఆమోదంతో ఎన్నికయ్యారు. విద్య, నీటిపారుదల, రహదార్లు, వైద్యం మొదలగునవి ఆయన ప్రాధమ్యాలు. ప్రాథమిక పాఠశాలలున్న చోట జిల్లాలో 80 కొత్త హైస్కూళ్ళు ఏర్పాటు చేసిన ఘనత శ్రీ వెంగళరావుకే దక్కుతుంది.

నీటి పారుదల రంగంలో వంద హెక్టార్లలోపు సాగుభూములకు ఉపయోగపడే మైనర్ ఇరిగేషన్ పథకాలను వెంగళరావు నేతృత్వంలో ఖమ్మం జిల్లా పరిషత్తు అమలు పర్చింది. ఖమ్మం జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటికీ మరమ్మత్తులు జరిపించడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదం చేశారు. పల్లె ప్రజలకు వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాలని ఆయన గ్రహించి ప్రతి పంచాయితీ సమితిలోనూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పారు. కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, ఈ మూడు చోట్ల ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ప్రభుత్వ ఆసుపత్రులు స్థాపించారు. ఈ రోజుకీ అవి ఆ ప్రాంతాల ప్రజల వైద్య చికిత్సావసరాన్ని సంతృప్తికరంగా తీరుస్తున్నాయి.

### పంచాయితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షునిగా....

శ్రీ నీలం సంజీవరెడ్డి రెండోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత 1963లో రాష్ట్ర పంచాయితీ ఛాంబర్‌ను నెలకొల్పారు. ఇటు ప్రభుత్వ కార్యక్రమాల్ని, లక్ష్యాల్ని పంచాయితీ రాజ్ సంస్థలకు తెలియ పర్చడం, అటు ఆయా సంస్థల సమస్యలు, అవసరాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తేవడం, తద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థ పటిష్టంగా పనిచేయడానికి దోహదం చేసే సాధనంగా ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఛాంబర్ ఏర్పాటైంది.

ఖమ్మం జిల్లా పరిషత్ అధ్యక్షులుగా వెంగళరావు చేసిన కృషిని గుర్తించిన సంజీవరెడ్డి జలగం వెంగళరావుని రాష్ట్ర పంచాయితీరాజ్ చాంబర్ అధ్యక్షులుగా ఎంపిక చేశారు. అలా ఆయన కొత్త సంస్థ పంచాయితీరాజ్ ఛాంబర్ తొలి అధ్యక్షులయ్యారు.

వెంగళరావు రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబరుకు సొంత భవనం సమకూర్చారు. సొంత ముద్రణాలయాన్ని ఏర్పాటు చేశారు. 'పంచాయిత్' అనే మాస పత్రిక ఆయన మానసపుత్రికే! రాష్ట్రంలో ఆనాడు ఉన్న 16 వేల పంచాయితీరాజ్ సంస్థల వాణిగా అది రాణించింది. గ్రామీణాభివృద్ధికి పటుతర సాధనంగా ఉపయోగపడే విధంగా పంచాయితీ రాజ్ సంస్థలు పరిఢవిల్లాలని గాఢంగా వాంఛించిన

వారిలో వెంగళరావు అగ్రగణ్యులు. ముఖ్యంగా 1967లో ఎం.టి. రాజు కమిటీ సిఫారసుల్ని ఆ దిశగా పేర్కొనవచ్చు. సిఫారసుల ద్వారా పంచాయితీరాజ్ సంస్థలలో జిల్లా కలెక్టర్ అధికారం, జోక్యం పెరిగింది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, సంస్థలను తిరిగి బలోపేతం చేయటానికి 1968 సంవత్సరంలో శ్రీ వెంగళరావు అధ్యక్షులుగా ఒక సంఘాన్ని కాంగ్రెస్ శాసనసభా పక్షం నియమించింది. వెంగళరావు అధ్యక్షులుగా ఏర్పాటైన ఆ సంఘం రాష్ట్ర మంతటా పర్యటించి పంచాయితీ రాజ్ సంస్థల స్తబ్దతకు కారణాలు కనుగొన్నది.

జిల్లా అభివృద్ధి మండలి వ్యవస్థను వెంగళరావు కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. వాటిని వెంటనే రద్దు చేయాలన్నది వెంగళరావు కమిటీ సిఫారసుల్లో ముఖ్యమైంది. దళితులకు, మహిళలకు సమితి, జిల్లా పరిషత్ స్థాయి సంఘాలలోను, గ్రామ పంచాయితీ నిర్వాహక సంఘాలలోను కో-ఆప్షన్ ద్వారా ప్రాతినిధ్యం కల్పించాలన్నది మరో సిఫారసు. అంతేగాని, వేరే కో-ఆప్టెడ్ సభ్యులకు అవకాశం ఇవ్వరాదు. పంచాయితీరాజ్ సంస్థలలో పదవులు చేపట్టడానికి చట్ట సభల సభ్యుల పై ఆంక్షలు ఉండరాదు అని కూడా సిఫారసు చేసి, జిల్లా డెవలప్‌మెంట్ బోర్డుల అధికారాలను జిల్లా పరిషత్తు మొదటి స్థాయి సంఘానికి అప్పగించడం తప్ప వెంగళరావు కమిటీ నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యా తీసుకోలేదు.

పంచాయితీరాజ్‌కు సంబంధించిన నిబంధనలు, ఆర్థిక వనరులు ఇత్యాది అంశాల్ని పరిశీలించి, మార్పులు, చేర్పులు సూచించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1971లో సి. నరసింహం అధ్యక్షతన మరొక కమిటీని నియమించింది. ఆ కమిటీ పంచాయితీ రాజ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై మొత్తం 404 సిఫారసులు చేసింది. వెంగళరావు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాక గాని ఆ సిఫారసులకు మోక్షం కలగలేదు.

వెంగళరావు లాగా పంచాయితీరాజ్ సంస్థలపై ప్రగాఢ విశ్వాసం ఉన్న ముఖ్యమంత్రులు దేశంలో అరుదు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక కూడా కొన్నాళ్ళ వరకు పంచాయితీరాజ్ శాఖను తమ వద్దే పెట్టుకున్నారు. సమర్థుడైన వ్యక్తి కోసం గాలించి, చివరకు ఆ శాఖను లుకలాపు లక్ష్మణదాసుకు అప్పగించారు.

## రాష్ట్రమంత్రిగా...

1969లో బ్రహ్మానందరెడ్డి క్యేబినెట్‌లో గృహశాఖ మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. నక్సలైట్ల హింసా కార్యకలాపాలను హోంమంత్రిగా అత్యంత చాకచక్యంగా ఎదుర్కొన్నారు. నక్సలైట్ల బెదిరింపును ఖాతరు చేయని ఆయన నైజం అటు పోలీసులలో, ఇటు ప్రజలలో విశ్వాసం పెంచింది. అనంతరం పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో పరిశ్రమల శాఖామంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిగా....

రాష్ట్రంలో అధ్యక్షపాలనను తొలగించాక ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావును ఇందిరాగాంధీ ఏరి కోరి ఎంపికచేశారు. డిసెంబర్ 10, 1973న ఆయన ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు తనదైన శైలిలో పని చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో మచ్చుకు కొన్ని జ్ఞప్తికి తెచ్చుకోవవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రారంభించిన తొలి రైల్వే మార్గం బీబీనగర్-నడికూడి రైలు మార్గం శ్రీ వెంగళరావు చొరవతోనే ఇది ప్రారంభమయింది. అదే విధంగా విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి 5వ పంచవర్ష ప్రణాళికలో నిధుల కేటాయింపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలుగు వారి మధ్య భావసమైక్యతను సాధించటానికి ప్రపంచ తెలుగు మహాసభలను 1975లో నిర్వహించిన తీరు అనన్య సామాన్యం. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టే నాటికి, అసంపూర్తిగా వదిలివేసిన నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి సౌదీ అరేబియా సాయంతో ప్రపంచ బ్యాంకు నిధులు సాధించటంలో ఆయన చూపిన రాజకీయ చతురత, నాయకత్వ ప్రతిభ ఎంతోమంది విమర్శకుల ప్రశంసలు పొందింది.

ఖమ్మం జిల్లాలో కొన్ని వందల గ్రామాలకేకాక, కృష్ణాజిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, విస్సన్నపేట, నూజివీడు ప్రాంతాలకు సాగర్ ఎడమకాలువ ద్వారా నీటిని అందించారు. ఖమ్మం జిల్లాలో 16 మండలాల్లోని 230 గ్రామాల్లో 2.50 లక్షల ఎకరాలు సాగర్ జలాలతో సస్యశ్యామలం అయ్యాయి. అలాగే చర్ల మండలంలో ఆయన ప్రారంభించి, నిధులు సమకూర్చిన ప్రాజెక్టు ఇప్పుడు పూర్తయి సుమారు 50,000 ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తోంది.

అదే విధంగా రాయలసీమ ప్రాంతంలో సంజీవయ్య సాగర్, సుబ్బరాయ సాగర్, మైలవరం ప్రాజెక్టు, పెన్నహోబిలం, పెద్దేరు, కృష్ణ సాగర్ ప్రాజెక్టులు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూపొందినవే. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయ భవనం, ఇందిరాపార్క్, సంజీవయ్యపార్క్, రామకృష్ణ మిషన్, అందులోని మందిరాల సముదాయం జలగం వెంగళరావు హయాంలో రూపొందించినవే. 1977 నవంబరులో సంభవించిన దివిసీమ ఉప్పెన కల్గించిన నష్టాన్ని నివారించటంలో సహాయ పునరావాస కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయికి చొచ్చుకు పోయి వెంగళ రావు చేసిన సేవలు ఆయా గ్రామాల ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరు.

## కేంద్రమంత్రిగా....

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో (1986-89) విదేశీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి వారికి పలురకాల రాయితీలను ప్రకటించి మనదేశంలో పరిశ్రమలు స్థాపించేలా కృషి చేశారు. రూ. 50 కోట్లు మించని పెట్టుబడితో విదేశీ వ్యాపార వేత్తలు దేశంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా పరిశ్రమల స్థాపించదలిస్తే ప్రభుత్వం నుండి లైసెన్సు తీసుకోవలసిన అవసరం లేకుండా చేశారు.

ఒక సాధారణ పంచాయతీ గుమాస్తాగా తన జీవితం ప్రారంభించిన జలగం వెంగళరావు అనన్య సామాన్యమైన నాయకత్వ లక్షణాలు, దార్శనికత, అభివృద్ధి కాంక్షతో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవ చిరస్మరణీయం. వయో భారంతో క్రియాశీల రాజకీయాలకు దూరమైన ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నేటి తరంలోని పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు స్థానిక సమస్యల సాధనకు కృషి చేస్తే ప్రజల హృదయాలలో కలకాలం మిగిలిపోతారు.

*- డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్,*
*డిప్యూటీ డైరెక్టర్ (అకౌంట్స్) అపార్డ్*

# గర్భవతులకు తరచూ వచ్చే సందేహాలకు సమాధానాలు

**గర్భం ధరించిన ప్రతి స్త్రీకి పండంటిబిడ్డను కనాలని ఉంటుంది. తమ అలవాట్ల వల్ల గర్భస్థ శిశువుకు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడుతూ ఉంటారు. అందుకే వారికి ఎన్నో సందేహాలు వస్తూ ఉంటాయి. కొన్ని సందేహాలు అడగలేరు. మరికొన్ని అడగడానికి జంకుతారు. అందుకే ఈ సందేహాలు, సమాధానాలు రాస్తున్నాను.**

➻ కాఫీ, టీలు తాగడం వలన గర్భస్థ శిశువుపై ఏమైనా ప్రభావం ఉంటుందా ?



కాఫీ, టీలలో కెఫీన్ ఉంది. ఇది శరీరాన్ని ఉద్రేక పరుస్తుంది. ఒక మోతాదులో కాఫీ, టీ తాగడం వలన ఇబ్బంది ఉండదు. మోతాదు మించి కాఫీ, టీలు తాగడం వల్ల నిద్రలేమి, ఆవేశస్థాయి అధికంగా పెరగడం, నీరుడు అధికంగా వెళ్లడం జరుగుతుంది.

➻ గర్భిణీలకు ఉత్తమమైన ఆహారం ఏది ?

ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు తగిన పాళ్లలో గల ఆహార పదార్థాలు తింటే గర్భిణీకి, గర్భస్థ శిశువుకు మంచిది. క్రమం తప్పకుండా ఆకుపచ్చ కూరలు, కూరగాయలు, తాజా పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, పప్పుధాన్యాలు, బఠాణీ, గ్రుడ్లు, చేపలు తగిన మోతాదులో మాంసం తినమని సిఫార్సు చేస్తారు.

మరిగించిన నీరు చల్లార్చి తాగడం ఉత్తమం. అతిగా తినడం మంచిది కాదు. దీనివల్ల కొవ్వు పేరుకుపోయి, అధిక బరువు పొందుతారు. ప్రసవ సమయంలో ఎక్కువ కష్టపడవల సి వస్తుంది. ప్రసవానంతరం అధిక బరువు నుండి విముక్తి పొందడం అంత తేలిక కాదు.

➻ బయట తయారు చేసిన ఆహారం తినవచ్చా ?

బయట తయారు చేసిన ఆహారం కలుషితం కాబడి ఉండవచ్చు. వాటిలో ఉండే ప్రమాదకరమైన క్రిములు తల్లీ, బిడ్డల ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంటుంది. ఇంట్లో తాజాగా తయారు చేసిన ఆహార పదార్థాలను భుజించడం అలవరచుకోవాలి. కార్బోనేటెడ్ కూల్‌డ్రింక్స్ మంచిది కాదు.

➻ కంప్యూటర్, టి.వి. మైక్రోవేవ్ కుంపటి సమీపంలో గర్భిణీ ఉండవచ్చా?

ఈ విషయంపై పరిశోధకులు బాగా అధ్యయనం చేశారు. వీటికి - గర్భిణీకి ఎటువంటి సంబంధం ఉండదని తేల్చి చెప్పారు. ఏది ఏమైనప్పటికినీ, విద్యుత్ అయస్కాంత తరంగాలు ఉత్పత్తి చేసే ఈ పరికరాలకు కనీసం 2 అడుగుల దూరంలో ఉండడం క్షేమదాయకం.

➻ ధూమపానం, సెకండ్ హాండ్ స్మోకింగ్ వల్ల ప్రమాదం ఉంటుందా ?

ధూమపానం, సెకండ్ హాండ్ స్మోకింగ్‌ల ప్రభావం గర్భస్థ శిశువుపై ఉంటుంది. నెలలు నిండకుండా ప్రసవించడం, మానసికంగా ఎదగని శిశువుకు జన్మ నిచ్చే ప్రమాదాలు ఎదురవుతాయి. అందుచేత అసలు 'ధూమపానానికి' స్వస్తి చెప్పడం ఉత్తమం.

➻ చిన్న చిన్న అనారోగ్యాలకు గర్భిణీ సొంతంగా మందులు వేసుకోవచ్చా?

సొంతంగా మందులు వేసుకోవడం, గర్భస్థ శిశువుకు

ప్రమాదం. గర్భం ధరించిన సమయంలో ప్రమాద రహితమైన ఔషధాలు వాడాలి. వాటి గురించి వైద్యులకు తెలుస్తుంది. అందువల్ల సొంతంగా గాని, ఇతరుల సలహా మేర గాని మందులు వాడకూడదు. వైద్యుని సూచన మేర మాత్రమే వాడాలి.

**➥ రైలు, విమానాలపై గర్భిణీ ప్రయాణం చేయవచ్చునా ?**

దూర ప్రయాణాలు 6 నెలలు నిండక ముందు చేయడం మంచిది. 6 నెలలు నిండిన తరువాత దూరపు ప్రయాణాలకు వైద్యుని సలహా తీసుకోవడం ఉత్తమం.

**➥ గర్భిణీ సెక్సులో పాల్గొనవచ్చా ?**

వైద్యుడు వద్దని చెబితే తప్ప గర్భిణీ హాయిగా సంసార జీవితంలో పాల్గొనవచ్చు. తల్లి కడుపులో మంచి కుషనింగ్ నడుమ గర్భస్థ శిశువు ఉంటుంది. గర్భిణీ పొట్ట మీద అధిక ఒత్తిడి కలుగజేసే విధంగా ఉండకుండా సంసారం చేసుకోవచ్చు.

**➥ గర్భవతి ఇంటి పనులు యధావిధిగా చేసుకోవచ్చా ?**

ఎక్కువగా అలసిపోయే విధంగా ఇంటి పనులు చేయడం మంచిది కాదు. బరువైన పాత్రలు, పెద్ద పెద్ద నీళ్ల బకెట్‌లు ఎత్తకూడదు. గర్భవతి చురుగ్గా ఉండి తేలిక పాటి పనులు చేసుకుంటే ఆమె శరీరంలోని రక్త ప్రసరణ చక్కగా ఉంటుంది. ఒత్తిడి లేకుండా విశ్రాంతిగా ఉంటుంది.

**➥ గర్భవతి ఏ భంగిమలో పరుండి నిద్రించడం ఉత్తమం?**

మోకాళ్లు కొద్దిగా వంచుకుని ఒక పక్కకు తిరిగి పడుకుని నిద్రించడం మంచిది. ఇలా నిద్రించడం వల్ల గర్భస్థ శిశువులో రక్త ప్రసరణం బాగా అభివృద్ధి చెందుతుంది.

మంచం మీద పరుండి రిలాక్స్ అవుతున్నప్పుడు కాళ్ల మధ్య లేదా కాళ్ల కింద తలగడ పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లు తిరగటం వంటి సమస్యలు రావు.

**➥ ఒత్తిడి, ఆందోళన ప్రభావం గర్భం మీద ఉంటుందా ?**

ఒత్తిడి, ఆందోళన ప్రభావం గర్భస్థ శిశువు మీద ఉంటుందా ? ఉండదా అని చెప్పడం కష్టం. కాని వీటి వల్ల గర్భవతి పరిస్థితిలో మార్పు వస్తుంది. వాంతులు చేసుకునే రేటు పెరుగుతుంది. తలనొప్పి వస్తుంది. నిద్ర లేమి మొదలవుతుంది.

రిలాక్స్ కావడం నేర్చుకోవాలి. వీనులకు విందుగా ఉండే చక్కని సంగీతం వినాలి. మధురంగా ఉండే టి.వి. కార్యక్రమాలు చూడాలి. ఆందోళనల నుండి ఇవి విముక్తి కల్గిస్తాయి.

**➥ చేతి వేళ్ల గోళ్లు పొడవుగా పెంచుకోవచ్చా ?**

అవి క్రిములు దాగి ఉండేందుకు 'ఆధార కేంద్రాలుగా' పనికి వస్తాయి. మట్టి, మురికి వంటివి గోళ్ల కిందకి జేరి నిల్వ ఉంటాయి. అవి ప్రమాదకరమైన క్రిములకు నిలయాలుగా మారి మెల్లిగా శరీరంలోకి ప్రవేశించి హాని కల్గిస్తాయి. అందువల్ల గోళ్లు పొడవుగా పెంచుకోవద్దు.

**➥ జననాంగం వెలుపల మంట, దురద ఉంటే ప్రమాదమా ?**

జననాంగానికి బ్యాక్టీరియల్ లేదా ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ఉంటే ఇటువంటి లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు ముదిరి తెలుపు డిశ్చార్జి మొదలయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జననాంగానికి ఇన్‌ఫెక్షన్ క్రమంగా పెరిగితే, ముందు నెలల్లోన్లే ప్రసవం లేదా గర్భవిచ్ఛిత్తికి దారితీసే ప్రమాదం ఉంటుంది.

**➥ హైహీల్స్ లేదా మామూలు చెప్పులు ఏవి ధరించవచ్చు ?**

మామూలు చెప్పులే ధరించాలి. గర్భం ధరించడం వల్ల గరిమనాభి స్థానం మారిపోతుంది. ఇటువంటి స్థితిలో హైహీల్స్ వేసుకుంటే కింద పడిపోతారు. అందుకే అడుగు చదునుగా ఉండే చెప్పులు ధరించడం శ్రేయస్కరం.

**➥ కడుపు మీద సాగిన చారికలు రాకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలి ?**

కడుపు మీద నూనె, అందాన్ని పెంచే క్రిములు రాసుకోవడం వలన చర్మం మృదువుగా తయారవుతుంది. చర్మం మృదువుగా, మెత్తగా తయారయినంత మాత్రాన చారికలు లేకుండా కాపాడలేవు ఈ క్రీమ్‌లు.

చర్మానికి వారసత్వంగా వచ్చే లక్షణాలను బట్టి చారికలు ఏర్పడడం, ఏర్పడక పోవడం ఆధారపడి ఉంటుంది. కడుపు మీద మసాజ్ చేయించుకోవచ్చు.

## గర్భవతులు గమనించవలసిన మరికొన్ని అంశాలు

- ★ 25 ఏళ్ల వయసులో గర్భం వస్తే మంచిది. 16 ఏళ్ల వయసులో గర్భం ధరిస్తే తల్లీ - బిడ్డల ఆరోగ్యం ఆశించినంత బాగుండదు.
- ★ తక్కువ వయసులో గర్భం ధరించడం వలన గర్భస్రావాలు, తక్కువ బరువు గల పిల్లలు పుట్టడం, నెలలు నిండకుండా ప్రసవించడం వంటి సమస్యలు ఎదురవుతాయి.
- ★ నెలకొకసారి స్త్రీలలో అండం విడుదలవుతుంది. అలా విడుదల యిన అండం పురుష బీజకణంతో కలసి పిండంగా మారుతుంది.
- ★ సాధారణంగా స్త్రీ 28 రోజుల కొకసారి బహిష్టు అవుతూ ఉంటుంది. సక్రమంగా బహిష్టు అయ్యేవారికి తొలిరోజులతో లెక్క వేసుకుంటే 14 వ రోజున అండం విడుదల అవుతుంది.
- ★ అంటే 14 రోజులకు బహిష్టు అవుతారనగా అండం విడుదల అవుతుందని తెలుసుకున్నారు. అందరి విషయంలో ఇది ఒకేలా ఉండదు. కొందరి విషయంలో అండం విడుదల అనుకున్న రోజుకి రెండు రోజులు ముందుగాని, తరువాత గాని ఉండవచ్చు.
- ★ అండం విడుదలయ్యే రోజుల్లో దంపతులు దాంపత్య జీవితం గడిపితే గర్భం వచ్చే అవకాశాలు హెచ్చుగా ఉంటాయి.

## గర్భధారణ

మగవాని వృషణాలు వీర్యాన్ని విడుదల చేస్తాయి. స్త్రీ అండ కోశం 'ఓవా' అని పిలవబడే అండాన్ని విడుదల చేస్తుంది. పురుషుని వీర్యం ఓవాతో కలసి పక్వం అవుతుంది. ఇదే గర్భధారణకు మొదలు.

- ★ పిండం తొమ్మిది నెలల కాలంలో శిశువుగా ఎదిగి మానవ జననానికి దారి తీస్తుంది.
- ★ గర్భం ధరించగానే ఋతుస్రావం ఆగిపోతుంది. గర్భం ధరించిన ఒక మాసానికి పిండం తయారవుతుంది. వక్షోజాలు పెద్దవి కాబడి మరింత సున్నితంగా తయారవుతాయి.


★ పొత్తి కడుపు ముందుకు వచ్చి గుండ్రని పొట్టగా తయారవుతుంది.

★ గర్భిణిని తప్పనిసరిగా వైద్యుల సంరక్షణలో ఉండాలి.

★ గర్భిణీకి ఎక్కువగా విశ్రాంతి అవసరం. పెద్ద పెద్ద బరువులు మోయకూడదు. తేలికైన పనులు చేసుకుంటూ శరీరం చురుగ్గా ఉండేందుకు నడక వంటి వ్యాయామం చేయాలి.

★ గర్భిణీ ధూమపానం, సురాపానం చేయ కూడదు.

★ చనులు, చను మొనలు శుభ్రం చేసుకోవాలి. చను మొనల చుట్టూ కొద్దిగా నూనె రాసి రుద్దు కోవాలి. దీని వల్ల తల్లికి పాలివ్వడం, శిశువుకు పాలు తాగడం తేలిక అవుతుంది.




★ వైద్యులు సలహా ఇస్తే తప్ప మొదటి మూడు నెలల్లో గర్భిణీ ఎటువంటి మందులు తీసుకోకూడదు.

★ గర్భిణీ తనకు, తన కడుపులోని శిశువుకు కలిపి ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, కాయగూరలు, ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, కొవ్వు పదార్థాలు, పండ్లు తినడమే గాక జంతు సంబంధమైన పాలు, గుడ్లు, మాంసం కూడా తీసుకోవచ్చు.

★ గర్భంలోని శిశువు కదలికలు గర్భిణీకి తెలియనపుడు, పాదాలు, చేతులు ముఖం ప్రాంతాలలో నొప్పి కల్గి వాచినపుడు, తలనొప్పి, దృష్టి మసక మసకగా ఉండడం వంటి అవలక్షణాలు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

## ఆనందంగా గడపడం

★ గర్భం ధరించగానే వెంటనే ఒక గైనకాలజిస్టును సంప్రదించాలి. దీని వల్ల మానసికంగా ధైర్యం కల్గడమే గాక, క్షేమదాయకమైన ప్రసవానికి కావలసిన సలహాలు పొందగల్గుతారు.

★ గర్భవతిగా వున్న సమయంలో మరీ ఎక్కువ బరువు పెరిగి పోయే విధంగా ఆహారం తీసుకోకూడదు.

★ బరువు ఎక్కువయితే ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. గర్భవతి తన బరువుకన్నా ఎనిమిది నుండి పదికిలోల వరకు పెరిగితే ఫరవాలేదు.

★ మొదటి మూడు నెలల కాలంలో గర్భిణీకి అలసి పోతున్న భావం కలుగుతూ ఉంటుంది. దీనికి కారణం రూపం పోసుకుంటున్న కడుపులోని బిడ్డ కొంత పోషక పదార్థాన్ని ఉపయోగించుకోవడమే.

★ సాధారణంగా ఇంట్లో చేసుకునే పనులన్నింటినీ గర్భిణీ చేసుకోవచ్చు. అసౌకర్యంగా ఉండే పనులు చేయకూడదు.

★ సైకిలు తొక్కడం, ఈత కొట్టడం, బరువులు ఎత్తడం, అలసిపోయే సుదూర ప్రయాణాలు చేయడం వంటివి చేయకూడదు.

★ నెలలు ముదురుతూ ఉంటే గర్భిణీకి ఊపిరి అందడం ఒక్కొక్కప్పుడు కష్టం అవుతుంది. విశ్రాంతి తీసుకుంటే మామూలు పరిస్థితి వస్తుంది.

★ కడుపులో ఎదుగుతున్న బిడ్డ విభాజక పటలాన్ని నొక్కుతూ ఉంటాడు. అందువల్ల ఊపిరితిత్తులు స్వేచ్ఛగా కావలసిన పరిమాణానికి వ్యాకోచించక ఇలా ఊపిరి అందని స్థితి వస్తుంది.

## సిజేరియన్

★ కొంతమంది కొన్ని సందర్భాలలో ముందుగానే నిర్ణయించి సిజేరియన్ చేస్తున్నారు. యోని ద్వారా ప్రసవం అసాధ్యం అవుతుందని ముందుగానే డాక్టరు గమనించి చెప్పడం జరుగుతుంది.

★ పెల్విస్ చిన్నదిగా ఉండడం, గర్భాశయంలో బిడ్డ పెద్దగా ఎదగడం, లేదా కవలలు ఉండడం వంటి అసాధారణ పరిస్థితులు సిజేరియన్‌కు దారితీస్తాయి.

★ విరూపణ చెందిన పెల్విస్, మళ్లీ మళ్లీ రక్తస్రావం జరుగుతున్న వారి విషయంలో కూడా సిజేరియన్ చేస్తారు.

★ తల్లికి మృత శిశు జననం జరిగిన చరిత్ర వున్నా, గర్భాశయంలో ట్యూమర్ ఉండి జననేంద్రియం ద్వారా ప్రసవం అనుకూలించదని తెలిసినపుడు సిజేరియన్ చేస్తారు.

★ ప్రసవం కోసం గర్భిణీని లేబర్ రూంలోకి తీసుకు వెళ్లిన తరువాత గర్భాశయం గోడలు ముడుచుకునే తరచుదనం పెరుగుతూ ఉంటుంది. బలంగా కూడా ఉంటుంది. ఈ రెండింటి ఫలితంగా బిడ్డ బయటకు వస్తుంది. ముడుచుకోవడం బలహీనంగా ఉండి మందులు ఇచ్చినా ఏ విధంగానూ ప్రయోజనం లేకపోతే, ఎమర్జెన్సీగా గుర్తించి సిజేరియన్ చేస్తారు.

★ లేబర్ సమయంలో, బిడ్డకు ఊపిరాడని పరిస్థితి తయారవుతోందని వైద్యుడు భావిస్తే అర్జెంటుగా శస్త్రచికిత్స చేస్తారు.

*- సి.వి. సర్వేశ్వర శర్మ*

# అప్పుడు గంగిరెద్దే జీవనం !
# ఇప్పుడు చిన్న ఊటకుంటే జీవితం !!

**గత వారం రోజులుగా చిత్తప్ప మనసేం బాగాలేదు. ఏదో రెండు మెతుకులు మింగుతున్నాడు. అది కూడా యాంత్రికంగా. ఎవ్వరితోనూ సరిగా మాట్లాడటమేలేదు. కంటినిండా కునుకులేదు. కడుపునిండా తిండి తినడం లేదు. అతని చింత అంతా తన 'జుంజప్ప బసవ' (గంగిరెద్దు) గురించే. దానికేదో పెద్ద రోగమే వచ్చినట్టుంది. అసలు మేత మేయడం లేదు. పశువుల వైద్యుడికి చూపించాడు. ఏమీ చెప్పలేకపోయాడు వైద్యుడు. అసలు 'జుంజప్ప బసవ''ని ఎద్దు అనడం అంటే తన పెద్దకొడుకు అనడమే బాగుంటుంది. ఆ ఎద్దుతో 18 ఏళ్ల అనుబంధం మరి !**

పుండు చిత్తప్ప జీవతమే చిత్రమైన మలుపులు తిరిగింది. నింగమ్మతో పెండ్లి అయినాక ఇద్దరు మగ పిల్లలు చిత్రలింగ, కరియప్పలు కలిగారు. పెద్దవాడు ఎప్పుడూ రోగిష్టే. రెండోవాడు ఎదకూ, వీపుకూ గూని కలిగిన వికలాంగుడు. సొంతానికంటూ సెంటు భూమిలేదు. ఏదో కూలీ నాలీ చేస్తూ కుటుంబాన్ని లాక్కొస్తున్నారు చిత్తప్ప, నింగమ్మలు. సరిగ్గా ఇలా ఉంటున్న సమయంలో, 18 సంవత్సరాల కిందటి మాట ఇది.

ఒక రోజు వాన వస్తూ వుంది. మిద్దె ఎక్కి గవాక్షం మూసి రావడానికి మెట్లెక్కి మీదకి చేరాడు. గవాక్షాన్ని మూశాక మిద్దె దిగుతూ ఎట్లా జారాడో తెలీదు. కిందికి దబ్బున పడ్డాడు. కుడి చేయి విరిగింది. నాటు వైద్యాన్ని నమ్ముకుని కట్టు కట్టించుకున్నాడు. రెండు నెలల తర్వాత, గాయమైతే బాగయిందిగానీ, కుడి చేయి పనికి రాకుండా పోయింది. ఎంత అంటే అన్నం తినేందుకు కూడా ఆ చెయ్యి నోటి వరకూ పోయేదికాదు. అతను పుట్టుకతో వికలాంగుడు కాదు. కానీ జీవితం మధ్యలో ప్రమాదం వల్ల వికలాంగుడయిపోయాడు. కూలీ నాలీ చేయడానికి అసలు పనికి రాడన్నమాట. మొత్తం కుటుంబ భారం అతని భార్య నింగమ్మపై పడింది.

ఆ ఊర్లో ఒక ఆచారముంది. అదేమిటంటే, తమకు వచ్చిన జబ్బు బాగయిపోతే జంగమ దేవరకి ఒక కుర్రని విడుస్తారు. అది దేవునిపోతుగా ఏ చేన్లో మేసినా, ఏ దొడ్లో పడి మేసినా ఎవరూ ఏమీ అనరు. అలా విడిచిన ఎద్దుని 'జుంజప్ప బసవ' అంటారు కన్నడ భాషలో. తెలుగులో అయితే అది 'దేవర ఆంబోతు'. ఆ ఎద్దుని తనే జుంజప్ప బసవగా పెంచుకొంటూ, గంగిరెద్దులాగా తయారుచేసి ఊరూరా తిరిగి బసవ పురాణాన్ని ప్రచారం చేస్తానని, ఆ ఎద్దు యజమానులతో చెప్పి తెచ్చుకొన్నాడు. చుట్టు ప్రక్కలున్న అన్ని ఊర్లకి తన గంగిరెద్దుతోపాటు పోయినాడు. ప్రతి గుమ్మం వద్దా యాచించాడు. పెట్టని ఇల్లు లేదు. అడుక్కున్న ఊర్లో ఆ రాత్రికి బసవడి గురించి పురాణం జానపద రూపంలో పాడేవాడు. ఇల్లు గడిచింది. నాలుగు రాళ్ల వెనకేసుకొన్నాడు.

అట్లా 18 సంవత్సరాలు గడిచిపోయినాయి. ఆర్థికంగా అంతో ఇంతో నిలదొక్కుకోగలిగాడు. ఆరు సంవత్సరాల కిందట తను దాచుకున్న డబ్బు అంతా లెక్క చూస్తే రూ.80,000 లు అయింది. ఊరికి కొంత దూరంలో ఒక రాతి గుట్ట కింద ఉన్న 2.00 ఎకరాల మెట్ట భూమిని ఆ డబ్బును పోసి కొన్నాడు. అయితే దానికి నీటి వనరు లేదు. కొనడమయితే కొన్నాడు గానీ, దాన్ని సాగు ఎలా చేసుకోవాలో తెలీలేదు. వానలు రాకపోవడంతో తిరిగి గంగిరెద్దునే ఆశ్రయించాడు. ఇప్పుడు ఆ ఎద్దు కదలలేని స్థితిలో ఉంది. అందుకే ఆందోళనతో అతనికి కాలూ, చెయ్యీ ఆడ్డంలేదు.



**జాబ్‌కార్డు నెం. 40136**

| | | |
|---|---|---|
| రైతు పేరు | : | పుండు చిత్తప్ప (62 సంవత్సరాలు) |
| భార్యపేరు | : | పుండు నింగమ్మ (50 సంవత్సరాలు) |
| కులం | : | గొల్ల (బీసీ) |
| గ్రామం | : | గోవిందాపురం |
| గ్రామపంచాయితీ | : | దిగువ గొల్లహట్టిభీ |
| మండలం | : | మడకశిర |
| జిల్లా | : | అనంతపురం |
| సమాచార సేకరణ తేది | : | 20.10.2012 |

సరిగ్గా ఇట్లా ఉన్న సమయంలో ఒకరోజు వాళ్ళింటికి క్షేత్ర సహాయకుడూ, సాంకేతిక సహాయకుడూ వచ్చారు. చిత్తప్ప పొలంలో చిన్న ఊటకుంట తవ్వితే కలిగే లాభాల గురించి తెలిపారు. ఆనందంగా ఒప్పుకున్నాడతను. ఆరు నెలల కిందట చిన్న ఊటకుంట తవ్వుతున్నప్పుడే నీళ్లు ఊరాయి. చిత్తప్ప ఆనందానికి మేరలేదు.

ఆ చిన్న ఊట కుంటకి ఒక చిన్న ఏతాన్ని ఏర్పాటు చేసుకొని 25 సెంట్లలో కాయగూరలు పండిస్తున్నాడు. ఒంటి చేత్తో పారని పట్టుకుని పొలంలో కయ్యలు చేశాడు. ఉపాధి హామీ పనులయిన చెరువు కట్టమన్ను తోలడంతో ఆ పొలం సారవంతంగా మారింది. వరి పెట్టాల నే ప్రయత్నంలో ఉన్నాడు.

"నన్ను మొదట మనిషిగా నిల బెట్టంది నా గంగిరెద్దు. ఇప్పుడు నా కుటుంబాన్ని, నన్ను ఆదుకుంటున్నది ఈ చిన్న ఊటకుంటే !'' అంటూ సంతోషంగా చెబుతాడు చిత్తప్ప.

**- చిలుకూరి దేవపుత్ర,** *డి.డబ్ల్యు.ఎం.ఏ. అనంతపూర్*

# రేయింబవళ్ళు జరుగుతున్న రైవస్ కాల్వ ఆధునికీకరణ పనులు

**డెల్టాలో సాగునీటి సదుపాయాలు మెరుగు పరచటానికి, మురుగు నీటి పారుదల సౌకర్యాలు కల్పించటానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది. ప్రభుత్వం ఆశించిన విధంగా డెల్టాలో సాగునీటి, మురుగు నీటి కాల్వల త్రవ్వకం పూర్తయితే కృష్ణా డెల్టా అన్నపూర్ణ అన్న ఖ్యాతిని నిలబెట్టుకొంటుందనటంలో సందేహం లేదు.**

గత ఏడాది మే నెలలో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి యస్.కె. జోషి స్వయంగా కృష్ణా జిల్లాకు విచ్చేసి, కృష్ణా జిల్లాలో ఆధునికీకరణ పనులు పరిశీలించారు. ఆ సమయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆధునికీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న కృష్ణా జిల్లా కలక్టరు బుద్ధ ప్రకాష్ స్వయంగా ఆధునికీకరణ పనులను పరిశీలించారు, సత్వరమే పనులు పూర్తి చేసి డెల్టా రైతులకు నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైవస్ కాల్వ వెంట కొంత దూరం నడచి, పనులను పర్యవేక్షించారు.

డెల్టా ఆధునికీకరణలో భాగంగా గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా కృష్ణాజిల్లాలోని రైవస్ కాల్వపై దాదాపు 200 కిలోమీటర్ల పొడవున ఆధునికీకరణ పనులు జరగాల్సి వుంది. సుమారు 3.3 లక్షల ఎకరాలకు ఈ రైవస్ కాల్వ సాగు నీరందిస్తుంది. పంట కాల్వలు పూడుకుపోయి, కాల్వ చివరి భూములకు సకాలంలో నీరందక కొన్ని భూములను బీళ్ళుగా వదిలేయాల్సిన దుస్థితి నెలకొంటున్నది. నాట్లు అనంతరం కురిసిన వర్షాలకు నాట్లు ముంపునకు గురై, దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించి, ఆధునికీకరణకు సిద్ధమైంది. సుదీర్ఘ ప్రణాళిక రూపొందించి, నిధులను పుష్కలంగా విడుదల చేసింది.

ఉన్నతాధికారుల అజమాయిషీలో రైవస్ కాల్వ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కాల్వ మొదట్లో 2.83 కిలో మీటర్లు విజయవాడలో వుంది. 2.8 నుంచి 3.66 కిలోమీటర్ల వరకు మూడు బిట్‌లుగా కాంట్రాక్టులు తీసుకొన్నారు. మూడు జిల్లాల్లో ఆధునికీకరణ పనులు జరుగుతుంటే, వాటన్నింటిలో కృష్ణా జిల్లాలోని రైవస్ కాల్వ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఉన్నతాధికారులు సైతం అభిప్రాయపడటం గమనార్హం. అక్కడ పనితీరును తిలకించిన ఎవరైనా అదే అభిప్రాయపడటం సహజం. వందల మంది నిపుణులు, వందల సంఖ్యలో కార్మికులు, వందల వాహనాలు రాత్రింబవళ్ళు పనిచేయటం నెలల తరబడి కొనసాగుతున్నది. రైవస్ కాల్వపై పనులు జరుగుతున్న మూడు బిట్‌లకు తొలిదశ అంచనా రూ. 155 కోట్లు.

### సుందేరు వద్ద కోలాహలం

రైవస్ కాల్వపై ఆధునికీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్న సుందేరు గ్రామం వద్ద కోలాహలం కనపడుతోంది. అక్కడ పుట్టి పెరిగిన వారికి కూడా, అక్కడ జరుగుతున్న పనులు ఆశ్చర్యం కలిగించక మానవు. అత్యాధునిక మిక్సర్ యంత్రాలు, తాడిచెట్ల ఎత్తులో ఇసుక, కంకర గుట్టలు, వచ్చిపోయే వాహనాల రణగొణ ధ్వనుల సరికొత్త దృశ్యాలను సరికొత్త అక్కడి ప్రజలకు అందిస్తున్నాయి--. ఆధునికీకరణలో భాగంగా రైవస్ కాల్వకు రెండు వైపులా సుమారు రెండు మీటర్లు స్లాబ్ నిర్మించి, దీనిపై సుమారు 5 మీటర్ల ఎత్తున ఇనుప బద్దెలు వేసి, ఇసుక కంకర సిమెంటు మిశ్రమాలతో బలమైన గోడని నిర్మించాలి. అటు తర్వాత విజయవాడ నుంచి లక్ష్మీపురం బంటుమిల్లి మండలం వరకు వెడల్పాటి రహదారిని ఏర్పాటు చేయాలి. (సుమారు 200 కిలోమీటర్లు) ఇందుకోసం లక్షల టన్నుల ఇసుక, కంకర, వేల టన్నుల సిమెంట్ అవసరమన్న విషయం నిర్వివాదాంశం. అందుకే అంత పెద్ద ఎత్తున ఇసుక, కంకరలను కాంట్రాక్టర్లు నిల్వ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ పనుల పరిశీలనకు వచ్చినపుడు కాంట్రాక్టు ఇంజనీర్ల అభ్యర్థన మేరకు ఇసుక సరఫరా విషయంలో సందేహం వద్దని, అవసరం మేర పర్మిట్లు ఇస్తానని, పనులు సత్వరమే పూర్తి చేయమని కలక్టర్ సూచించారు.

### మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణం

రైవస్ కాల్వపై ఆధునికీకరణ పనుల కోసం సుందేరు వద్దనే కేంద్రం ఏర్పాటు చేసి, పనులు కొనసాగిస్తున్నారు. అక్కడే ఒక మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అక్కడికి తూర్పున కడప కొల్లు వరకు, పడమర కోమటి గుంట వరకు పనులు నిర్వహించాల్సి ఉన్నందున. మధ్యలో మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయినా, అవసరాల మేరకు మిక్సింగ్ ప్లాంటు నుంచి మిక్చరు (ఇసుక, కంకర, సిమెంటుల మిళితం) అందలేక పోవటం వల్ల పలువాహనాల ద్వారా మిక్చరు తెప్పించి పనులు కొనసాగిస్తున్నారు. రోజుకు వందల టన్నుల ఇసుక, కంకర వస్తూనే ఉన్నాయి. ఖర్చయిపోతూనే ఉన్నాయి. పనులు జరిగే ప్రదేశానికి అవసరమైన ఇనుపరాడ్‌లు, జేరవేయటానికి, ఇసుక రవాణా చేయటా నికి స్థానికంగా వున్న 30 ట్రాక్టర్లు రాత్రింబవళ్ళు అద్దెకు పనిచేస్తూనే వున్నాయి. కార్మికుల నివాసాల కోసం గుడారాలు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా కార్మికులను రప్పించి, పనులు చేయిస్తు న్నారు. వివిధ భాషలు మాట్లాడే కార్మికులు అక్కడ మనకు కనిపిస్తారు.

### స్పందించిన కలక్టర్

కలెక్టర్ పనులు పరిశీలనకు వెళ్ళినపుడు దుస్తుల నీడలో నిద్రపోతున్న పసిపాపలను చూసి స్పందించారు. తల్లిదండ్రులు పనులు చేసుకొంటూ, పసిపిల్లలను (అయిదారు నెలల వయస్సు వారు) గుడ్డ పరచి, మరో దుప్పటి కర్రల మీద వేసి నీడ అందిస్తున్న దృశ్యం చూసిన కలెక్టర్ స్పందించి, పసివాళ్ళకు నీడ కల్పించడానికి షామియానాలు వేయాలని ఆదేశించారు. పలు భాషల కార్మికులు, పలు ప్రాంతాల కార్మికులు అక్కడ పనులు చేస్తున్నప్పటికీ, కాఫీ, టిఫిన్, భోజనాలకోసం ఒక్కరు కూడా బయటకు వెళ్ళాల్సిన అవసరం లేదు. కార్మికుల టెంట్‌ల వద్ద, మిక్సర్ ప్లాంటుకు సమీపంలో క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయటంతో వారికి ఎంతో ఉపయోగంగా వుంది. సకాలంలో పనులు పూర్తయితే రైతులు మరింతగా సంతోషిస్తారు.

**- దాసరి ఆళ్వార్‌స్వామి**

# విజ్ఞానం నా దేవుడు - పని నా మతం

**కా**వేరి నదీ తీరాన తిరుచిరాపల్లిలో 1888 సంవత్సరం నవంబర్ 7వ జన్మించారు సి.వి.రామన్. చంద్రశేఖరయ్య, పార్వతమ్మల రెండవ సంతానం చంద్రశేఖర వెంకటరామన్. వీరి తల్లిదండ్రులు ఉద్యోగార్థం విశాఖకు వెళ్ళారు. వీరి తండ్రి వి.వి.యన్. కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు. కాలేజ్ ప్రిన్సిపాల్ వద్ద ఇంగ్లీషును, తండ్రి వద్ద భౌతిక, గణిత శాస్త్రాలను రామన్ వంటబట్టించుకున్నారు.

12వ ఏట మెట్రిక్యులేషన్ - ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు.

1905వ సంవత్సరంలో బి.ఎ. మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయి- గోల్డ్ మెడల్ సాధించారు.

1907వ సంవత్సరంలో యం.ఏ. మొదటి శ్రేణిలో పాసయ్యారు.

1907వ సంవత్సరంలోనే ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసులో ఎంపికయ్యారు.

వీరికి భౌతిక శాస్త్రం, భూగర్భ శాస్త్రం, జీవ శాస్త్రం మీద అమితమైన ఇష్టం. వీరి పరిశోధన ముఖ్యంగా ధ్వని, కాంతి, రాళ్ళు, పక్షులు, క్రిమి కీటకాలు, వాయువు, వాతావరణం మీద సాగింది. ముఖ్యంగా వీరిని అమితంగా ఆకర్షించినవి 'ధ్వని - కాంతి'. వివిధ రకాల ఇసుక, రాళ్ళు, జాతి రత్నాలు, వజ్రాలు, రంగులు వెదజల్లే రాళ్ళు, అగ్ని పర్వతాల నుండి వచ్చిన లావా వల్ల కరిగిన రాళ్ళు, మట్టి మొదలైన వాటి మీద వీరి ప్రయోగాలు జరిగాయి.



**నోబెల్ బహుమతి, భారతరత్న అవార్డుల గ్రహీత**
**సర్.సి.వి.రామన్**

18 సంవత్సరాల వయసులోనే 'ధ్వని' మీద వీరు పరిశోధించిన అంశాలు. 'ఫిలసాఫికల్ మ్యాగ్జైన్-ఇంగ్లండు' లో ప్రచురింపబడ్డాయి. 19 సంవత్సరాల వయసులోనే ఉన్నత ఉద్యోగమైన అసిస్టెంట్ అకౌంటెంట్ జనరల్ పోస్టులో కలకత్తాలోని ఏ.జి. ఆఫీసులో చేరారు.

ఆ కాలంలో మన దేశం శాస్త్ర పరిశోధనలు, సాంకేతిక పరిశోధనలు జరపడానికి అనువుగా వుండేది కాదు. రామన్ ప్రతి క్షణం తన పరిశోధనలకు కావలసిన లేబోరేటరీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో కలకత్తాలోని ఆఫీసు నుండి ఇంటికి పోయే దారిలో 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్' సంస్థను చూశారు. దీనిని డాక్టర్ మహేంద్రలాల్ సర్కిల్ స్థాపించారు. ఇక్కడ పరిశోధనలు చేసుకోవడానికి పాత ఇన్‌స్ట్రుమెంట్స్ అందుబాటులో ఉండి, స్థలం సువిశాలంగా వుండడంతో వీరు పగలు ఉద్యోగం, రాత్రిళ్ళు పరిశోధనలు తీవ్రంగా చేశారు. ఒక్క నిమిషం కూడా వృధా చేసే వారు కాదు.

1916లో కలకత్తా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో భౌతిక శాస్త్ర ఆచార్య పదవిని పొందారు. 1917లో ఇండియన్ సైన్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఇంగ్లండులో స్థిరపడి పరిశోధనలు చేస్తున్న భారతీయులు కొందరు 'రామన్' ప్రతిభ విని వారు కూడా వచ్చి, వీరితో పరిశోధనలలో పాలు పంచుకున్నారు.

1909 నుండి 1910 వరకు బర్మా రాజధాని రంగూన్‌లో ఉద్యోగం నిర్వహించారు.

1921 సంవత్సరం ఆక్స్‌ఫర్డ్‌లో జరిగిన విశ్వవిద్యాలయాల మహాసభలకు హాజరై వచ్చిన తరువాత (స్కాటరింగ్ ఆఫ్ లైట్) ద్రవ్యాల కాంతి ప్రసారం పైన పరిశోధనలు చేశారు. ఒక వైపు కాలేజి, ఒక వైపు పరిశోధనలను తీవ్రంగా చేసేవారు.

ఒక నిర్దిష్ట తరంగ దైర్ఘ్యం గల కాంతిని బెంజిన్ అనే రసాయనిక పదార్థం ద్వారా పంపినప్పుడు వెలుపలికి వచ్చిన కాంతి పుంజం అంతా ఒకే రకంగా గాక వివిధ తరంగదైర్ఘ్యాలు గల కాంతిని ద్వివర్ణాత్మక కాంతి చైతన్యంగా గుర్తించారు.

## రామన్ ఎఫెక్ట్

వీరు మధ్యధరా సముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు సముద్రపు నీటికి గల నీలం వర్ణం ఎందుకుంటుందో కనుగొన్నారు. సముద్రపు నీరు తనపై పడిన సూర్యకాంతిని చెల్లాచెదురు చేసినప్పుడు - వికిరణం చెంది కాంతి స్వభావం జలంలోని అణువుల స్వభావాన్ని అనుసరించి వుంటుందని కనుగొన్నారు. విద్యుదయస్కాంత తరంగాలు అనుసరించే నియమాలనే కాంతి తరంగాలు కూడా అనుసరిస్తాయని కనుగొన్నారు. (విద్యుదయస్కాంత తరంగాలను క్రాంప్టన్ కనుగొన్నారు) ఇది 'రామన్ ఎఫెక్ట్' గా ప్రపంచ ప్రసిద్ధి చెందినది. ఇందుకు గాను వీరికి 'నోబెల్' బహుమతి లభ్యమైంది.

రామన్ లండన్‌లోని సెయింట్ పాల్స్ చర్చిని దర్శించినప్పుడు చర్చి టవర్ మీద నుండి వచ్చిన గంటల (చప్పుడు) ధ్వని-చుట్టూ వ్యాపిస్తుందని గమనించి, ధ్వనిపై వీరు ఇంకా శ్రద్ధగా పరిశోధనలు చేశారు.

వీరు పరిశోధనాలయం కోసం విదేశాల నుండి పరిశోధనకవసరమైన కొన్ని పరికరాలు తెప్పించుకున్న ల్యాబ్‌లోనే విద్యార్థుల చేత చాలా పరికరాలు తయారు చేయిస్తూ వారిని ప్రోత్సహించేవారు.

తన పరిశోధనలన్నీ ప్రకటించడానికి అనుకూలంగా వుంటుందని 1926 సంవత్సరంలో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిజిక్స్‌ను వీరే ఏర్పాటు చేసుకొన్నారు. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న తరువాత ప్రపంచ పరంగా దాదాపు 18000 పరిశోధనా వ్యాసాలు వచ్చాయి. 2500 రసాయనిక మిశ్రమాలపైన అభ్యాసాలు జరిగాయి. ఆ శతాబ్దిలోని మూడవ దశకంలో ఇది అతిపెద్ద 'కనిపెట్టబడిన' అంశమైంది.

వీరు మహామేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి. కాంతి, ధ్వని పరిశోధనలకే గాకుండా, ఎక్సరే కిరణాల మీద, అయస్కాంత కాంతి, పూర్వ నీలలోహిత కిరణాల మీద పరిశోధనలు చేశారు. 1927లో జర్మన్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఫిజిక్స్ ప్రకటన ప్రకారం, వీరు మాత్రమే ధ్వని మీద పరిశోధన చేయడానికి జర్మన్‌కు వెళ్లిన ప్రథమ వ్యక్తి అని. అప్పుడు ఇండియా నుండి జర్మన్ వెళ్ళారు.

1930లో వీరు భౌతిక శాస్త్రంపై చేసిన పరిశోధనలకు గాను 'స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్' వారు అతి గొప్ప అవార్డ్ 'నోబెల్' బహుమతి ఇచ్చారు. ఆ శతాబ్దంలో అప్పటివరకు ఏ ఇండియన్, లేదా ఆసియా దేశస్థులు ఆ అవార్డు పొందలేదు. రామన్ ఒక మెర్క్యురీ ఆర్క్ దీపాన్ని, స్పెక్ట్రోస్కోప్‌ని వుపయోగించి, కాంతి ద్రవ, ఘన, వాయు పదార్థాల గుండా ప్రయాణించినప్పుడు స్పెక్ట్రోగ్రాఫ్ సాయంతో చేసిన పరిశీలనలో కొత్త రేఖలు కన్పించి మాతృ రేఖల నుండి విడిపోవడాన్ని ధృవీకరించుకున్నారు.

1934 సంవత్సరంలో వీరి సేవలను గుర్తించి అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న అవార్డును భారత ప్రభుత్వం ఇచ్చి గౌరవిచ్చింది. 1934 సంవత్సరంలో మైసూర్ ప్రభుత్వం 24 ఎకరాల భూమిని వీరి ప్రయోగశాలకు కేటాయించింది. సైంటిఫిక్ రీసెర్చి సెంటర్ కావాలన్న వీరి కోరిక నెరవేరింది. ఇదే రామన్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్. వీరు 83 సంవత్సరాలు వచ్చినంత వరకు విజ్ఞానం పెంపొందించే పరిశోధనలు చేశారు.

## అవార్డులు, గౌరవాలు

- ★ 1924లో ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ వారు రామన్‌ను తమ సభ్యుడిగా ఎన్నుకున్నారు.
- ★ 1929లో ఆంగ్ల ప్రభుత్వం 'నైట్ హుడ్'తో సత్కరించింది. గ్లాస్కో విశ్వవిద్యాలయం బంగారు పతకాలు, గౌరవ బిరుదులిచ్చింది.
- ★ ఇండియాలో కలకత్తా, మద్రాసు, బొంబాయి, కాశీ, ఉస్మానియా విశ్వ విద్యాలయాలు గౌరవ పట్టా ఇచ్చి సత్కరించాయి.
- ★ 1929లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు అధ్యక్షులయ్యారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు శాశ్వత అధ్యక్షులుగా వున్నారు.
- ★ 1934లో భారత రత్న అవార్డు పొందారు.
- ★ యు.యస్.యస్.ఆర్. నుండి లెనిన్ అవార్డు పొందారు.
- ★ ఫ్రీబర్గ్-జర్మని, గ్లాస్‌గో-ఇంగ్లండు, పారిస్- ఫ్రాన్స్ విద్యాలయాలు గౌరవ పట్టాలు ఇచ్చాయి.
- ★ ఇండియన్ కెమికల్ సొసైటీ, ఇండియన్ మాథమాటికల్ సొసైటీలలో గౌరవ సభ్యత్వముంది.
- ★ టాటా ఇన్‌స్టిట్యూట్ బెంగుళూరుకు డైరెక్టర్‌గా ఉన్నారు. తరువాత కాలంలో ఈ సంస్థ స్ఫటికాలపై పరిశోధన చేసే వారికి ప్రధాన కేంద్రమైంది.
- ★ 1934లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ స్థాపించారు. దీనికి రామన్ పరిశోధనా సంస్థగా పేరు పెట్టారు.
- ★ 1941లో అమెరికన్ ఆప్టికల్ సొసైటీ 'నేషనల్ ప్రొఫెసర్ ఆఫ్ ఇండియా'తో సత్కరించింది.
- ★ 1951లో ఫ్రాంక్లిన్ ఇన్‌స్టిట్యూట్ 'ఫ్రాంక్లిన్' మెడల్ ఇచ్చింది.
- ★ 1957లో ఇంటర్‌నేషనల్ లెనిన్ అవార్డు వచ్చింది.
- ★ 1961లో మెంబర్‌షిప్ ఆఫ్ పొలిటికల్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఇచ్చారు.


వీరు భగవంతుని గూర్చి ఎక్కువ ప్రస్తావించేవారు కాదు. క్రొత్త విషయాలు కనిపెట్టడమే భగవంతునికి ఉనికి అని భావించే వారు. 'విజ్ఞానమే భగవంతుడు -పనే మతం' అనే సూత్రం వీరిది. వీరు ఒక్క క్షణం కూడా దుర్వినియోగం చేసేవారు కాదు. గంటలు గంటలు ఉపన్యాసాలు వినే బదులు లాబొరేటరీలలో ఎక్కువ సమయం గడపమని విద్యార్థులకు సూచించేవారు.

ఎవరి ప్రోద్బలం లేకనే శాస్త్ర క్షేత్రంలోకి బాల్యంలోనే ప్రవేశించిన వీరిని ఆకర్షించిన విషయం 'ధ్వని-వెలుగు'ల రహస్యాలే. వీటిని వెలికి తీయడమే జీవిత ధ్యేయంగా సాగింది వీరి జీవితం. ప్రపంచ శాస్త్ర రంగంలో ఒక ఉన్నతమైన స్థానం మనదేశానికి రావడానికి కారణం వీరి మేధస్సే.

యువ శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వటమే కాక, భారతదేశంలో రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ల స్థాపనకు వీరు కారకులు. శాస్త్ర విజ్ఞాన సాంప్రదాయం ఇండియాలో నెలకొనడానికి వీరే గొప్ప ప్రేరకులు. వీరికి 'సర్' అనే బిరుదు ఇచ్చి సత్కరించడం ఎంతో ఔచిత్యం.

*- ఎస్. రాజేశ్వరమ్మ, ఎం.పి.డి.ఓ.,*
*చిత్తూరు జిల్లా*

# జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవ సందర్భంగా స్మరించుకోవలసిన బల్వంత్ రాయ్ మెహతా



**గాంధీజీ తపించిన గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయటానికి 1952 నాటి కమ్యూనిటి డెవలప్‌మెంట్ ప్రాజెక్టు నుండి 1992 నాటి రాజ్యాంగపు 73 వ సవరణ వరకు స్వాతంత్ర్యానంతర భారత ప్రభుత్వాలు వివిధ ఘట్టాలలో చేసిన అనేక ప్రయత్నాల ఫలితంగా రాజ్యాంగ భద్రతతో కూడిన నేటి పంచాయితీ రాజ్ వ్యవస్థ నెల కొన్నది. ఏప్రిల్ 24, 1993 తేదీన అమలులోకి వచ్చిన 73 వ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ భద్రత ఇవ్వడం జరిగింది. ఈ చట్టంలోని ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.**

- ఈ వ్యవస్థ పునాది రాళ్ళుగా గ్రామ సభలు.
- మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థ.
- ఎన్నికల ద్వారా ఈ వ్యవస్థలో సభ్యుల భర్తీ.
- ఈ వ్యవస్థలోని సభ్యులు / అధ్యక్షులలో మూడింట ఒక వంతుకు తగ్గకుండా మహిళలు ఉండేట్టుగా స్థానాలు కేటాయించడం.
- పంచాయితీ రాజ్ వ్యవస్థకు ఎన్నికలు నిర్వహించటానికి ప్రతి రాష్ట్రంలో ప్రత్యేకంగా రాష్ట్ర ఎన్నికల కమీషన్‌ను ఏర్పాటుచేయటం.
- పంచాయితీల ఆర్థిక స్థితిగతులను బలపరిచేందుకు తగిన సూచనలివ్వడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేయటం.
- పంచాయితీలు ముఖ్యపాత్ర నిర్వహించాల్సిన 29 అంశాలతో కూడిన నమూనా జాబితా.

ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని గుర్తుంచుకొని తద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాలను మెరుగు పరిచేందుకు జాతి పునరంకితమయ్యే ఉద్దేశ్యంతో ఏప్రిల్ 24 తేదీని జాతీయ పంచాయితీ రాజ్ దినంగా పరిగణించటం జరుగుతోంది.

ఈ వికాస చరిత్ర గతిలో ఒక విధంగా చెప్పాలంటే నేటి పంచాయితీ రాజ్ వ్యవస్థకు బీజాలు వేసింది బల్వంత్ రాయ్ మెహతా కమిటీ నివేదిక అని చెప్పవచ్చు. నాటి కమ్యూనిటి డెవలప్‌మెంట్ ప్రాజెక్టు జాతీయ విస్తరణా కార్యక్రమాలు ఏ మేరకు గ్రామీణాభివృద్ధికి దోహద పడ్డాయో అధ్యయనం చేసి వాటి మెరుగుదల కోసం తగిన సూచనలతో నివేదిక సమర్పించటానికి 1957 జనవరిలో బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని భారత ప్రభుత్వం నియమించింది.

అధ్యయనం తరువాత 1957 నవంబరులో సమర్పించిన తన నివేదికలో ఈ కమిటీ నిజమైన గ్రామ వికాసం నిలదొక్కుకోవాలంటే ప్రణాళికల రూపకల్పన, ఆమోదాలు, కార్యాచరణలలో గ్రామీణ ప్రజల భాగస్వామ్యం తప్పకుండా ఉండాలని నొక్కి చెబుతూ వివిధ సూచనలు చేసింది. వాటిలో ముఖ్యమైనవి.

- ఎన్నుకోబడిన సభ్యులతో గ్రామ పంచాయితీ, పంచాయితీ సమితి, జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేయటం.
- సభ్యుల పదవీకాలం 5 సంవత్సరాలు.
- వ్యవసాయం, త్రాగునీరు, రహదారుల నిర్మాణం, చిన్నతరహా స్థానిక పరిశ్రమలు ఇత్యాది అంశాలలో అభివృద్ధి బాధ్యత స్థానిక సంస్థలకివ్వాలి.
- ఈ బాధ్యతలు నిర్వహించటానికి అవసరమైన వనరులు, అధికారాలను ప్రభుత్వం ఈ స్థానిక సంస్థలకు బదలాయించాలి.
- జిల్లా కలెక్టరు జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా వ్యవహరించాలి. జిల్లా పరిషత్తు కేవలం సలహాదారుగా ఉండి పర్యవేక్షిస్తూ ఉండాలి.
- స్థానిక సంస్థలపై ప్రభుత్వశాఖల నియంత్రణ మితిమీరి వాటి సక్రమ విధి నిర్వహణకు అవరోధాలు కాకూడదు.

1958లో జాతీయ అభివృద్ధి మండలి బల్వంత్ రాయ్ కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలను ఆమోదించి, ఈ వ్యవస్థను నెలకొల్పే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంచింది. ఈ దశలోనే పంచాయితి రాజ్ అనే పదం విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. బల్వంత్ రాయ్ మెహతా కమిటీ నివేదిక పర్యవసానంగా మొట్టమొదటగా రాజస్థాన్ ప్రభుత్వం తమ రాష్ట్రంలో మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. అక్టోబర్ 2, 1959 తేదీన రాజస్థాన్ లోని నగౌర్ జిల్లాలో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దీనికి ప్రారంభోత్సవం చేశారు.

బల్వంత్ రాయ్ మెహతా కమిటీ అధ్యక్షుని గురించి కొంత తెలుసుకుందాం. శ్రీ బల్వంత్ రాయ్ మెహతా గుజరాత్‌లోని భావనగర్ పట్టణంలో ఫిబ్రవరి, 19, 1900 తేదీన జన్మించారు. కాలేజీలో బి.ఎ. డిగ్రీ పూర్తి చేసినా కూడా బ్రిటిష్ ప్రభుత్వానికి నిరసనగా తన డిగ్రీ తీసుకొనటానికి నిరాకరించి స్వాతంత్ర్య సమరంలోకి దూకారు. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్‌ల నాయకత్వం కింద బర్డోలి సత్యాగ్రహం, క్విట్ ఇండియా పోరాటాలలో పాల్గొని మొత్తం ఏడు సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం 1957 లో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా పని చేశారు. లోక్ సభ సభ్యునిగా పని చేశారు. పిదప జనవరి 15, 1963 తేదీన గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

1965లో భారత్ పాకిస్తాన్ యుద్ధం జరిగింది. ఈ క్రమంలో గుజరాత్ రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతంలో తీవ్రమైన ఉద్రిక్తత నెలకొన్నది. సెప్టెంబర్ 19, 1965 తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా జామ్‌నగర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో పర్యటించడానికి ఆయన ఒక చిన్న విమానంలో తన భార్య, ఇద్దరు పైలట్లు, ఒక పత్రికా విలేఖరి, ముగ్గురు వ్యక్తిగత సిబ్బందితో వెళ్ళగా, ఆ విమానాన్ని పాకిస్తాన్ కూల్చి వేసింది. అందులో ప్రయాణిస్తున్న అందరూ చనిపోయారు.

ఏప్రిల్ 24 న జాతీయ పంచాయితీ రాజ్ దినంగా ప్రకటించేదానికి ముందు బల్వంత్ రాయ్ మెహతా జన్మదినమైన ఫిబ్రవరి 19 ని ప్రతి సంవత్సరం పంచాయితీ రాజ్ దినంగా కేరళ ప్రభుత్వం పరిగణించేది.

కొసమెరుపు :- బల్వంత్ రాయ్ మెహతా ప్రయాణించిన విమానాన్ని కూల్చి వేసిన 46 సంవత్సరాల తరువాత కైస్ హుసేన్ అనే నాటి పాకిస్తాన్ వైమానికదళ అధికారి ఆగస్టు 2011 లో ఆ విమానాన్ని నడిపిన పైలట్ జహంగీర్ ఇంజనీర్ కూతురు శ్రీమతి ఫరీదాసింగ్‌కు పంపిన ఒక ఉత్తరంలో ఆ ఘటనకు చింతిస్తూ, అప్పటి పరిస్థితులలో గత్యంతరం లేక పోయిందని, తను కేవలం పై అధికారుల ఆదేశాలను పాటించానని తెలిపారు.

**- ఎ. నాగేశ్వరరావు** సెంటర్ హెడ్, నీరు & పారిశుద్ధ్య కేంద్రం

**మొక్కల రకాలు, రైతు హక్కులు, ప్రవర్ధన శాస్త్రవేత్తల హక్కుల (బ్రీడర్ హక్కులు) పరిరక్షణకు మరియు కొత్త రకాలను వృద్ధి పరచడానికి అత్యంత ప్రభావవంతమైన హక్కుల పరిరక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. దీనివల్ల సరికొత్త రకాలను వృద్ధి పరచటం, సంరక్షించడం మరియు కొత్త వంగడాల అభివృద్ధికై జన్యుపరంగా భిన్నమైన రకాలు (జన్యు సంపద) లభించేలా చూడటంలో పాలు పంచుకొన్న రైతుల సేవలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. దీనిని దృష్టిలో వుంచుకొని భారత్ ప్రభుత్వం 'మొక్కల రకాలు మరియు రైతు హక్కుల పరిరక్షణ చట్టం -2001" (PPV & FRACT - 2001) అనే ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించింది.**

ఈ చట్టం సమర్థవంతంగా పనిచేయడానికి భారత ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'మొక్కల రకాల పరిరక్షణ మరియు రైతు హక్కుల ప్రాధికార సంస్థ (PPV & FRA) ను 11 నవంబర్, 2005 న స్థాపించింది. ఈ సంస్థలో అధ్యక్షుడితో పాటుగా 15 మంది సభ్యులు ఉంటారు. అధ్యక్షుడు ముఖ్య కార్యనిర్వాహకుడు. రిజిస్ట్రార్ జనరల్ ఈ ప్రాధికార సంస్థకు కార్యనిర్వహణాధికారిగా వ్యవహరిస్తారు.

- ★ కొత్త రకాల అభివృద్ధికై జన్యుపరంగా భిన్నమైన రకాలను అందించి, వాటిని సంరక్షించి అభివృద్ధి పరిచిన రైతుల సేవలను గుర్తించడం మరియు వారి హక్కులను కాపాడటం.
- ★ దేశంలో వ్యవసాయాభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రవర్ధన శాస్త్రవేత్తల హక్కులను కాపాడటం, కొత్త వంగడాల అభివృద్ధి దిశగా ప్రభుత్వ మరియు ప్రయివేటు పరిశోధన మరియు అభివృద్ధి సంస్థలకు ఉద్దీపన కలిగించటం.
- ★ విత్తన పరిశ్రమల అభివృద్ధికి దోహదపడటం, తద్వారా రైతులకు అతి నాణ్యమైన విత్తనాలు / నారు అందించటం.

### ప్రాధికార సంస్థ సాధారణ విధులు

- ★ కొత్త రకాలు/ వంగడాలు, అవసరార్థం ఉత్పత్తి కావింపబడిన ప్రత్యేక రకాలు మరియు ప్రస్తుతం వినియోగంలో ఉన్న రకాలను నమోదు చేయడం.
- ★ కొత్త రకాల కొరకు అవసరమైన ప్రత్యేకత, సారూప్యత మరియు స్థిరత్వపు పరీక్ష (డస్ పరీక్ష) నిర్వహించడానికి ప్రత్యేక విధి విధానాల ను రూపొందించడం.
- ★ నమోదు కాబడిన రకాల గురించి వివరాలు సమగ్రంగా స్వీకరించడం, క్రోడీకరించి భద్రపరచటం.
- ★ పై వివరాలను తప్పనిసరిగా క్రమానుసార జాబితాలో ఉంచడం.
- ★ రైతు రకాల వివరాలను విడిగా క్రమానుసార జాబితాలో, వివరణ పట్టికతో సహా పేర్కొనటం మరియు భద్రపరచటం.

# మొక్కల రకాలను, రైతుల హక్కులను పరిరక్షించే సంస్థ

## మొక్కల రకాల పరిరక్షణ మరియు రైతు హక్కుల ప్రాధికార సంస్థ

### ప్రాధికార చట్టం ముఖ్య ఉద్దేశాలు

- ★ మొక్కల రకాల పరిరక్షణ, రైతులు మరియు ప్రవర్ధన శాస్త్రవేత్తల హక్కుల కాపాడటం, కొత్త వంగడాల అభివృద్ధిని ప్రోత్సహించడం కొరకు ఒక సమగ్ర ప్రభావ శీల వ్యవస్థను ఏర్పరచటం.



- ★ జన్యు పరంగా భిన్నమైన రకాలు, ఆర్థికంగా లాభసాటి రకాలు మరియు వాటి వృద్ధికి కారణమైన రకాలు మాతృక రకాలు వంటి యొక్క రకాల ను భద్రపరిచిన, అభివృద్ధి పరిచిన, పరిరక్షించిన, కాపాడుతున్న రైతులను లేదా రైతు సమూహాలను మరీ ముఖ్యంగా గిరిజన రైతులు మరియు కుగ్రామ రైతుల ను గుర్తించడం మరియు సత్కరించడం.
- ★ మొక్క రకాలకు, చెందిన సమస్త వివరాలతో జాతీయ స్థాయిలో ఒక నమోదు పుస్తకంగా చేసి దానిని నిర్వహించడం.
- ★ జాతీయ జన్యు బ్యాంక్ అభివృద్ధి చేయడం మరియు నిర్వహించడం.

### చట్టంతో లభించే హక్కులు

*ప్రవర్ధన శాస్త్రవేత్తల హక్కులు (బ్రీడర్ హక్కులు) :* వీరు పరిరక్షింపబడిన రకాలను ఉత్పత్తి చేయడం, అమ్మడం, పంపిణీ చేయడం, ఎగుమతి లేదా

దిగుమతి చేసుకోవడం చేయవచ్చు. వీరు తమ తరుపున ప్రతినిధుల ను / అనుమతి పత్రం కలిగిన వారిని నియమించుకోవచ్చు. తమ హక్కులకు భంగం కలిగిందని భావిస్తే పౌర సంబంధ వ్యాజ్యం ద్వారా న్యాయం పొందవచ్చు.

*పరిశోధకుల హక్కులు :* పరిశోధకులు ఈ ప్రాధికార సంస్థలో నమోదు కాబడిన రకాలను వారి పరిశోధనకై వినియోగించుకోవచ్చు వేరొక కొత్త రకం వృద్ధి చేయడానికి ప్రాథమిక వనరుగా మాత్రమే వినియోగించాలి. మళ్ళీ మళ్ళీ వినియోగించడానికి సంబంధిత హక్కుదారుల నుండి / సంస్థ నుండి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

## రైతుల హక్కులు

- ★ వీరికి కూడా ప్రవర్ధన శాస్త్రవేత్తలకు లభించే హక్కులన్నీ లభిస్తాయి.
- ★ రైతు రకాలను ప్రస్తుతం వాడకంలో ఉన్న రకాలుగా కూడా నమోదు చేయవచ్చు.
- ★ ప్రతి రైతు తమ క్షేత్ర ఉత్పత్తులను అంటే విత్తనంతో సహా, ఈ చట్టం అమలులోకి రాని సమయంలో దాచుకోవచ్చు, వాడుకోవచ్చు, నాటు కోవచ్చు, పరస్పర మార్పిడి చేసుకోవచ్చు, పంచుకోవచ్చు లేదా అమ్ముకోవచ్చు. కానీ ఈ చట్టం ద్వారా రక్షణ కల్పించబడిన రకం పేరు గానీ / బ్రాండ్ గానీ ఉపయోగించకూడదు.
- ★ రైతులు జన్యుపరంగా భిన్నమైన రకాలను కాపాడటం, ఆర్థికంగా లాభం కలుగజేసే రకాలు, మాతృక రకాలు, వృద్ధి పరచడం, భద్ర పరచటం వల్ల గుర్తింపునకు సత్కారానికి అర్హులు.
- ★ రైతులు ఈ చట్టంలోని సెక్షన్ 39(2) ప్రకారం ఏ రకంగానూ సంతృప్తికరమైన ప్రదర్శన చేయనట్లయితే, నష్టపరిహారం కోరే హక్కు వుంది.
- ★ రైతులు తమ హక్కుల పరిరక్షణ కొరకు ప్రాధికార సంస్థను / రిజిస్ట్రార్ లేదా న్యాయ స్థానాన్ని ఆశ్రయించినప్పుడు ఏ విధమైన రుసుము చెల్లించవసరం లేదు.

## రకాలను నమోదు పర్చడం (రిజిస్ట్రేషన్)

ఒక రకాన్ని ప్రాధికార సంస్థతో నమోదు చేయించడానికి పూర్వం దానికి సంబంధించిన ప్రత్యేకత, సారూప్యత మరియు స్థిరత్వపు (డస్ పరీక్ష) జరిపి వాటి వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలి. నమోదుకు అర్హత గల పంటల వివరాలు, వాటి జాతి, ప్రజాతి వివరాలను కేంద్ర ప్రభుత్వం తన అధికార రాజపత్రంలో ప్రచురిస్తుంది. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం 54 పంట రకాలు నమోదు వివరాలపై ప్రకటన చేసింది.

ప్రతి పంటకు డస్ పరీక్ష కొరకు ప్రత్యేకంగా విధి విధానాలు అభివృద్ధి చేయబడినవి. వీటిలో వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, శనగ, మినుము, పెసర, కంది, బఠాణీ, రాజ్‌మా,పత్తి, జనపనార, చెరకు, అల్లం, పసుపు, ఆవాలు, పొద్దు తిరుగుడు కుసుమ, ఆముదము, నువ్వులు, సోయాచిక్కుడు, వేరుశనగ, యాలకులు, గులాబీ, చామంతి, మామిడి, బంగాళదుంప, వంకాయ, టమోటా, బెండ, కాలిఫ్లవర్, కాబేజీ, ఉల్లి, వెల్లుల్లి, పుదీనా, బ్రహ్మి మొదలైనవి ఉన్నాయి..

*ప్రాధికార సంస్థ ఆంగ్ల ప్రచురణలు*

1. ప్లాంట్ వెరైటీ జర్నల్ ఆఫ్ ఇండియా పత్రిక
2. డస్ పరీక్ష విధి విధానాలు




3. టెక్నికల్ బులెటిన్
4. జీన్ బ్యాంకు మాన్యువల్
5. వార్షిక నివేదికలు
6. ఆగ్రో బయోడైవర్సిటీ - హాట్‌స్పాట్స్
7. సీడ్ సస్టైనెన్స్

*నమోదు రుసుము వివరాలు (రిజిస్ట్రేషన్ ఫీజు)*

ప్రాధికార సంస్థలో ఒక రకమైనా నమోదు చేయాలంటే చెల్లించాల్సిన రుసుము వివరాలు పట్టికలో ఇవ్వబడ్డాయి.

| | వివరం | రుసుము |
|---|---|---|
| 1. | వాడుకలో ఉన్న రకానికి | రూ. 1000 |
| 2. | కొత్తరకాలు/ అవసరార్థం ఉత్పత్తి చేయబడిన ప్రత్యేక రకాలు | వ్యక్తిగతం : రూ. 5000<br>విద్యా సంబంధ సంస్థలు: రూ. 7000<br>వాణిజ్య సంబంధ సంస్థలు: రూ. 10,000 |
| 3. | వాడుకలోని రకాలు | వ్యక్తిగతం : రూ. 2000<br>విద్యా సంబంధ సంస్థలు : రూ. 3000<br>వాణిజ్య సంబంధ సంస్థలు : రూ. 5000 |

## నమోదు ధృవపత్రం (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్)

రిజిస్ట్రేషన్‌కు అవసరమైన సమస్త వివరాలు సమర్పించిన రకాల దరఖాస్తులను రిజిస్ట్రార్ పరిశీలించి, ఆమోదించి ధృవపత్రం జారీ చేస్తారు. ఇంతవరకు ప్రాధికారిక సంస్థ వివిధ పంటలకు / రకాలకు సంబంధించి మొత్తం 305 ధృవ పత్రాలను జారీ చేసింది. వీటిలో కొత్త రకాలు -10, వాడుకలో ఉన్న రకాలు -292, రైతు రకాలు- 3 ఉన్నాయి. ఈ ధృవపత్రం 9 సంవత్సరాల కాలపరిమితి కలిగి వుంటుంది. (వృక్ష జాతులు / తీగజాతులకీ 6 సంవత్సరాల కాలపరిమితి మాత్రమే వుంటుంది).

ఈ సమయం తరువాత మరలా వార్షిక రుసుము, రెన్యువల్ రుసుము చెల్లించి కాలవ్యవధి పెంచుకోవచ్చు. అయితే, మొత్తం కాలపరిమితి గరిష్టంగా వృక్ష మరియు తీగ రకాలకు ముందు రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుండి 18 సంవత్సరాలుగా మిగిలిన రకాలకు 15 సంవత్సరాలుగా నిర్ణయించబడింది. ఈ గరిష్ట కాలపరిమితిని పెంచే వీలులేదు. ప్రాధికారిక సంస్థ, సెప్టెంబర్ 2011 నాటికి 3320 దరఖాస్తులను వివిధ వర్గాలనుండి పరిశీలనకు స్వీకరించింది.

## మొక్క రకాల వివరాలు తెలిపే జాతీయస్థాయి రిజిస్టర్

నమోదు చేయబడిన మొక్క రకాలు సమగ్ర వివరాలతో ఒక జాతీయ స్థాయి పుస్తకం ప్రధాన కార్యాలయంలో ఉంచబడింది. ఈ పుస్తకంలో నమోదు కాబడ్డ రకాల, వివరాలు, అంటే పేర్లు, వాటి ప్రవర్ధన శాస్త్రవేత్తల / రైతుల/ యాజమానుల పేర్లు, చిరునామాలు సమగ్రంగా వుంటాయి.

## డస్ పరీక్షా కేంద్రాలు

వేర్వేరు పంటల కొరకు ప్రత్యేకంగా 52 డస్ పరీక్ష కేంద్రాలను ప్రాధికార సంస్థ ప్రారంభించింది. గుర్తించబడిన లేదా ఎన్నిక చేయబడిన రకాలను వృద్ధి పరచడం, డస్ విధి విధానాల కనుగుణంగా వాటి లక్షణాలను, ప్రత్యేకతలను క్రోడీకరించడం, వాటి వివరాలను భద్రపరచడం ఈ కేంద్రాల ముఖ్యోద్దేశం. డస్ పరీక్షా కేంద్రాల గురించి పూర్తి వివరాలు ప్రాధికార సంస్థ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

## సమాజ హక్కులు

- చట్టం ప్రకారం నమోదు కాబడిన రకాలు ఉత్పన్నం, వికాసం కొరకు పాలు పంచుకున్న గ్రామం లేదా జన సమూహం కూడా పరిహారం కోరే వీలుంది.
- భారత దేశంలో ఉండే ఎవరైనా వ్యక్తి / వ్యక్తులు / ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు/ గ్రామం తరపున / ప్రాంతీయ సమాజం తరుపున ఎవరైనా కొత్తరకం వృద్ధిలో పాలు పంచుకుంటే వారు కూడా పరిహారం కోరవచ్చు.

## జాతీయ జన్యుబ్యాంక్ : (నేషనల్ జీన్ బ్యాంక్)

ప్రాధికార సంస్థ తమవద్ద రిజిస్టర్ కాబడిన రకాల యొక్క, విత్తనాలు, మాతృక విత్తనాలు భద్రపరిచేందుకు జాతీయ జన్యు బ్యాంక్‌ను నెలకొల్పింది. ఇక్కడ 5 డిగ్రీల అల్ప ఉష్ణోగ్రత వద్ద ఈ విత్తనాలను రిజిస్ట్రేషన్ కాలపరిమితి ఉన్నంతకాలం నిలువచేసే సదుపాయం ఉంది. అవసరమైతే వీటినుండి తిరిగి విత్తనాలను ఉత్పత్తి చేసి మరలా భద్ర పరచుకోవచ్చు.

## జాతీయ జన్యునిధి (నేషనల్ జీన్ ఫండ్)

- ప్రాధికార సంస్థ జాతీయ స్థాయిలో జన్యు నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధికి కావల్సిన విరాళాలు ఈ క్రింది వారి నుండి సేకరిస్తారు.
- ప్రాధికార సంస్థ సూచించిన విధానంలో లాభాలను పంచుకునే పద్ధతిలో ప్రవర్ధక శాస్త్రవేత్తల నుండి
- రాయల్టీ రూపంలో వార్షిక రుసుము వసూలు ద్వారా
- ప్రవర్ధన శాస్త్రవేత్తలు చెల్లించే ముందస్తు నష్ట పరిహార ధరావత్తు ద్వారా
- జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సంఘాలు ఇచ్చే విరాళాల ద్వారా

## జన్యునిధి వినియోగం

- లాభాలను పంచుకునే విధానంలో చెల్లింపులకు
- రైతులకు / రైతు సమూహాలకు నష్టపరిహారం చెల్లింపులకు
- జీవ ద్రవ్యాలు ప్రత్యేక ఉష్ణోగ్రతల వద్ద భద్రపరచడానికి అమ్యే ఖర్చు.
- లాభాలను పంచుకునే విధానంలో కొత్త పథకాల రూపకల్పనకయ్యే ఖర్చు.

## లాభాలను పంచుకునే పద్ధతి

ఈ పద్ధతి అనేది రైతు హక్కుల చట్టంలో అత్యంత ప్రాధాన్యత కలది. లాభాలను పంచుకునే వీలు భారత పౌరులకు, సంస్థలకు ప్రభుత్వేతర సంస్థలకు ఉంది. కొత్త రకాన్ని వృద్ధి చేసే వారికి ఈ సదుపాయం ఉంది.

## సాంప్రదాయ దేశాలు

ఏ దేశమైతే భారతదేశానికి సమ్మతమైన అంతర్జాతీయ సాంప్ర దాయాలకు అనుగుణంగా మొక్క రకాల పరిరక్షణకు అంగీకరిస్తుందో, ఏ దేశమైతే మొక్క రకాల పరిరక్షణ చట్టం కలిగి వుండి, దాని ప్రకారం భారతదేశంతో ఒప్పందం చేసుకొని ప్రవర్ధన హక్కులు రెండు దేశాల ప్రజలకు అందజేస్తుందో, అటువంటి దేశాల ను సంప్రదాయక దేశాలంటారు.

## మొక్కల రకాలు పరిరక్షణపై పునర్విచారణ జరిపే ట్రిబ్యునల్

ప్రాధికార సంస్థ 'మొక్క రకాల పరిరక్షణ'పై పునర్విచారణ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. రిజిస్ట్రార్ తీసుకున్న నిర్ణయాలు, ఆదేశాలపై ఒక ప్రతినిధిగా, అనుమతి పత్రం ఉన్నవారిగా ట్రిబ్యునల్ ద్వారా పునర్విచారణ కోరవచ్చు.

ఇదే కాక ప్రాధికార సంస్థ తీసుకున్న నిర్ణయాలు-పరిహారం చెల్లింపుల పై అభ్యంతరాలున్నయితే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ తీర్పు అంగీకారం కాకపోతే హైకోర్టును ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ సాధారణంగా ఒక సంవత్సరం లోపు తన నిర్ణయాన్ని ప్రకటిస్తుంది.

*-ఎస్. మధుసూదన్ రెడ్డి, జి. సంతోష్ కుమార్,*
*- కె. విజయ్‌కుమార్, ఆర్. సాయికుమార్,*
*వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్*

# మన చిన్నారులలో పోషకాహార లోపం



**సహారా ఆఫ్రికా కంటే భారత దేశంలో పోషకాహార లోపం గల పిల్లలు ఎక్కువ. ప్రపంచంలో పోషకాహార లోపంతో బాధపడే ప్రతి ముగ్గురిలో ఒక్కరు భారతదేశంలో ఉండటం గమనార్హం. ఈ పోషకాహారలోపాన్ని సరైన పద్ధతులు పాటించడం ద్వారా అధిగమించవచ్చు. దాదాపు 80 శాతం శిశు మరణాలు ఈ పోషకాహార లోపం ద్వారా సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.**

రెండు లేదా మూడు సంవత్సరాల పిల్లల్లో వయస్సుకు తగ్గ పొడవు లేనివారు 46% మంది, వయస్సుకు తగ్గ బరువు లేనివారు 47% మంది, పొడవుకు తగ్గ బరువు లేని వారు 16% మంది భారతదేశంలో ఉన్నారు. వీరందరికీ సరైన పోషకాహారం అందకపోవడం వల్లే వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉంది. భారతదేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు







ఎక్కువగా మధ్యప్రదేశ్ (55%) గాను, తక్కువగా కేరళ (27%) గానూ ఉన్నారు.

పోషకాహార లోపం అనేది కేవలం ఆహారం తీసుకోకపోవడం ద్వారా మాత్రమే రాదని, తల్లులు గర్భవతిగా ఉన్నప్పుడు మంచి ఆరోగ్య నియమాలు పాటించనప్పుడు, అదే విధంగా శుభ్రతతో కూడిన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోనప్పుడు వస్తుందనే విషయం గమనించాలి. సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా, బాలుర కంటే బాలికలు ఎక్కువగా పోషకాహార లోపం బారిన పడుతున్నారు.

ఈ పోషకాహార లోపం అనేది చిన్న పిల్లల్లో తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలకు దారి తీస్తుంది. పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎదగక పోవడం, స్పర్శ తెలియకపోవడం, అభివృద్ధి కాకపోవడం మొదలైన సమస్యలు వస్తాయి. చదువులో కూడా పోషకాహార లోపం గల పిల్లలు వెనుకబడి ఉంటారు. అదే పెద్దవారిలో అయితే త్వరగా మృత్యువు సంభవించే అవకాశం ఉంది. మహిళలు, బాలికలలో, మరీ ముఖ్యంగా మహిళలు గర్భవతిగా ఉన్న సమయంలో సరైన పోషణ లభించనందు వల్ల బరువు తక్కువ పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువ. ఈ కారణంగా దాదాపు 30% మంది పిల్లలు తక్కువ బరువుతోనే జన్మిస్తున్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ప్రతి ముగ్గురు మహిళల్లో ఒక్కరు తక్కువ బరువుతో ఉన్నారు.

ఈ కారణాల ద్వారా పిల్లలు, పెద్దలు మరిన్ని వ్యాధులకు గురి అవుతున్నారు. విటమిన్‌లు, ఖనిజాలు అందకపోవడం వల్ల పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల దెబ్బతింటోంది. దీని ద్వారా మూడు సంవత్సరాల లోపు ఉన్న 74% పిల్లలపై ఎనీమియా ప్రభావం చూపుతోంది. కౌమార దశ అమ్మాయిలపై 90%నికి పైగా, మహిళలపై 50 శాతానికి పైగా ప్రభావం చూపుతోంది.

50% కన్నా తక్కువ మంది గృహిణులు 'అయోడైజ్‌డ్' ఉప్పు వాడకపోవడం వల్ల వారిలో థైరాయిడ్ సమస్యలు తలెత్తడమే కాక, వారిలో గ్రహణ శక్తి 13% తగ్గుతోంది. అయోడైజ్‌డ్ ఉప్పు వాడకపోవడం వల్ల విటమిన్ ఏ లోపంతో అంధత్వం, బుద్ధి మాంద్యత, పిల్లల్లో శిశు మరణాలు దాదాపు సగానికి పైగా కుటుంబాల్లో సంభవించడం జరుగుతోంది.

దీనిపై పంచాయితీరాజ్ సంస్థలు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సి ఉంది. ప్రతి గ్రామ పంచాయితీలో నిర్వహించే గ్రామసభలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. అయోడైజ్‌డ్ ఉప్పు, సమీకృత పోషకాహార వినియోగంపై అవగాహన కల్గించాలి. ప్రజలందరూ అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకునేలా ప్రేరేపించాలి.

అదే విధంగా గ్రామాల్లో గ్రామ అభ్యున్నతికి పనిచేసే భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కూడా పై విషయాలపై దృష్టి సారించి పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపం ద్వారా వచ్చే అనర్థాల గూర్చి అయోడైజ్‌డ్ ఉప్పు వాడకపోవడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు తెలియజేయాలి. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి సరైన పరీక్షల ద్వారా పోషకాహార లోపంతో బాధపడే వారిపట్ల శ్రద్ధ తీసుకోవాలి.

**(ఆధారం: యూనిసెఫ్ వెబ్‌సైట్)**

### మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

**ఒకప్పుడు గ్రామంలో సరైన మౌలిక సౌకర్యాలు లేక చాలా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సమస్యలన్నీ ఒక్కొక్కటి కనుమరుగవుతూ గ్రామ రూపు రేఖలు మారి ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది. ఈ ప్రగతి వెనుక అంకిత భావం, సేవా తత్పరతతో కూడిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శక్తి వుంది. *ఆ గ్రామమే ప్రకాశం జిల్లా, కడవ కుదురు గ్రామం.***

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల చేతిలో సాముదాయిక ఆస్తులు పదిలం











ఈ గ్రామంలో బస్టాండ్ లోపలికి వెళ్ళే రహదారి పాడైపోవడంతో బస్సులు లోనికోచ్చే రాకపోకలు తగ్గాయి. దీంతో అక్రమ ఇసుక రవాణాదారులకు బస్టాండ్ నిలయంగా మారింది. ఏ రోజు చూసినా కనీసం పదికి తక్కువకాకుండా లారీలను పగలంతా అక్కడే నిలిపి ఊరు సద్దుమణిగాక వాటిలో ఇసుక లోడ్ చేసుకుని వెళుతుండేవి. ఏళ్ళ తరబడి ఈ తంతు జరిగినా అధికారులు పట్టించుకొనేవారు కాదు. ఈ వ్యవహారానికి 'చెక్' పెట్టాలనుకున్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఒక రోజు గ్రామంలో కొంతమంది పెద్దల సాయంతో బస్టాండ్ వద్ద నిలిపిన లారీలను బలవంతంగా బయటకు పంపారు. శ్రమదానం చేసి బస్టాండ్ చుట్టు ప్రక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. వెంటనే ప్రొక్లెయిన్‌తో చెత్త చెదారాన్ని పూర్తిగా తీయించారు. ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తెచ్చి గుంతలను పూడ్చారు. ప్రయాణీకులు కూర్చోటానికి రెండు సిమెంటు బల్లలు వేశారు. అనంతరం ఒంగోలు వైపు వెళ్తున్న ఆర్టీసి బస్సులను బస్టాండ్‌లోనికి తీసుకొనిరావలసినదిగా డ్రైవర్లను, కండక్టర్లను అభ్యర్థించారు. అక్రమార్కుల చెర నుండి బస్టాండ్‌ను విడిపించి గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దారు.

ఆ తొలివిజయం భారత్ నిర్మాణ్ వాలంటీర్లలో ఎంతో స్ఫూర్తిని నింపింది. తర్వాత గ్రామంలోని శ్మశాన వాటిక అభివృద్ధితో మరో అడుగు ముందుకేశారు. బలహీనవర్గాల వారు అంతిమ వీడ్కోలుకు వినియోగించుకునే శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన తుమ్మచెట్లు, ముళ్ళ కంపలు, తీవ్ర ఆటంకం కలిగిస్తుండంతో ఈ సమస్య పరిష్కారం కోసం నడుంబిగించారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు. మరుభూమిలోని తుమ్మచెట్లు, చెత్తచెదారాన్ని తగల బెట్టారు. తమ వారికి అంతిమ వీడ్కోలు కలిగే చోట కాస్త ప్రశాంతత కల్పించారు. ఇదే స్ఫూర్తితో మరో అడుగు ముందుకేసి సాంక్రమిక వ్యాధులపై సమరానికి శ్రీకారం చుట్టారు. వ్యాధుల వ్యాప్తికి ప్రజల్లో అవగాహన లోపమే ప్రధాన కారణమన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. జ్వరాలు, ఎక్కువగా ఉన్న కాలనీలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాక బడిముఖం ఎరుగని గిరిజనులను ఒక చోట చేర్చి వారికి చదువు చెప్పేందుకు రంగం సిద్ధం చేశారు. ఇలా ఒక్కో పనిని పక్కాగా చేసుకుంటూ గ్రామాభి వృద్ధికి పాటు పడుతున్నారు. యువతను వెన్నుతట్టి ప్రోత్సహిస్తే, గ్రామ అభివృద్ధిని త్వరితంగా సాధించటం ఏ మాత్రం కష్టం కాదని నిరూపిస్తు న్నారు. మన కడవకుదురు గ్రామ భారత నిర్మాణ్ వాలంటీర్లు.

మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

ఈ దేశం, ఈ గ్రామం, ఈ ప్రజలు నాకేమి చేశారని కాకుండా ఈ గ్రామానికి, నా ప్రజలకు, తద్వారా నా దేశానికి, నా జన్మ భూమికి నేనేమి చేశాను అనే దృక్పథంతో నడుం బిగించిన భారత నిర్మాణ్ వాలంటీర్ల బృందం గ్రామ సౌభాగ్యం కోసం నేను సైతం అంటూ, స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రశంసలందుకొంటున్నారు.



# గ్రామ సౌభాగ్యానికి మేము సైతం...





నెల్లూరు జిల్లాలో సీతారామపురం మండలం, జయపురం గ్రామంలోని భారత నిర్మాణ్ వాలంటీర్లు మద్యం షాపులు తమ గ్రామానికి రానివ్వకుండా నిషేధం విధించారు. గ్రామం ఆవిర్భావం నుంచి మద్యనిషేధం గ్రామంగా పేరున్న గ్రామ సాంప్రదాయాన్ని నిలుపుకుందాం అంటూ గ్రామంలోని యువకులు, మహిళలతో కలసి కృషి చేస్తున్నారు. అలాగే గ్రామ ప్రవేశద్వారంలోని రహదారికిరువైపులా సుమారు 60 చెట్లు (కానుగ, వేప) నాటారు.

గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగపడేలా మలచుకున్నారు. పాఠశాల నూతన భవనాన్ని వాలంటీర్లు దగ్గరుండి నాణ్యతతో నిర్మించుకున్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం కోసం వాలంటీర్లు కృషి చేస్తున్నారు. గ్రామంలో మంచినీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాట్లు చేసి ప్రశంసలందుకొంటున్నారు. వాలంటీర్ల బృందంలో గ్రామ మాజీ సర్పంచ్ టి.గురవయ్య కూడ వాలంటీరుగా మారి అభివృద్ధి పనులను ప్రోత్సహిస్తున్నారు.

## గిరిజనుల జీవన శైలిలో మార్పుల కోసం కృషి

బుచ్చిరెడ్డి పాలెం మండలం రేబాల గ్రామంలో మాజీ సర్పంచ్ వై. పెంచల నరసయ్య ఆధ్వర్యంలో వాలంటీర్ల బృందం ఆ గ్రామంలోని గిరిజనుల సంక్షేమం, జీవనోపాధుల పెంపు, జీవన విధానంలో మార్పుల కోసం కృషి చేస్తూ చెల్లాచెదురుగా ఉన్న గిరిజన జనాన్ని ఒకచోట చేర్చి వారికి విద్యా బుద్ధులు, వేషభాషలు, సంస్కృతీ సాంప్రదాయాలు అలవాటు చేయడానికి కృషి చేస్తున్నారు. అలాగే గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న వారికోసం ఏర్పాటు చేసిన ఆశ్రమంలో వృద్ధులకు చేయూత అందివ్వడం, విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం వంటి వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## పంచాయతీ ఆవరణలో వాలంటీర్ల శ్రమదానం

దగదర్తి మండలం, వెలిపోడు పంచాయితీలో గల వాలంటీర్ల బృందం తమ గ్రామ పంచాయితీ ఆవరణను శుభ్రం చేసి గ్రామస్తుల మన్ననలు పొందింది. ముఖ్యంగా గ్రామ పంచాయితీ అవరణ, పశవులకు నిలయంగా వ్యర్థ పదార్థాలతో నిండి చిల్లచెట్లతో అడవిని తలపిస్తున్న విషయం గమనించిన వాలంటీర్లు ఒక్కపూట శ్రమదానంతో ఆవరణను అందంగా తీర్చిదిద్దారు. అంతకు ముందు గ్రామంలోని డ్రైనేజిని, కాలువలను శుభ్రం చేశారు. పొలాలకు వెళ్లే రోడ్డు బాగు చేశారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఇంటింటా సర్వే చేయించి గ్రామంలో మరుగు దొడ్లను కట్టుకొనే విధంగా అవగాహనా చర్యలు చేపడుతూ, గ్రామస్తుల ప్రశంసలందుకొంటున్నారు.

**ఎ. యెహుషువ,** జిల్లా శిక్షణా మేనేజర్, జిల్లా ప్రజా పరిషత్, నెల్లూరు.

**"భూమి వేడెక్కుతోంది"!, "పర్యావరణాన్ని రక్షించుకుందాం!" వంటి హెచ్చరికలు తరచుగా వింటున్నాం. కాని ఏమేరకు చర్యలు తీసుకుంటున్నామని ఒక్కసారి ప్రశ్నించుకుంటే సమాధానం నిరాశాజనకమే!**

భూతాపం కారణంగా చుట్టూ ఉన్న సముద్రాల మట్టాలు పెరిగి పలు ద్వీపదేశాలు, లోతట్టు ప్రాంతాలు కనుమరుగవతాయంటే ప్రపంచం బిత్తరపోయింది. భూమి వేడెక్కుతోన్న కారణంగా సముద్ర మట్టాలు ఈ శతాబ్దం చివరి నాటికి కనీసం



# పర్యావరణాన్ని రక్షించుకుందాం!

ఒక మీటరు వరకు పెరగడం తప్పదని శాస్త్రవేత్తలు అంచనా. ప్రపంచ వ్యాప్తంగా పదికోట్లకు పైగా ప్రజలు సముద్ర మట్టాలకు దిగువన జీవిస్తున్నారు. సముద్ర మట్టానికి ఒక మీటరు, మీటరున్నరపైన ఉంటున్న వారి సంఖ్య సుమారు ఆరేడు కోట్లపై మాటే. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను నియంత్రించి, వాతావరణ మార్పును సాధించ గలిగితే భూతాపాన్ని గణనీయంగా తగ్గించవచ్చనేది నిర్వివాదాంశం.

'గ్లోబల్ హ్యుమానిటేరియన్ ఫోరమ్' నివేదిక ప్రకారం వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పుల వలన ప్రస్తుతం ఆకలి, తీవ్రమైన వ్యాధులు, ప్రకృతి విపత్తుల వంటి వాటితో ఏడాదికి 3 లక్షలకు పైగా చనిపోతున్నారు. 2030 నాటికి కనీసం 50 లక్షలకు చేరవచ్చని అంచనా. ప్రాణం, ఆస్తి, నష్ట ఆస్థాయిలో ఉంటుందో అంతే దారుణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థ పతనం కూడా ఉండగలదు.

భూగోళం వేడెక్కడం వల్ల వివిధ బంధాలలోని మంచు పర్వతాల మంచు క్రమంగా కనుమరుగవుతోంది. ఐక్యరాజ్యసమితి వాతావరణ నివేదిక అంచనా ప్రకారం... గ్లోబల్ వార్మింగ్ మూలంగా 2035 నాటికి ఆసియాలోని అతి ముఖ్య జీవనదులన్నీ ఎండిపోతాయి. దీని కారణంగా 250 కోట్ల మంది ప్రజలు బాధలకు గురికాగల ప్రమాదాన్ని ఐక్యరాజ్యసమితి సూచిస్తోంది.

ఇటువంటి ప్రమాదకరమైన విపత్తును ఎదుర్కోవటానికి ఐక్యరాజ్య సమితి నేతృత్వంలో 172కు పైగా దేశాలు 1992లో బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో సమావేశమయ్యాయి. "వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ముసాయిదా ఒప్పందం" ప్రకారం వాతావరణ సమతాస్థితిని దెబ్బతీయని స్థాయిలో విషపూరిత వాయువుల మోతాదును పరిమితం చేయడం అనే లక్ష్యానికి మార్గం సుగమమైంది. నీటికొరత, హానికర ఉత్పత్తుల నియంత్రణ, ప్రజారవాణా వ్యవస్థ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులకు ప్రోత్సాహం, నీటికొరత, కాలుష్యాల ప్రభావం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. స్వచ్ఛంద బాధ్యతగా స్వీకరించి, పారిశ్రామిక దేశాలన్నీ కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ సమావేశానికి కొనసాగింపుగా 1997 డిసెంబర్‌లో జపాన్‌లోని క్యోటోలో ప్రపంచ దేశాలు సమావేశమై ఒక పరస్పర అంగీకారానికి వచ్చాయి. 2012 నాటికి కర్బన ఉద్గారాలను 5.2 శాతానికి తగ్గించుకుంటామని పేర్కొన్నాయి.

ఈ దేశాలు వాతావరణం మార్పులకు సంబంధించిన అధ్యయనాలు, ప్రాజెక్టుల నిర్వహణ, సాధించిన విజయం వెల్లడి వంటి అంశాలలో సాంకేతిక ఆర్థిక సహకారాన్ని స్వచ్ఛందంగా అందించాలని క్యోటో సదస్సు తీర్మానం చేసింది. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు వర్ధమాన దేశాలు కూడా దీనికి కట్టుబడాలని ఆదేశించింది.మూడవ కీలక సమావేశం డిసెంబర్ 2009లో 'కోపెన్ హెగెన్'లో జరిగింది. 2020 నాటికి పారిశ్రామిక దేశాలు కర్బన్ ఉద్గారాలు 10-40 శాతం వరకు తగ్గించుకోవాలని, సాంకేతిక తోడ్పాటు సవ్యంగా అమలు కావాలని ఈ సదస్సు తీర్మానించింది. కాని సంపన్న దేశాలు పరస్పరం విమర్శలకే పరిమితమై లక్ష్యం ఆశించిన మేరకు సాధ్యం కాలేదని రుజువైంది. తాజాగా దోహాలో జరిగిన వాతావరణం సదస్సులో పాల్గొన్న దేశాలు నిర్లక్ష్యాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శించడంతో వాతావరణం

ప్రియుల ఆశలు నీరుగారిపోయాయి. ఇంతకుముందు జరిగిన సదస్సుల స్థాయికి ఏమాత్రం పోలికలేని విధంగా నిర్వహించిన 'దోహా' తీరు అత్యంత శోచనీయం. 200 పైగా దేశాలు భాగస్వాములైన సదస్సులో పరస్పర విమర్శలు మినహా దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేర్చగల అనవాళ్లు ఎక్కడా ఆవిష్కృతం కాలేదు. ఆర్థికంగా బలపడిన సంపన్న దేశాల దృష్టిలో ఈ తరహా సదస్సులు ఎటువంటి దిశానిర్దేశం చేయలేనివే. ప్రకృతి వనరుల్ని అక్రమంగా వినియోగించుకుని ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీస్తున్న చర్యలకు కారణం పారిశ్రామిక దేశాలే అన్నది నిష్టుర సత్యం. వాతావరణ సంక్షోభానికి కారణమైన అనేక చర్యల కారణంగా వర్ధమాన దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. కర్బన ఉద్గారాల వినియోగంపై నిర్దిష్టమైన నియంత్రణ వ్యవస్థలేని కారణంగా భూగోళం మరింత వేడెక్కగల సూచనలు కనిపిస్తున్నాయి.



పలురకాల కాలుష్యాల వలన వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీని కారణంగా రుతుపవనాలు క్రమం తప్పుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో విపరీత వర్షపాతం, కొన్ని చోట్ల తీవ్ర వర్షాభావం వంటి పరిస్థితులు ఏర్పడి జనజీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మానవుల్నేకాక కోట్ల జీవరాశుల్ని సైతం ఇక్కట్లకు గురిచేసే అనాలోచిత నిర్ణయాలకు కట్టడి వేయాలి.

ప్రపంచ జనాభా 700 కోట్ల మందిలో సుమారు మూడోవంతు ప్రజలు తీవ్రమైన కాలుష్యం నిండిన ప్రదేశాల్లో నివసిస్తుంటే, మిగిలన వారు పరోక్షంగా కాలుష్యం కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక పారిశ్రామిక దేశం విడిచిన విషవాయువులు పర్యావరణాన్ని నాశనం చేయడమే కాక పొరుగు దేశాన్ని బలి తీసుకుంటున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో చట్టాలు అందుబాటులో ఉన్నాయి. కాని వాటి అమలు పట్ల సభ్యదేశాలు చొరవ చూపడం లేదు. "మనుషుల్లో నైతిక విలువలు పతనం కావడానికి, పర్యావరణం మరింతగా దెబ్బతినడానికి మధ్య పరస్పర ఆధారిత సంబంధం ఉందని ప్రముఖ పర్యావరణ శాస్త్రజ్ఞుడు డాక్టర్ పచౌరి అభిప్రాయం.

ఇటీవలే ముగిసిన దోహా వాతావరణ సదస్సు సాక్షిగా సంపన్న దేశాలు కర్బన ఉద్గారాలు నియంత్రణకు ఎంత మాత్రం సహకరించడం లేదనేది తేట తెల్లమైంది. అంతేకాదు వాతావరణం పరిరక్షణ కోసం వర్ధమాన ప్రపంచ దేశాలకు ఇతోధిక సాంకేతిక. ఆర్థిక తోడ్పాటును అందించే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం గమనార్హం. సకల జీవరాశులు కనుమరుగయితే ఎంత సంపద పోగుపడినా ఎవరికి ప్రయోజనం? మానవ పరిణామ క్రమంలో మేథ సృజియించిన ఫలాలు భావితరాలకు వరాలుగా మారాలి తప్ప శాపాలుగా పరిణమించ కూడదనేది సర్వామోదం. ఆదిశగా మానవజాతి మనుగడ, కోటాను కోట్ల జీవరాశుల ఉనికిని పరిరక్షించగల ఉపశమన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ స్వీకరించాలి. అప్పుడే భూమాత చల్లబడుతుంది.

**- అంతటి అనంత్**

## అపార్డు డి.టి.యం. వెంకటయ్యకు "దళిత రత్న" అవార్డు



డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను, బాబు జగ్జీవన్‌రామ్ గారి పరిపాలనా దక్షతకు వారి ఇరువురి సేవా దృక్పథానికి అంకితమై, దళిత, గిరిజన కులాల, అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తూ, సాంఘిక అసమానతల నిర్మూలనకు, సమసమాజ నిర్మాణం కొరకు అణగారిన జాతి జనులలో చైతన్యానికి సరియైన దారిలో నడిపించడానికి పరిశ్రమిస్తూ, సామాజిక న్యాయం చేకూర్చడానికి పనిచేసిన అపార్డు డి.టి.యం. వెంకటయ్యకు 'దళిత రత్న' అవార్డునిచ్చారు.

మహబూబ్‌నగర్ జిల్లా నందు దళిత, దళితుల ఉన్నతికి చిత్త శుద్ధి, నిబద్ధతతో పనిచేస్తున్న గుండుమాల్ గ్రామ వాస్తవ్యులు బట్టగాళ్ళ వెంకటయ్య సేవలను గుర్తించి సాంఘిక సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తేది : 14:04:2013న డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 123వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డా॥ బాబు జగ్గీవన్‌రామ్ మరియు బాబా సాహెబ్ అంబేద్కర్ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాల కమిటీ - 2013 మరియు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్తంగా "దళిత రత్న" అవార్డును ప్రదానం చేసారు.

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**